ఆదివారం
24-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 63
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కుబేరుడు ఎలాన్ మస్క్

న్యూఢిల్లీ: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచ కుబేరుడిగా నిలిచారు. ఆయన సంపద 334.3 బిలియన్ డాలర్లు పెరగడంతో రికార్డులకెక్కారు. టెస్లా షేర్ల విలువ పెరుగుదల నేపథ్యంలో మస్క్ ఆదాయం పెరిగింది. ఫోర్బ్స్ ప్రకారం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయంతో టెస్లా షేర్లు ఏకంగా 40శాతం పెరిగాయి. కంపెనీ స్టాక్స్ శుక్రవారం 3.8శాతం లాభంతో 352.56 డాలర్ల వద్ద ముగిసింది. మూడేళ్లలో ఇంత పెంపుదల నమోదు కాలేదు. స్టాక్స్ పెరుగుదల నేపథ్యంలో మస్క్ సంపద ఏడు బిలియన్లు పెరిగింది. ట్రంప్‌తో మస్క్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో 235.3 బిలియన్లతో ఒరాకిల్ చైర్మన్ లారీ ఎల్లిసన్ రెండోస్థానంలో ఉన్నారు. ఎల్లిసన్ కంటే 80 బిలియన్ల సంపదతో కుబేరుల జాబితాలో మస్క్ నంబర్ వన్‌గా నిలిచారు.

మహారాష్ట్రలో మహాయుతి

జార్ఖండ్‌లో ఇండియా

జయభేరి

మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభల ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటములే తిరిగి అధికారం నిలబెట్టుకున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఒక్క మహారాష్ట్రలోనే ప్రస్ఫుటించాయి. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి విజయం సాధించింది. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. మొత్తం 288 స్థానాలకుగాను ఎన్డీఏలో భాగమైన మహాయుతి కూటమి 236 స్థానాలు గెలుచుకోగా... ఇండియా ఐక్య సంఘటనలో భాగమైన ఎంవీఏ కూటమి 48 స్థానాలకే పరిమితమైంది. జార్ఖండ్‌లో మాత్రం ఇండియా ఐక్య సంఘటనలో భాగమైన జేఎంఎం కూటమి జోరు ప్రదర్శించింది. మొత్తం 81 స్థానాలకుగాను 56 స్థానాల్లో ఘన విజయం అందుకుంది. ఇక బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 24 స్థానాలకు పరిమితమైంది. ఇతరులు ఒక స్థానంలో గెలుపొందారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. అలానే మహారాష్ట్రలో కూడా జరుగుతుందని... తమ కూటమి విజయం సాధిస్తుందని ఫలితాలకు ముందు ఎంవీఏ ధీమా వ్యక్తం చేసింది. కానీ ఫలితాలు మహాయుతికి అనుకూలంగా వచ్చాయి. ఆరు నెలలకు ముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన ఉవ్వెత్తున ఎగిసిపడింది. మహారాష్ట్రలో అత్యధిక లోక్‌సభ సీట్లు సొంతం చేసుకుంది. 48 లోక్‌సభ స్థానాలు ఉండగా... అందులో కాంగ్రెస్ 13, ఉద్ధవ్ ఠాక్రే పార్టీ 9, శరద్ పవార్ పార్టీ 8 లోక్‌సభ సీట్లు గెలుచుకుంది. ఎన్డీఏ కూటమికి గట్టి షాకిచ్చింది. మహారాష్ట్రలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి ఇది గట్టి బలాన్నిస్తుందని 'ఇండియా' భావించింది. లోక్‌సభలో వచ్చిన ఫలితాలే అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతమవుతాయని కాంగ్రెస్ నేతృత్వంలోని ఎంవీఏ కూటమి భావించింది. కాగా, జార్ఖండ్‌లో ప్రధాని మోదీ సహా బీజేపీ అగ్రనేతలు చేసిన ప్రచారాన్ని ఓటర్లు విశ్వసించలేదు. హేమంత్ సోరెన్ నేతృత్వంలోని కూటమి హామీలకు ప్రజలు పట్టంకట్టారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపనప్పటికీ జేఎంఎం దూసుకుపోయింది. భార్యాభర్తలు హేమంత్, కల్పన రాష్ట్రమంతా తిరిగి కూటమి గెలుపునకు శ్రమించారు.

వివరాలు లోపలి పేజీల్లో.. ▶▶

2 లో
ప్రియాంకగాంధీ ఘన విజయం

కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ రికార్డు విజయం సొంతం చేసుకున్నారు.

మహారాష్ట్ర సీఎంపై ఉత్కంఠ

ఫడ్నవీస్ లేదా ఏక్‌నాథ్ షిండే 2లో

రోడ్డు ప్రమాదంలో ఏడుగురి దుర్మరణం

విశాలాంధ్ర-శింగనమల : పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లి తిరిగిరానిలోకానికి చేరుకున్న హృదయవిదారక ఘటన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద శనివారం జరిగింది. వివరాలివి. పుట్లూరు మండలం ఎల్లుట్లకు చెందిన 13 మంది కూలీలు అరటి తోటలో రసాయనిక ఎరువులు చల్లేందుకు తలగాసిపల్లి వెళ్లారు. పని ముగించుకుని ఆటోలో తిరుగుప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్

- మిగతా 2 లో

వాయుగుండం ముప్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దక్షిణ అండమాన్ సమీపంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, రెండు రోజుల్లో వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ శనివారం వెల్లడించింది. తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. తీవ్ర వాయుగుండం బలహీనపడి ఈ నెల 27 నాటికి తమిళనాడు లేదా ఏపీలో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది.

ఖర్గేతో ప్రియాంక భేటీ

న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్ నుంచి ఘన విజయం సాధించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. నాలుగు వేలకుపైగా మెజారిటీతో విజయం అందుకున్న ప్రియాంకను ఖర్గే అభినందించారు. శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇద్దరు మిఠాయి తినిపించుకున్నారు. ఖర్గే మాట్లాడుతూ ప్రియాంక చురుకైన నాయకత్వం, కరుణ, దయ, సంకల్పం, నిబద్ధత ప్రజాస్వామ్యానికి మరింత దోహదపడతాయని నమ్మకంగా చెప్పారు. వయనాడ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహారాష్ట్ర ఫలితం ఊహించలేదని, ఓటమికిగల కారణాలను అన్వేషిస్తున్నామని ఆయన చెప్పారు.

బీజేపీని నమ్మని జార్ఖండ్

రాష్ట్రంలో ఏర్పాటు కానున్న ఇండియా ప్రభుత్వం: డి.రాజా

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో ఇండియా ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. బీజేపీని రాష్ట్ర ప్రజలు నమ్మలేదని, ఆ పార్టీ ప్రచారంతో సంతృప్తి చెందలేదన్నారు. జార్ఖండ్‌లో బీజేపీ నేతలు అవినీతి, చొరబాట్లపై ప్రచారం సాగించారు కానీ వాటిపై ప్రజలకు నమ్మకం కురదలేదు. చొరబాట్లు అరికట్టడం కేంద్రప్రభుత్వ బాధ్యతని రాజా చెప్పారు. 'మహారాష్ట్రలో ఎన్‌డీఏ... జార్ఖండ్‌లో జేఎంఎం, కాంగ్రెస్ మిత్రపక్షాల 'ఇండియా' గెలిచాయి. ఈ మేరకు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. జార్ఖండ్‌లో ఇండియా ప్రభుత్వం ఏర్పాటు కానుంది. చొరబాట్లపై బీజేపీ ప్రచారాన్ని జార్ఖండ్ ప్రజలు తిరస్కరించారు. చొరబాట్ల కట్టడికి బాధ్యత కేంద్రానిదే' అని రాజా వ్యాఖ్యానించారు.

ఈ ఫలితం అనూహ్యం: రాహుల్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి పరాజయంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఫలితాలు అనూహ్యమని, సమగ్రంగా విశ్లేషిస్తామని అన్నారు. కాగా జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలపై మాట్లాడుతూ.. రాజ్యాంగంతోపాటు నీరు, అడవులు, భూమిపై విపక్ష కూటమి సాధించిన విజయమన్నారు. వయనాడ్‌లో

- మిగతా 2 లో

అభివృద్ధి గెలిచింది

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అభివృద్ధి గెలిచింది.. సుపరిపాలన గెలిచింది అంటూ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "అభివృద్ధి గెలిచింది.. సుపరిపాలన గెలుస్తుంది!.. ఐక్యంగా మేము మరింత ఎత్తుకు వెళ్తాము...ఎన్డీఏకి ఇంతటి చారిత్రాత్మక విజయం ఇచ్చినందుకు మహారాష్ట్రలోని నా సోదర సోదరీమణులకు, ముఖ్యంగా రాష్ట్ర యువత, మహిళలకు

- మిగతా 2 లో

సాగులో ఆధునికత అవశ్యం

రైతు సదస్సు మూడు రోజులు నిర్వహించండి

ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు, వ్యవసాయ పనిముట్లు ప్రదర్శన

వ్యవసాయశాఖపై రేవంత్‌రెడ్డి సమీక్ష

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న ఆధునిక మార్పులపై రైతన్నలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వ్యవసాయ శాఖపై శనివారం అధికారులతో సీఎం సమీక్షించారు. ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రైతు సదస్సుపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రైతులంతా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసే సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల సభను బహిరంగ సభలా కాకుండా... అవగాహన కల్పించే సదస్సుగా నిర్వహించాలని అన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెళకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాట్లు

- మిగతా 2 లో

అదానీకి అమెరికా సమన్లు



న్యూయార్క్: అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీతో పాటు ఆయన మేనల్లుడు సాగర్‌కు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సమన్లు జారీ చేసింది. సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు పొందేందుకు 265 మిలియన్ డాలర్ల (రూ.2,200 కోట్లు) లంచం ఇచ్చారన్న ఆరోపణలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని కమిషన్ కోరింది. అహ్మదాబాద్‌లోని అదానీ శాంతివన్ ఫామ్ నివాసానికి, అలాగే మేనల్లుడు సాగర్ బోడక్‌దేవ్ నివాసానికి సమన్లు పంపింది. ఈ నెల 21న న్యూయార్క్ ఈస్ట్రన్ కోర్టు నుంచి నోటీసులు పంపింది. సమన్లు అందుకున్న 21 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని చెప్పింది. గౌతమ్ అదానీ అమెరికన్ ఇన్వెస్టర్లను మోసం చేశారని, ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చినట్లు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పార్టీలో పూర్తి మెజారిటీ వచ్చేసింది కదా, తననెవరూ కొనుక్కోరని ఆ ఏడుపు!

'లగచర్ల' గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

రేవంత్ రెడ్డికి కూనంనేని వినతి

విశాలాంధ్ర-హైదరాబాద్: లగచర్ల ఘటనపై విచారణ జరిపించాలని, అమాయక గిరిజనులపై కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ తదితర వామపక్ష నాయకులతో కలిసి ఆయన శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. సమావేశం అనంతరం కూనంనేని మాట్లాడుతూ లగచర్ల ఘటనపై విచారణ చేపట్టవచ్చు కానీ గిరిజనులపై కేసులు లేకుండా చేయాలని కోరగా రేవంత్‌రెడ్డి అంగీకరించినట్లు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేస్తున్నది ఫార్మాసిటీ కాదని, ఇండస్ట్రియల్ పార్కు అని చెప్పారన్నారు. జనావాసాల మధ్య ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తే అంగీకరించబోమని సీఎంకు తేల్చిచెప్పామని కూనంనేని అన్నారు. పరిశ్రమలు ప్రభుత్వ మిగులు భూములలో ఏర్పాటు చేసుకోవాలని... లేకపోతే రైతులు ఒప్పుకుంటే వారికి పూర్తి నష్ట పరిహారం చెల్లించిన తరువాతే వారి భూముల్లో పనులు చేపట్టాలని సూచించామన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులు ఇప్పటివరకు స్థిరపడలేదన్నారు. నిర్వాసితుల విధానాన్ని

- మిగతా 2 లో

దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే గట్టి పునాది

మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలతో స్పష్టం: కేటీఆర్

మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను, జార్ఖండ్‌లో బీజేపీని ప్రజలు తిరస్కరించటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే గట్టి పునాదులన్న సందేశం ఇచ్చే విధంగా రెండు రాష్ట్రాల ఓటర్లు తమ తీర్పు ఇచ్చారని చెప్పారు. 2 లో

ఇది సమష్టి విజయం

- బీజేపీ గిమ్మిక్కులకు చెక్
- అభివృద్ధిని విశ్వసించిన జార్ఖండ్ ప్రజలు: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: జార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు సమష్టి విజయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ... బీజేపీ తలకిందులుగా తపస్సు చేసినా విజయాన్ని అందుకోలేకపోయిందన్నారు. వారి గిమ్మిక్కులు ఇక్కడ సాగవని చెప్పారు. మైన్స్, మినరల్స్ జార్ఖండ్ రాష్ట్ర ప్రజలకే చెందాలని, అదాని, అంబాని వంటి క్రోనీ క్యాపిటలిస్టులకు ఏ మాత్రం అవకాశం ఇవ్వొద్దని తాము ప్రజలకు విజ్ఞప్తి చేశామన్నారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇక్కడికి వచ్చి ఒకటే మాట చెప్పారని, సంవిధాన్ సమ్మేళన్ భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ దాని ద్వారా వచ్చిన హక్కులను కాపాడుతామని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం సంపద, ఆస్తులు సమానంగా పంచబడాలని రాజ్యాంగం చెబుతుందని తమ పార్టీ నాయకత్వం అదే విషయాన్ని వివరంగా ప్రజలకు

- మిగతా 2 లో

పనికిరాని ఒప్పందాలు వద్దు

ఐరాస వాతావరణ సదస్సుకు నిరసన సెగ - పౌర సంఘాల మౌన ప్రదర్శన

జెనీవా: ఐక్యరాజ్య సమితి వాతావరణ సదస్సుకు నిరసన సెగ తాకింది. వాతావరణ వార్షిక సాయాన్ని 250 బిలియన్ డాలర్లకు 2035 నాటికి పెంచాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు చేసిన ప్రతిపాదనను ప్రజా సంఘాల సభ్యులు నిరసించారు. తాజా ఒప్పందం పనికిరానిదని, అవమానకరమని, అన్యాయమైనదని నిరసనకారులు విమర్శించారు. సదస్సు వేదిక మీదగా మౌన ప్రదర్శన చేపట్టారు. అక్కడ నినాదాలపై నిషేధముంది. 'గ్లోబల్ సౌత్ ప్రజల పక్షాన నిలవాలని మిమ్మల్ని కోరుతున్నాం. ఐకు సదస్సులో చెత్త ఒప్పందం చేసుకోవడం కంటే ఒప్పందం జరగకపోవడమే మేలు. అభివృద్ధి చెందిన దేశాల మొండితనం వల్ల ఇప్పుడు జరిగినది చాలా చాలా చెత్త ఒప్పందం' అని జీ77, చైనాకు వాతావరణ కార్యాచరణ నెట్‌వర్క్ (కేఏఎన్) లేఖ రాసింది. 1,900 పౌర సంఘాలకుపైగా కేఏఎన్ ప్రాతినిధ్యం వహిస్తోంది. బలహీన ఒప్పందాలు వద్దని సూచించింది. 'కాప్ సదస్సులో పటిష్ఠమైన ఒప్పందం జరగని పక్షంలో అక్కడ నుంచి నిష్క్రమించడం... మరొక రోజు కొత్తగా ప్రయత్నించడం మేలు' అంటూ హితవు పలికింది. వాతావరణ కార్యాచరణ వ్యయం గురించి అభివృద్ధి చెందిన దేశాలకు అవగాహన ఉన్నది, వార్షికంగా ట్రిలియన్ల డాలర్లు ఖర్చు అవుతున్నాయి. అయినప్పటికీ నామమాత్రంగా 250 బిలియన్ డాలర్లను ప్రాతిపాదించడంతో దీనిపై వారికి ఏ మేరకు చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతోంది' అని శిలాజ ఇంధనం నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ ఇనిషియేటివ్, గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ డైరెక్టర్ హర్‌జీత్ సింగ్ వెల్లడించారు.

ప్రముఖ పర్యావరణవేత్త గ్రెటా థన్‌బర్గ్ కూడా తాజా పరిణామాన్ని దుయ్యబట్టారు. వాతావరణ సంక్షోభ బాధితులు లక్షల మందికి ఇది మరణ శాసనమే అంటూ దుయ్యబట్టారు. పూర్తిగా విశాసనకరమైన ఒప్పందం జరిగిందని వ్యాఖ్యానించారు. సంపన్న దేశాలు అందించాల్సిన వాతావరణ నిధి ప్యాకేజీ 2035 నాటికి ఏడాదికి 250 బిలియన్ల డాలర్లు చొప్పున ఉండాలని కాప్ సదస్సులో ముసాయిదాను విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు వనరుల నుంచి సేకరించే నిధులతో సహా 2035 కల్లా ఏటా 1.3లక్షల కోట్ల డాలర్ల మేరకు నిధులను సమీకరించడానికి విస్తృత లక్ష్యాన్ని కూడా ఈ ముసాయిదా నిర్దేశించింది. గ్లోబల్ వార్మింగ్ వల్ల తలెత్తుతున్న దుష్ప్రభావాలను ఎదుర్కొనడానికి, కాలుష్య ఉద్గారాలను తగ్గించడానికి పేద దేశాలకు సహాయపడేలా నిధుల సమీకరణ ప్రణాళికపై అంగీకారం కుదుర్చుకోవాలన్నది కాప్ లక్ష్యం కాగా ఈ సదస్సు శుక్రవారం ముగిసింది.

హష్ మనీ కేసులో ట్రంప్‌కు ఊరట

శిక్ష నిరవధిక వాయిదా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టబోయే డొనాల్డ్ ట్రంప్‌కు హష్ మనీ కేసులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు పడిన శిక్షను నిరవధికంగా వాయిదా ఎస్తూ కోర్టు తీర్పు వెలువడింది. ఈ కేసు వాయిదా వేసేంతవరకు శిక్షపై స్టే కోసం దరఖాస్తు మంజూరు చేయమని న్యూయార్క్ జడ్జి జువాన్ మెర్చన్ సూచించారు. దీంతో ట్రంప్‌కు శిక్ష వాయిదా పడింది. హష్ మనీ కేసులో దోషిగా తేలిన ట్రంప్‌కు న్యూయార్క్ కోర్టు ఈనెలలో శిక్ష ఖరారు చేయాలి కాగా ట్రంప్ ఎన్నికతో పరిస్థితుల్లో మార్పు వచ్చింది. శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో ట్రంప్ గడిపారనే ఆరోపణలు... ఆమె నోరు మూయించేందుకు 1.30 లక్షల డాలర్ల హష్ మనీని ట్రంప్ ఇవ్వడం నేపథ్యంలో ఈ కేసు నడిచింది. మొత్తం 34 అంశాల్లో ఆయనపై నేరారోపణలు నమోద య్యాయి. ఆరు వారాల విచారణ అనంతరం ట్రంప్‌పై అభియోగాలన్నీ నిజమేనని 12 మంది జడ్జీలతో కూడిన విస్తృత ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ట్రంప్‌తో ఏకాంతంగా గడిపినట్లు స్టార్మీ కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. మొత్తం 22 మంది సాక్షులను కోర్టు విచారించింది. ఈ కేసులో ఈనెల 26న శిక్ష ఖరారు కావాల్సి ఉండగా ప్రస్తుతం ట్రంప్‌కు శిక్ష నిరవధికంగా వాయిదా పడింది.

ఉక్రెయిన్‌కు మద్దతు ఆపండి

గ్రీస్ ప్రభుత్వానికి కేకేఈ డిమాండ్

ఏథెన్స్: నాటోకు, రష్యాకు మధ్య పోరు తీవ్రమవుతుండటం దృష్ట్యా జెలెన్‌స్కీ ప్రభుత్వానికి మద్దతివ్వడాన్ని తక్షణమే ఆపివేయాలంటూ గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రీస్ ప్రభుత్వానికి కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సోంబస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'రష్యాపై అమెరికా, బ్రిటన్ ఆయుధాలను జెలెన్‌స్కీ ప్రభుత్వం వినియోగిస్తోంది. రష్యా అణు ఒప్పందాన్ని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సవరించారు. రెండు వర్గాల తాజా ప్రకటనలను బట్టి యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతున్నదని స్పష్టమైంది. దీంతో పొంచివున్న ప్రమాదం ఏ మేరకు ఉండవచ్చో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి జెలెన్‌స్కీ ప్రభుత్వానికి సాయం చేయడాన్ని ప్రభుత్వం వెంటనే ఆపేయాలి. ఆయుధాలు పంపడం, ఆర్థిక సాయం అందించడం, ఉక్రెయిన్ పైలట్లకు శిక్షణ ఇవ్వడం, అమెరికా స్థావరాల నిర్వహణ వంటివన్నీ నిలిపివేయాలి. మన దేశానికీ ముప్పు పొంచివున్నది. గ్రీస్‌తో పాటు నాటో సభ్య దేశాలు, ప్రాదేశిక క్షేత్రాలన్నీ యుద్ధంలో చిక్కుకునే ప్రమాదం ఉంది. తక్షణమే మద్దతు ఉపసంహరించడం అవశ్యం' అని దిమిత్రిస్ పేర్కొన్నారు.

అదానీకి అమెరికా సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ ఆరోపించిన విషయం తెలిసిందే. సోలార్ ప్రాజెక్టు కాంట్రాక్టులు పొందేందుకు భారతీయ అధికారులకు 250 మిలియన్ డాలర్లు లంచం ఇచ్చినట్లు గౌతమ్ అదానీ అమెరికాలో క్రిమినల్ అభియోగాలను ఎదుర్కొంటున్నారు. గౌతమ్ అదానీపై విదేశీ లంచం, సెక్యూరిటీల మోసం, వైర్‌ఫ్రాడ్ కుట్ర, సంబంధిత అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. రెండు దశాబ్దాల్లో రెండు బిలియన్ డాలర్ల విలువైన సోలార్ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు అదానీ 250 మిలియన్ డాలర్లకుపైగా లంచం ఇచ్చినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అయితే, అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను ఖండించింది. కంపెనీ కార్యకలాపాలు అన్నిరంగాల్లో పారదర్శకత, నిబద్ధతను ప్రదర్శిస్తామని పేర్కొంది. వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులకు పూర్తిగా కట్టుబడి ఉండే చట్టాలను గౌరవించే సంస్థ అని పేర్కొంది.

ఈ ఫలితం అనూహ్యం: రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

ప్రియాంక గాంధీని స్థానిక ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించినందుకు గర్విస్తున్నానన్నారు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి ప్రియాంక పాటుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సునామీలా విరుచుకుపడింది: ఉద్ధవ్ ఠాక్రే

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అస్సలు ఊహించలేదని ప్రతిపక్ష నేత, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. అధికార మహాయుతి ఒక కెరటంలా కాకుండా సునామీలా విరుచుకుపడిందని వ్యాఖ్యానించారు. ఫలితాలు ఎలా ఉన్నా.. మహారాష్ట్ర హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామన్నారు.

'మహా' ఫలితాలు ఆశ్చర్యకరం: జైరాం రమేశ్

మహారాష్ట్ర ఫలితాలు ఆశ్చర్యకరమని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఎన్నికల పారదర్శకతపై తాము ప్రశ్నలను లేవనెత్తుతూనే ఉంటామన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఎన్నికల్లో పారదర్శకతకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం తమ బాధ్యతన్నారు. జార్ఖండ్ వాసులు తమ కోసం పనిచేసిన ప్రభుత్వాన్నే గెలిపించారని, విభజనవాద రాజకీయాలను తిరస్కరించారని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి గెలిచింది

(మొదటిపేజీ తరువాయి)

హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ విజయం అసమానమైనది. మహారాష్ట్ర ప్రగతికి మా కూటమి నిరంతరం కృషి చేస్తుందని నేను ప్రజలకు హామీ ఇస్తున్నాను. జై మహారాష్ట్ర!" అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

జేఎంఎంకు అభినందనలు

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తమకు మద్దతు ఇచ్చినందుకు జార్ఖండ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యల గురించి మాట్లాడే విషయంలో, రాష్ట్రం కోసం పని చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన జేఎంఎం కూటమికి అభినందనలు తెలిపారు.

'లగచర్ల' గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సవరించే బాధ్యత ప్రభుత్వానిదే అని చెప్పారు. భూమికి బదులు భూమి ఇస్తేనే రైతులు అంగీకరిస్తారన్నారు. పేదలకు, రైతులకు, భూ నిర్వాసితులకు ఇబ్బందులు వచ్చినప్పుడు, పోలీసులు అత్యుత్సాహం చూపిస్తే కమ్యూనిస్టు పార్టీలు స్పందిస్తాయని కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. కూనంనేని వెంట వామపక్ష నాయకులు రమ, పద్మ, జానకి రాములు, జి.రవి ఉన్నారు.

సాగులో ఆధునికత అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని తెలిపారు. ఉద్యానవర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పాదనలన్నీ స్టాళ్లల్లో ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధునాతన వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు... అన్నింటినీ అక్కడ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రైతు సదస్సుకు అప్పటికప్పుడు వచ్చి వెళ్లే విధంగా కాకుండా అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. 28వ తేదీ నుంచే ఈ స్టాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. 23 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.రెండు లక్షల రుణమాఫీ జరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొన్ని చోట్ల ఆధార్‌లో తప్పులు, బ్యాంకు ఖాతాల్లో పేర్ల తప్పులు, కుటుంబాల నిర్ధారణ కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదని వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ముఖ్యమంత్రి కి నివేదికను అందించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి. సీఎంవో స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు పాల్గొన్నారు.

మహారాష్ట్ర సీఎంపై ఉత్కంఠ

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి విజయం సాధించింది. మొత్తం 288 స్థానాలకు గాను 220 స్థానాల్లో గెలుపొందింది. రాష్ట్రంలో మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న తరుణంలో తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమిలోని పెద్ద పార్టీ అయిన బీజేపీనే ఈసారి సీఎం పదవి చేపడుతుందన్న ప్రచారం జరుగుతోంది. కూటమిలో బీజేపీకే అత్యధిక సీట్లు వచ్చాయి. దీంతో ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ బీజేపీ తరపున మహా తదుపరి సీఎం అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఫడ్నవీస్ మద్దతుదారులు సైతం ఇదే డిమాండ్ చేస్తున్నారు.

మహారాష్ట్ర తదుపరి సీఎంగా ఫడ్నవీస్ బాధ్యతలు చేపడతారని బీజేపీ నేత ప్రవీణ్ దరేకర్ వెల్లడించారు. అందువల్ల మహా తదుపరి సీఎంగా ఫడ్నవీస్ ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఫడ్నవీస్ తల్లి సరితా ఫడ్నవీస్ స్పందించారు. కచ్చితంగా తన కుమారుడే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దేవేంద్ర ఫడ్నవీస్ 24 గంటలూ కష్టపడి పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తన కుమారుడు పెద్ద నాయకుడిగా ఎదిగినందుకు సంతోషంగా ఉందన్నారు.

చర్చించి... నిర్ణయిస్తాం: ఏక్‌నాథ్ షిండే

మరోవైపు ఏక్‌నాథ్ షిండేనే మహారాష్ట్ర తదుపరి సీఎం అని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. దీనిపై సీఎం ఏక్‌నాథ్ షిండే మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. అధికార కూటమికే మళ్లీ పట్టం కట్టిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ సీఎం మీరే అవుతారా అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... కూటమిలోని మూడు పార్టీల నేతలం కూర్చుని సీఎం ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పారు. ఈసారి పెద్ద పార్టీ అయిన బీజేపీ సీఎం పదవి చేపడుతుందా..? అని మీడియా ప్రశ్నించగా 'కూటమిలోని పెద్ద పార్టీయే సీఎం పదవి చేపట్టాలనే నిబంధన ఏమీ లేదుగా' అని షిండే వ్యాఖ్యానించారు. మొత్తంమీద సీఎం సీటు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. గెలుపు సంతోషం కంటే కూటమి నేతలకు సీఎం అభ్యర్థి ఎంపికే కష్టతరంగా మారబోతున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటు నేపథ్యంలో బీజేపీ అగ్రనాయకత్వం ఆదివారం ముంబైకి కేంద్ర పరిశీలకులను పంపనున్నట్లు తెలిసింది. వారు కూటమి పార్టీలతో చర్చలు జరపనున్నారు. కూటమిలోని మూడు పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే సీఎం ఎవరన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

26న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం

రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ సిద్ధమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈనెల 25న శాసనసభాపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సీఎం అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఆ తర్వాత రోజు అంటే ఈనెల 26న కొత్త సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. మహా అసెంబ్లీ గడువు ఈనెల 26తో ముగియనున్న విషయం తెలిసిందే. దీంతో గెలిచిన వాళ్లు 72 గంటల్లోగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురి దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)

ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను డి.నాగమ్మ (40), బి. నాగమ్మ (45), బి.నాగన్న (50), రామాంజనమ్మ (38), బాల పెద్దయ్య (45), కొండమ్మ (42), జయరాముడు (40)గా గుర్తించారు. ఈశ్వరయ్య, గంగాధర, రామాంజి నమ్మ, పెద్దులమ్మ, లక్ష్మీదేవి , ఆటో డ్రైవర్ నీలకంఠ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్పీ పీ జగదీశ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్పీ వెంట రూరల్ డీఎస్పీ టీ వెంకటేశులు, సీఐ కౌలుట్లయ్య ఉన్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృత్యువాత పడటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే గట్టి పునాది

విశాలాంధ్ర-హైదరాబాద్: మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను, జార్ఖండ్‌లో బీజేపీని ప్రజలు తిరస్కరించటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే గట్టి పునాదులన్న సందేశం ఇచ్చే విధంగా రెండు రాష్ట్రాల ఓటర్లు తమ తీర్పు ఇచ్చారని చెప్పారు. బీజేపీకి బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని దయనీయ పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని చెప్పారు. కేవలం కాంగ్రెస్ చేతగాని, అసమర్థ విధానాల కారణంగానే బీజేపీ మనుగడ కొనసాగుతుందని చెప్పారు. ప్రాంతీయ పార్టీలు బలంగా లేని చోట మాత్రమే బీజేపీ గెలుస్తుందన్నారు. తమ చేతగానితనాన్ని, అసమర్థతను గుర్తించాల్సింది పోయి ఇప్పటికీ ప్రాంతీయ పార్టీలను ఎలా అంతం చేయాలన్న కుట్రపై కాంగ్రెస్ దృష్టి పెట్టిందని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలన్న కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ కాదు... బీజేపీ తక్కువ కాదన్నారు. ఈ రెండు పార్టీలు కలిసి దేశంలో ప్రాంతీయ పార్టీలు ఉండకూడదన్నట్టు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కుట్రలో భాగంగానే ప్రాంతీయ పార్టీలు చేసిన అభివృద్ధి, వారి ప్రాంతాల కోసం నిబద్ధతతో కృషి చేసిన విధానాలపై కూడా ఆయా పార్టీలు విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రాంతీయ పార్టీలను ఏమీ చేయలేరన్నారు.

ప్రజల కోసం పనిచేయ్...

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఘోర ఓటమి నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలు అంటించారు. తెలంగాణలో ఏదో పొడిచేశామని మీరు చేసిన అబద్ధపు ప్రచారాలను మరాఠా ప్రజలు నమ్మలేదన్నారు. మీ ప్రచారాలు, ప్రసంగాలు, బ్యాగులు, ఛాపర్లు అన్ని కూడా మీ పార్టీని ఘోర ఓటమి నుంచి కాపాడలేకపోయాయని విమర్శించారు. ఇకనైనా ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేయాలని సూచించారు. ప్రాథమిక కర్తవ్యంపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే పని మీద దృష్టి పెట్టాలని కేటీఆర్ సలహా ఇచ్చారు.

తిరుగులేని హేమంత్ సోరెన్

జార్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ లెక్కలు తారుమారు

రాంచీ: జార్ఖండ్‌లో అధికార జేఎంఎం కూటమి మరోసారి విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ మెజారిటీ మార్క్‌ను అందుకుంది. గత 24 ఏళ్ల రికార్డును హేమంత్ సర్కార్ బ్రేక్ చేసింది. ప్రతి ఐదేళ్లకు అక్కడి ఓటర్లు ప్రభుత్వాన్ని మార్చుతున్నారు. ఏ పార్టీ వరుసగా రెండోసారి అధికార పగ్గాలు సొంతం చేసుకోలేదు. అయితే ఈ సారి వరుసగా రెండోసారి అధికారాన్ని సొంతం చేసుకోవడం ద్వారా హేమంత్ సోరెన్ చరిత్ర సృష్టించను న్నారు. ప్రతిపక్ష బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి రెండో స్థానానికే పరిమితమైంది. ఓట్ల లెక్కింపు ఆరంభం నుంచే జేఎంఎం తన జోరును కొనసాగించింది. దీంతో ఎలాగైనా అక్కడ అధికార పీఠాన్ని దక్కించుకోవాలన్న కమలనాథుల ఆశలు అడియాశలయ్యాయి. ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటనలో భాగమైన జేఎంఎం కూటమి మొత్తం 81 స్థానాలకు గాను 56 స్థానాలను కైవసం చేసుకుంది. 43 స్థానాల్లో పోటీ చేసిన జార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) 34 స్థానాల్లో, 30స్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్ పార్టీ 16 స్థానాల్లో విజయం సాధించాయి. 2019తో పోలిస్తే జేఎంఎం అదనంగా నాలుగు స్థానాల్లో గెలుపొందింది. ఇక 7స్థానాల్లో పోటీచేసిన ఆర్జేడీ 4 స్థానాల్లోనూ, 4 స్థానాల్లో పోటీచేసిన సీపీఐ(ఎంఎల్) 2 స్థానాల్లో విజయం సాధించాయి. ఎన్డీఏ కూటమి విషయానికొస్తే... 68స్థానాల్లో పోటీచేసిన బీజేపీ 21 స్థానాలకే పరిమితమైంది. గతంతో పోలిస్తే 4స్థానాలను కోల్పోయి. ఏజేఎస్‌యూ 10స్థానాల్లో పోటీచేసి ఒక్క స్థానంలో గెలిచింది. జేడీయూ 2స్థానాల్లో పోటీచేసి ఒక్క స్థానంలో గెలుపొందింది. ఎల్జేపీఆర్వీ కూడా ఒక స్థానంలో గెలుపొందింది.

ఆ అంశాలే కీలకం

అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు ఓ అవినీతి కేసులో జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ అరెస్టు కావడం కూడా ఆ పార్టీ పట్ల ప్రజల్లో సానుభూతిని పెంచింది. ఈ విషయాన్ని రాజకీయ కుట్రగా ఆరోపిస్తూ ఎన్నికల్లో అస్త్రంగా ఉపయోగించుకుంది. మహిళలకు నెలకు ఇచ్చే వెయ్యి రూపాయలను రూ.2500కు పెంచడం వంటి పథకాలు కలిసి వచ్చాయి. 'సర్నా'ను ప్రత్యేక మతంగా గుర్తించాలని తీర్మానిస్తూ కేంద్రానికి లేఖ రాయడం కూడా కలిసొచ్చినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా హేమంత్ అరెస్టు నేపథ్యంలో ఆయన సతీమణి కల్పనా సోరెన్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేస్తూ బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. అతి తక్కువ కాలంలోనే రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత హేమంత్, కల్పనాలు కలిసి దాదాపు 200 సమావేశాలను నిర్వహించారు.

పని చేయని బీజేపీ అస్త్రాలు

హేమంత్ సోరెన్ అవినీతి ప్రభుత్వమని, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మద్దతిస్తోందని అనే అంశాలను బీజేపీ ఎన్నికల ప్రచారాల్లో ప్రధానంగా ప్రస్తావించింది. హేమంత్ అరెస్టు నేపథ్యంలో సీఎం పగ్గాలు చేపట్టిన చంపై సోరెన్ బయటకు రాగానే రాజీనామా చేయాల్సి వచ్చింది. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన ఆయన బీజేపీలో చేరిపోయారు. హేమంత్ వదిన సీతా సోరెన్ కూడా కాషాయ కండువా కప్పుకోవడం జేఎంఎంకు ఎదురుదెబ్బగా మిగిలింది. చంపయీ సోరెన్‌ను సీఎం పదవి నుంచి తప్పించడం గిరిజనులను అవమానపరచడమే నని ప్రచారం చేసినప్పటికీ ఫలితాల్లో మాత్రం బీజేపీకి మాత్రం నిరాశ తప్పలేదు. ఆదివాసీ ప్రాంతాల్లో చంపాయీకి ఉన్న ప్రజాదరణ ఆ వర్గం ఓట్లను చీలుస్తుందని, అది జేఎంఎం-కాంగ్రెస్ కూటమిపై ప్రభావం చూపిస్తుందని భావించినప్పటికీ ఫలితాలు వేరుగా వచ్చాయి. జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13, 20తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. తొలి విడతలో 43 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగ్గా, మిగిలిన 38 స్థానాలకు రెండో విడతలో పోలింగ్ నిర్వహించారు. ఈసారి రికార్డు స్థాయిలో 67.74 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 81 స్థానాల్లో 1211 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

మహాయుతికే పట్టం

- మహారాష్ట్రలో నిజమైన ఎగ్జిట్‌పోల్స్ లెక్క
- 229 స్థానాలు కాషాయ కూటమి కైవసం
- 55 స్థానాలకే పరిమితమైన ఎంవీఏ

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేస్తూ బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి (ఎన్డీఏ) అధికారాన్ని చేజిక్కించుకుంది. మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 236 స్థానాల్లో విజయం సాధించగా... మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి భారీ ఓటమిని మూటగట్టుకుంది. కేవలం 55 స్థానాలతో సరిపెట్టుకుంది. ఎన్డీఏ కూటమిలో ప్రధానంగా బీజేపీ 149 స్థానాల్లో పోటీ చేసి...133 స్థానాల్లో గెలుపొందింది. 2019తో పోలిస్తే 28 స్థానాలు అదనంగా పొందింది. ఇక షిండే నేతృత్వంలోని శివసేన 81 స్థానాల్లో పోటీచేయగా... 57 స్థానాల్లో విజయం సాధించింది. 16 స్థానాలు అదనంగా గెలుచుకుంది. అజిత్ పవార్ ఎన్సీపీ కూడా 59స్థానాల్లో పోటీచేసి 41 స్థానాల్లో గెలుపొందింది. జేఎస్ఎస్-2, ఆర్ఎస్‌పిఎస్-1, ఆర్ఎస్‌విఎ-1, ఆర్‌వైఎస్పీ-1 స్థానంలో గెలుపొందాయి. 2019లో ఈ పార్టీలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేదు. ఎంవీఏ కూటమి విషయానికొస్తే... 101 స్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్ పార్టీ కేవలం 15 స్థానాల్లో గెలుపొందింది. 2019తో పోలిస్తే అదనంగా 5 స్థానాలు పొందింది. ఇక ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యుబీటీ) 95 స్థానాల్లో పోటీచేసి 20 స్థానాల్లో, ఎన్సీపీ (శరద్‌పవార్) 86 స్థానాల్లో పోటీచేసి 10 స్థానాల్లో గెలుపొందాయి. సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) 2 స్థానాల్లో పోటీచేసి రెండింటినీ గెలుచుకుంది. గతంలో ఈ పార్టీకి అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేదు. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో మహాయుతికి స్పష్టమైన ఆధిక్యం వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఈ కూటమి 150 నుంచి 180 వరకు సీట్లు సాధిస్తుందని వెల్లడించాయి. కానీ 200 పైచిలుకు స్థానాలను కూటమి గెలుచుకోవడం గమనార్హం.

పథకాలు కీలక పాత్ర

2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో ఘోర పరాజయం చవిచూసిన మహాయుతి (ఎన్డీఏ)... అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. ఎన్నికల ముంగిట సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, మహిళలు- అన్ని వర్గాల వారిని ఉద్దేశించి వివిధ సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చింది. ఈ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ప్రభుత్వం మారితే పథకాలు రద్దవుతాయని ప్రచారం చేసింది. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా పథకాల వల్ల ప్రయోజనాలు అందుకున్న ప్రజలు మహాయుతి వైపు మొగ్గుచూపారు.

ప్రియాంకగాంధీ ఘన విజయం

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ రికార్డు విజయం సొంతం చేసుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తొలి ఎన్నికలోనే... ఆమె తన సత్తా చాటుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రియాంక 4,08,036 ఓట్ల మెజార్టీతో తన సమీప సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరిపై గెలుపొందారు. వయనాడ్ ఉప ఎన్నికల్లో ఏకంగా సోదరుడు రాహుల్ గాంధీ మెజార్టీని ప్రియాంక అధిగమించారు. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీకి 3 లక్షల 64 వేల ఓట్ల మెజార్టీ రాగా... ప్రియాంకకు 4 లక్షల 8 వేల ఓట్ల మెజార్టీ లభించింది. సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరి రెండో స్థానంలో, బీజేపీ నుంచి నవ్య హరిదాస్ మూడో స్థానంలో ఉన్నారు.

పార్లమెంటులో నా గళం వినిపిస్తా: ప్రియాంక

వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన ప్రియాంక గాంధీ...నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. "మీరు నాపై ఉంచిన నమ్మకానికి ఉప్పొంగిపోతున్నాను' అని సంతోషం వ్యక్తంచేశారు. పార్లమెంట్‌లో వయనాడ్ గళం వినిపించేం దుకు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'ఈ అపూర్వ విజయాన్ని అందించినందుకు వయనాడ్ ప్రజలకు నా కృతజ్ఞతలు. ఇది మీ విజయమని భావించేలా... మీ కలలు, ఆశలను అర్థం చేసుకున్న వ్యక్తిగా పార్లమెంట్‌లో నా గళం వినిపిస్తాను. ఈ గౌరవాన్ని అందించి, నాపై అపారమైన ప్రేమ చూపినందుకు ధన్యవాదాలు. యూడీఎఫ్‌లోని నా సహచరులు, కేరళ వ్యాప్తంగా ఉన్న నేతలు, కార్యకర్తలు, వలంటీర్లు, నాకోసం ఎంతగానో కష్టపడి పనిచేసిన నా కార్యాలయ ఉద్యోగులకు ధన్యవాదాలు. మీరంతా రోజుకు 12 గంటలు అవిశ్రాంతంగా నాతో కలిసి ప్రయాణించి, మనమంతా నమ్మే ఆశయాల కోసం నిజమైన సైనికుల్లా పనిచేశారు. నా తల్లి, భర్త, పిల్లలు అందించిన ప్రేమ, ధైర్యానికి ఏ కృతజ్ఞతలు సరిపోవు. రాహుల్... నువ్వు అందరికంటే ధైర్యవంతుడివి. నాకు దారిచూపి, నా వెన్నంటి నిలిచినందుకు థ్యాంక్యూ' అని ప్రియాంక ఆ పోస్టులో రాసుకొచ్చారు.

ఇది సమష్టి విజయం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పిందన్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్ కూటమి గత ఐదు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి పనులు... మరోసారి ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఏం చేస్తామో బడ్జెట్ అంకెలు, సంఖ్యలతో సవివరంగా చెప్పామని, కూటమి నేతల మాటలను ప్రజలు విశ్వసించారన్నారు. ఇండియా కూటమికి భారీ మెజారిటీ ఇచ్చి... బీజేపీపై భ్రమలు లేవని ప్రజలు స్పష్టం చేశారన్నారు. ఇండియా కూటమి గెలిస్తే... బంగ్లాదేశ్ నుంచి వలసలు వెల్లువెత్తుతాయని, చొరబాటుదారులు పెరుగుతారని బీజేపీ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. చొరబాటు దారులను నియంత్రించాల్సింది సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ అని, ఆ సంస్థ కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ చేతిలో ఉందని అన్నారు. వారి వైఫల్యం మూలంగానే చొరబాటు దారులు పెరుగుతున్నారని, వారి వైఫల్యాన్ని ఇతరుల వైపు నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెడతామన్నారు.

డీజీపీ నుంచి రివార్డులు అందుకున్న జిల్లా అధికారులు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన జిల్లా పోలీసు అధికారులను ప్రశంసించిన రాష్ట్ర డీజీపి డా. జితేందర్ వారికీ శనివారం ప్రోత్సాహకంగా రివార్డులు అందించారు. భద్రాచలం పోలీస్ స్టేషన్లో గంజాయి అక్రమ రవాణా కేసుల్లోని నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ తోపాటు కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుధీర్‌లకు డీజీపి హైదరాబాదులోని తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అరువార్డులను అందుకున్న అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందిస్తు ఒక ప్రకటనలో వెల్లడించారు. 2023 ఏడాది భద్రాచలం పిఎస్ పరిధిలో 480 కిలోల గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి పదేళ్ల కఠిన కార్యవర్గ శిక్షతోపాటు రూ. లక్ష జరిమానా పడగా, మరో కేసులో మరో ఇద్దరు 484 కిలోలు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరికి కూడా ఒక్కొక్కరికి 12 ఏళ్ల కఠిన కారాశిక్షతోపాటు రూ. లక్ష జరిమానా పడేలా సదరు పోలీస్ అధికారులు కృషి చేసినట్లు ఎస్పీ వివరించారు. సమర్థవంతంగా పనిచేసినందుకు గుర్తించి రివార్డులను అందజేయడం జరిగిందన్నారు.

భద్రాచలం రామాలయ అభివృద్ధికి రూ.70 కోట్లు : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.70 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీకి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నట్లు చెప్పారు. శనివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయ మర్యాదలతో ఆలయంలోకి ఆహ్వానించి మంత్రికి పరిపట్టం పెట్టి స్వామి వారి క్షేత్ర విశిష్టతను వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు , అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 70 కోట్లను రామాలయం మాడవీదుల అభివృద్ధి కోసం విడుదల చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల కూడా రామాలయం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. భద్రాచలం రామాలయం మీద ప్రేమ ఉంది కనుకనే ఇక్కడ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

కొనసాగుతున్న సొసైటీ సభ్యత్వ నమోదు ప్రక్రియ

విశాలాంధ్ర - ఖమ్మం : స్తంభాద్రి జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, ఖమ్మంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. ఇప్పటికే పరిశీలన పూర్తయిన దరఖాస్తుల స్క్రూటీ ని నిర్వహించి అర్హులైన సీనియర్లకు సభ్యత్వాలు పంపిణీ చేయడం జరిగింది. అందుబాటులో ఉన్న డైరెక్టర్ల చేతుల మీదుగా అర్హులైన జర్నలిస్టులు స్తంభాద్రి హౌసింగ్ సొసైటీ సభ్యత్వం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, డైరెక్టర్లు ఏనుగు వెంకటేశ్వరరావు, సాంబశివరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మరి కొంతమంది జర్నలిస్టుల దరఖాస్తుల స్క్రూటీని పూర్తి అయ్యిందని రాబోయే రెండు, మూడు రోజుల్లో మిగిలిన సభ్యత్వాలు కూడా పంపిణీ చేస్తామని సొసైటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తెలియపరిచారు.

మావోయిస్టు హత్యకు నిరసనగా గిరిజనుల రాస్తారోకో

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : వాజేడు మండలంలోని పెనుగోలు గ్రామానికి చెందిన ఆదివాసీలు ఊయిక అర్జున్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నేపంతో, గురువారం అర్ధ రాత్రి ఇద్దరు ఆదివాసీలను హత్య చేసిన, హత్యకాండ, దుర్చర్య సంఘటనను నిరసిస్తూ శనివారం ఏటూరునాగారం మండల కేంద్రం వై జంక్షన్ నుండి బస్టాండ్ వరకు, ఆదివాసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, మావోయిస్టులకు వ్యతిరేకంగా, భారీ రాస్తారోకో, ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించారు. మావోయిస్టులు డౌన్ డౌన్ మావోయిస్టులకు, వ్యతిరేకంగా నినాదాల చేశారు. మావోయిస్టు పోరాటం అంటే, అమాయక ఆదివాసీలను చంపటమే, మావోయిస్టు పోరాటమా, అన్ని పలు నినాదాలు, మావోయిస్తులకు వ్యతిరేకంగా చేశారు. ఈ కార్యక్రమంలో 3000 వేల మంది, గిరిజన ఆదివాసీలు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్అదాలత్

విశాలాంధ్ర - గజ్వేల్ : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని డిసెంబర్ 14 న గజ్వేల్ కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అడిషనల్ సివిల్ జడ్జ్, మండల సేవాధికార సంస్థ చైర్మన్ బి.ప్రయాంక పేర్కొన్నారు. శనివారం పోలీస్ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు పిలుపుమేరకు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసుల పరిష్కారం ద్వారా సత్వర సమన్యాయం కొరకు లోక్అదాలత్ చక్కని వేదికని అభివర్ణించారు. కావున కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోనేందుకు పోలీస్ అధికారులు కృషి చేసి ఎక్కువ మందికీ న్యాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబంది, కోర్ట్ సిబంది, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సింగరేణి కార్మికులకు రూ.18.27 కోట్ల దీపావళి బోనస్ : సీఎండీ బలరామ్

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి సంస్థలో ఈ మధ్యకాలంలో రిటైర్డ్ అయిన కార్మికులకు రూ.18.27 కోట్లు దీపావళి బోనస్ వారి ఖాతాలో పడనుంది. ఏ మేరకు సంస్థ సియండి ఎన్. బలరామ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023- 24 ఆర్థిక ఏడాది, ఏప్రిల్ 1, 2024 నుంచి అక్టోబరు 24, 2024 మధ్యలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు సంబంధించిన పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్ (దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నామన్నారు. ఈనెల 27వ తేదీన వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతుందన్నారు. రిటైర్ అయిన 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్టంగా రూ. 93 750 చొప్పున విడుదల చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయండి : సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రజాపాలన కళాయాత్ర ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని, ఇచ్చిన హామీలలో ఇప్పటికే ఐదు పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని, మరో రెండు గ్యారెంటీ త్వరలో అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలపై రెండు బృందాల కళాకారులు గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వ వివరాలను తెలియజేస్తున్న సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో కళాకారులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందజేత, పది లక్షల రూపాయల లోపు ఆరోగ్యశ్రీ పథకాలను విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందని, మరో రెండు పథకాలు అయినా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 రూపాయలు, పింఛన్ల పెంపు కార్యక్రమాన్ని త్వరలోనే అమలు చేస్తామని అన్నారు. గత పాలకులు 10 సంవత్సరాల కాలంలో 21 లక్షల మంది రైతులకు 16 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయగా మేము అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 13 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, డిసెంబర్ 9వ తేదీ లోగా మిగిలిన రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నారు. రైతులు పండించిన సన్న రకం వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని, పది నెలల కాలంలోనే 53 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, రానున్న వారం రోజుల్లో మరో తొమ్మిది వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. శనివారం ములుగు జిల్లా కేంద్రం లోని డిగ్రి కళాశాల మైదానం లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మరియు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయాల చైర్మెన్ రవి చందర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలసి ప్రారంభించారు.

మీడియా సమాజానికి అద్దం లాంటిది: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లా కేంద్రంలోని రామగిరి చౌరస్తాలో శనివారం జిల్లా ప్రెస్ క్లబ్ నుప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనతరం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో మంచితో పాటు,కొన్ని లోపాలు ఉంటాయని, వాటిని తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా యంత్రాంగం తరఫున తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియా సమాజానికి పారదర్శకంగా, స్ఫూర్తితో పనిచేసి సమాజానికి మంచి చేసేందుకు కృషి చేయాలన్నారు.మీడియా ప్రతినిధులకు సంబంధించిన సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, జర్నలిస్టుల ఇంటి స్థలాల విషయం తనతో పాటు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టిలో ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నల్గొండ జిల్లాకు శాశ్వత ప్రెస్ క్లబ్ భవనం వస్తుందని అన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి యు. వెంకటేశ్వర్లు, నల్గొండ ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గౌరవ ఆధ్యక్షులు కృష్ణారెడ్డి, ట్రెజరర్ గుండాల యాదగిరి, సీనియర్ పాత్రికేయులు, పలువురు బ్యూరో రిపోర్టర్లు, స్టాఫ్ రిపోర్టర్లు, వీడియో జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు

రామగుండంలో 280 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: రామగుండం నియోజకవర్గంలో గడిచిన ఏడాది కాలంలో రూ.280 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు కాంగ్రెసు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా శనివారం గోదావరిఖనిలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎస్.టీ.పీ ల నిర్మాణాలకు 100 కోట్లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రోడ్ల నిర్మాణానికి 100 కోట్లు,డి.ఎం.ఎఫ్.టీ నిధుల ద్వారా 20 కోట్లు, ఈ.జి.ఎస్ ద్వారా 4 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభంచేసినట్లు ఆయన వివరించారు.రాష్ట్రంలో విద్యుత్ అవసరాల దృష్ట్యా సింగరేణి, జెన్ కో సంయుక్తంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 2400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రామగుండం మెడికల్ కళాశాలకు 140 కోట్లు, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 360 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రాజీవ్ రహదారి పై సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తి కాలేదని ఆరోపించారు. కార్పోరేషన్ మేయర్ అనిల్ కుమార్,కార్పొరేటర్ మహంకాలి స్వామి, నాయకులు ఎద్దెల్లి ప్రకాశ్,బొంతల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

గార్ల - విశాలాంధ్ర : ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే మతోన్మాద బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతికటించాలని ఎస్‌కే యం నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సారధ్యం వహించిన నాయకులు కందునూరి శ్రీనివాస్, జడ సత్యనారాయణ, కట్టేబోయిన శ్రీనివాస్, లక్ష్మణ్ నాయక్, సక్రు, అజ్మీర వెంకన్నలు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన దగ్గరి నుంచి ప్రజల సంక్షేమం దేశ అభివృద్ధి వదిలేసి దేశ పౌరుల మధ్య మత విద్వేషాలు రగల్చటమే ఎజెండాగా పనిచేస్తుందని విమర్శించారు. ఈ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు, కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. దేశ యువకుల్లో ఉద్యోగ ఉపాధి కల్పించకుండా మత గొడవలు ఉసిగొలిపి మతోన్మాదులుగా తయారు చేస్తుందన్నారు. ఇదే క్రమంలో దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబడుతుందని ఆరోపించారు. అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలవాల సత్యవతి, జంపాల వెంకన్న, కందునూరి ఈశ్వరలింగం, గుడి చుట్టు శంకర్, వంగూరు వెంకటేశ్వర్లు, అలవాల రామకృష్ణ, గాజుల గణేష్, హరి, శంకర్, లోకేశ్వరరావు, సంగోజు నాగరాజు, మల్లెల నాగమణి, మాన్య, వడ్డెపూడి మల్లయ్య, జడ శ్రీను,వంగూరు పద్మ, మాన్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, సన్నాలకు బోనస్ ఎంత పడిందో ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అదనపు కలెక్టర్ డి.వేణులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,పెద్దపల్లి రైతుల జిల్లా అని, ఇక్కడ పరిస్థితులు చాలా సున్నితంగా ఉంటాయని, ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు రావద్దన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో ప్రభుత్వం చేస్తున్న పని క్షేత్రస్థాయిలో రైతులను కనెక్ట్ అయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు. రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాధాన్యతను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, 2 లక్షల రుణమాఫీ, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ పథకాల లబ్ధి పొందుతున్న రైతులతో వీడియోలు చేసి ప్రచారం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యంలో దాదాపు ఇప్పటివరకు 80 శాతం మేరకు దాన్యం నగదు చెల్లించడాన్ని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. జిల్లాలో 51 వేల 827 రైతులకు 372 కోట్ల 59 లక్షల రూపాయలు రుణమాఫీ పూర్తి చేశామని అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి ,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమరభేరిని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : ఈనెల 25 సోమవారం రోజున హైదరాబాద్ రవీంద్ర భారతిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు బీసీల సమయభేరిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. కొండమల్లేపల్లి లో బీసీ సంక్షేమ సంఘం సమావేశం శనివారం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమరభేరిని విజయవంతం చేయాలని మండల కేంద్రంలో పోస్టర్, పాంప్లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగ 75కోట్ల ఉన్న బీసీ ప్రజానీకానికి బడ్జెట్ కేంద్రం 2 వేల కోట్లు కేటాయించడం బీసీ ప్రజలను అవమానం చేసినట్టని ఇప్పటికే కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం చట్టసభలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు, రాజ్యాంగ చట్టబద్ధత,బీసీలకు విద్య ఉద్యోగ రిజర్వేషన్లు జనాభా ప్రకారం 27 నుంచి 56శాతం పెంచాలి. చట్టసభల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. ఏరుకొండ రాము, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు శ్రీనివాస్ యాదవ్, లింగం యాదవ్, గిరి వెంకటయ్య గౌడ్, నాయకులు జిట్టమోని యాదయ్య, మేడిపల్లి జంగయ్య, తోటపల్లి శీను, శేఖర్ యాదవ్, పులిజాల గోవర్ధన్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన రెడ్డి సమాఖ్య నాయకులు

విశాలాంధ్ర - పినపాక : రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో మణుగూరు రెడ్డి సమాఖ్య నాయకులు కలిశారు. శనివారం సమాఖ్య అధ్యక్షులు నాసిరెడ్డి విజయ్, భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసినట్లు వారు చెప్పారు. మణుగూరు మండలంలో రెడ్డి సంఘం భవన్ కు స్థలాన్ని కేటాయించి, నిధులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. తొలుత మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. వ్యవసాయ రంగానికి చిహ్నమైన ఎద్దుల బండి జ్ఞాపికను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు, పినపాక మండల రెడ్డి సంఘం నాయకులు తిరుపతి రెడ్డి, సీరపు గణేష్ రెడ్డి, మైత్రి గ్రూప్స్ అధినేత బ్రదర్స్ సానికొమ్ము వెంకటరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డి, గాయం అవినాష్ రెడ్డి, బంకు శ్రీనివాస రెడ్డి ,జయపాల్ రెడ్డి లు పాల్గొన్నారు.

షెరటాన్ హైదరాబాద్ హోటల్లో ఫ్రూట్ మిక్సింగ్ ఈవెంట్

హైదరాబాద్: షెరటాన్ హైదరాబాద్ హోటల్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వార్షిక పండ్ల-మిక్సింగ్ వేడుకతో సెలవు స్ఫూర్తిని స్వీకరించింది. పండుగ సీజన్‌ను ఆనందం, స్నేహపూర్వకంగా ప్రారంభించింది. హోటల్ సుందరమైన అవుట్‌డోర్ సెట్టింగ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు, ఆహార ప్రియులు, షెరటాన్ బృందం ఉత్సాహభరితమైన వాతావరణంలో ఒక చోట చేరారు. ఈ వేడుకకు హోటల్ జనరల్ మేనేజర్ శుభంకర్ బోస్ నాయకత్వం వహించారు. పండ్ల మిక్సింగ్ వేడుక అనేది అంతా కలిసి, ఆనందంగా జరుపుకునే వేడుక అని ఆయనన్నారు. అన్ని రకాల పండ్ల మిక్సింగ్‌తో ఈ వేడుక జరుగుతున్నదన్నారు.

ఏఐ, డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీపై సెక్యూరిటీ లీడర్‌షిప్ సమ్మిట్

న్యూఢిల్లీ: సిఏపిఎస్ఐ, ఏపిడిఐ నిర్వహించిన 19వ సెక్యూరిటీ లీడర్‌షిప్ సమ్మిట్ 2024, న్యూఢిల్లీలోని పిహెచ్‌డి హౌస్‌లో ముగిసింది. 'సురక్షిత్భారత్-వికసిత్ భారత్ 2047' అనే థీమ్‌తో భద్రతా ల్యాండ్‌స్కేప్‌ను రూపొందించే అధునాతన సాంకేతికతలను గుర్తించడానికి ఈ కార్యక్రమం పరిశ్రమ నాయకులు, విధానరూపకర్తలు, నిపుణులను ఒకచోట చేర్చింది. ముఖ్యమైన చర్చలు ఏఐ రక్షణ సేవలను హైలెట్ చేసాయి. మహిళా రక్షణ, ఇన్వెస్టిగేషన్లు, ప్రైవేట్ రక్షణని, పోలీస్ ఫోర్స్ ని హైలెట్ చేసాయి. డ్రోన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీలను ప్రముఖంగా చర్చించాయి. డ్రోన్ టెక్నాలజీ మీద నాయకత్వ సెషన్‌లు, సైబర్ సెక్యూరిటీ నాయకత్వం డ్రోన్ సైనికుల అవసరాన్ని ముందుండి నడిపించే సంరక్షణ యోధులకు ప్రాముఖ్యతని తెలియజేసాయి. సమ్మిట్‌లో ముఖ్య అతిథి జనరల్ వికెసింగ్, డాక్టర్ సత్యపాల్‌సింగ్‌తో పాటు మాజీ కేంద్రమంత్రి లెఫ్టినెంట్ జనరల్ ఎంయు నాయర్ తదితరులు పాల్గొన్నారు. సిఏపిఎస్ఐ, ఏపిడిఐ సెక్రటరీ జనరల్ మహేష్‌వర్మ అధ్యక్షత వహించారు.

24న జీ తెలుగులో మారుతీనగర్ సుబ్రమణ్యం

విశాలాంధ్ర - అదిలాబాద్: కడుపుబ్బా నవ్విస్తూనే ఆలోచింపజేసే కామెడీ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను మెప్పించిన మారుతీనగర్ సుబ్రమణ్యం, ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మారుతి నగర్ సుబ్రమణ్యం సినిమా మారుతి నగర్‌లో నివసించే సుబ్రమణ్యం అనే వ్యక్తికి సంబంధించినదన్నారు. సుబ్రమణ్యం (రావు రమేష్) గవర్నమెంట్ ఉద్యోగం వస్తుందని ఆశిస్తాడు. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ అతని భార్య కళారాణి (ఇంద్రజ) ఇంటి నిర్వహణ బాధ్యత తీసుకుంటుంది. వారి కొడుకు అర్జున్ (అంకిత్ కొయ్య) కూడా నిరుద్యోగి. ఓ రోజు అనుకోకుండా సుబ్రమణ్యం బ్యాంకు ఖాతాలో రూ.10 లక్షలు జమయ్యాయి. ఆ డబ్బు ఎవరిది? సుబ్రమణ్యం తనకు వచ్చిన సమస్య నుంచి ఎలా బయటపడ్డాడు? అనేది తెలియాలంటే వరుస ట్విస్టు, కామెడీతో సాగే మారుతీనగర్ సుబ్రమణ్యం సినిమా చూడాల్సిందే అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, ఇంద్రజ ప్రధానపాత్రల్లో నటించగా, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, అజయ్, ప్రవీణ్, హర్షవర్ధన్ కీలక పాత్రలు పోషించారు.

బాదంపప్పులు తింటే కండరాల నొప్పులుండవు!

ముంబయి: బాదంపప్పులను క్రమం తప్పకుండా తినడం వల్ల కండరాల పనితీరు మెరుగుపడటం, నొప్పి, కండరాల దెబ్బతినడం తగ్గి వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుందని ఒక కొత్త అధ్యయనం కనుగొంది. ఈ కొత్త అధ్యయనం, వ్యాయామం తర్వాత కోలుకోవటాన్ని బాదం ఎలా ప్రభావితం చేస్తుందో, అన్వేషించే శాస్త్రీయ ఆధారాలను పెంచుతుంది. మునుపటి అధ్యయనాలు అలసట, వ్యాయామ జీవక్రియ భావాలపై బాదం ప్రభావాన్ని పరిశోధించాయి. ఈ కొత్త అధ్యయనం, కరెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది. దీనికి ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా నిధులు సమకూర్చింది. పరిశోధకులు ట్రెడ్‌మిల్ రన్‌కు ముందు, తరువాత పరిశోధనలో పాలు పంచుకున్నవారి కండరాల నొప్పి, కండరాల పనితీరు, కండరాల నష్టం/వాపును కొలిచారు. వ్యాయామం రికవరీ సమయంతో పోలిస్తే బాదం తీసుకున్న గ్రూప్ తక్కువ క్రియాటిన్ కినేస్ స్థాయిలు కలిగిఉన్నట్లు కనుగొన్నారు. 24, 72 గంటలలో మెరుగైన కండరాల పనితీరు కన్పించింది.

సామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇన్‌స్టిట్యూట్‌తో ఐఐటీ బాంబే ఒప్పందం

గురుగ్రామ్: సామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇన్‌స్టిట్యూట్, నోయిడా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే (ఐఐటీ బాంబే)తో అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా పరిశ్రమ-విద్యాపరమైన సహకారం కోసం తన నిబద్ధతను బలోపేతం చేసింది. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం ఎస్ఆర్ఐ - నోయిడా, ఐఐటీ బాంబే కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ ఆరోగ్యం, ఇతర క్లిష్టమైన రంగాలలో పురోగతిని అన్వేషిస్తాయి. ఐదేళ్ల భాగస్వామ్యం ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను సులభతరం చేస్తుంది. ఐఐటీ బాంబే విద్యార్థులు, అధ్యాపకులకు సామ్‌సంగ్ ఇంజనీర్‌లతో కలిసి పనిచేసే అవకాశాన్ని అందిస్తుంది.

లింక్డ్ఇన్ ఆధ్వర్యంలో ఫ్రాడ్ అవేర్‌నెస్ వీక్

ముంబయి: ఉద్యోగాల కోసం విస్తృత స్థాయిలో ఆన్‌లైన్‌లో శోధన చేసినప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. వారు ఉద్యోగ పోస్టింగ్‌లను పరిశోధించడం, పోస్టర్ గుర్తింపును ధృవీకరించడం, వారు పంచుకునే సమాచారాన్ని గుర్తుంచుకోవడం ద్వారా దీన్ని చేయవచ్చు. లింక్డ్ఇన్ ఇండియా లీగల్ అండ్ పబ్లిక్ పాలసీ హెడ్ అదితి ఝా మాట్లాడుతూ, ఫ్రాడ్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగార్థులు లింక్డ్ఇన్‌ను ఆశ్రయిస్తున్నారని, ఎందుకంటే ఇది సంభావ్య యజమానులతో కనెక్ట్ అవ్వడానికి, కొత్త కెరీర్ అవకాశాలను అన్వేషించడానికి విశ్వసనీయ ప్రాంగణంగా నిలిచిందన్నారు. 99% నకిలీ ఖాతాల సభ్యులు మిమ్మల్ని చేరుకోకముందే ఆపడానికి మా ట్రస్ట్ బృందం అవిశ్రాంతంగా పని చేస్తుందన్నారు. జాబ్ పోస్టింగ్‌లపై ధృవీకరించబడిన సమాచారం కోసం తనిఖీ చేయడం, మీరు పంచుకునే వాటితో జాగ్రత్త వహించడం, అనుమానాస్పద అభ్యర్థనలకు 'నో' చెప్పడం, సందేశ హెచ్చరికలను ప్రారంభించడం, రెడ్ ఫ్లాగ్‌ల కోసం వెతకడం, ధృవీకరణలతో ఉద్యోగాలను ఫిల్టర్ చేయడం, కంటెంట్ సృష్టికర్తలు ప్రామాణికమైన సలహాతో ఉద్యోగ అన్వేషకులకు మద్దతు ఇవ్వడం వంటి చిట్కాలు పాటించాలన్నారు.

ఇండియా బైక్ వీక్‌కు రంగం సిద్ధం

ముంబయి: గల్ఫ్ సింట్రాక్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇండియా బైక్ వీక్‌కు రంగం సిద్ధమైంది. 11వ సారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో సరికొత్త అనుభవాలు ప్రతీ ఒక్కరికి అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సీజన్‌లో, 'నెక్స్ట్ చాప్టర్' ఫీచర్‌గా, రెండు ఎఫ్ఎంఎస్‌సీఐ అనుబంధ రేసులతో గ్రాస్‌రూట్ రేసింగ్‌ను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యాము. ఐబీడబ్ల్యు హిల్ క్లైంబ్‌ను రీస్ మోటో అందిస్తే ఫ్లాట్ ట్రాక్ రేస్‌ను హార్లే-డేవిడ్‌సన్‌తో సంయుక్తంగా అందించారు. ఎఫ్ఎంఎస్‌సీఐ రేసింగ్ లైసెన్స్‌తో సహా ఫ్లాట్ ట్రాక్‌కు రూ.1,250, హిల్ క్లైంబ్ కోసం రూ.1,000గా నిర్ణయిచారు. పోటీదారులందరూ రేసు కోసం ఈ మొత్తాన్ని కట్టి తమ పేర్లని నమోదు చేసుకోవాలి. అన్ని రేసుల నుండి మొత్తం ప్రైజ్ మనీని రూ.12 లక్షలుగా నిర్ణయించారు. ఫ్లాట్ ట్రాక్ కోసం రిజిస్ట్రేషన్ ప్రస్తుతం లైవ్‌లో ఉంది. మొత్తం 81 రిజిస్ట్రేషన్‌లు పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ క్లోజ్ అవుతుంది.

కోల్గేట్ ఓరల్ హెల్త్ మూవ్‌మెంట్‌లో ఏఐ-ఆధారిత డెంటల్ స్క్రీనింగ్

ముంబయి: భారతదేశపు ఓరల్ హెల్త్ ప్రయాణంలో విజేతగా నిలిచే లక్ష్యంలో భాగంగా, దేశంలోని ప్రముఖ ఓరల్ కేర్ బ్రాండ్ కోల్‌గేట్-పామోలివ్ (ఇండియా) లిమిటెడ్, సరికొత్త రూపంలో ఓరల్ హెల్త్ మూవ్‌మెంట్‌ను ప్రారంభించింది. భారతదేశంలో ఓరల్ హెల్త్ కేర్‌కు సంబంధించిన అవగాహనను, సేవల అందుబాటు మధ్య అంతరాన్ని తగ్గించడానికి సాంకేతికతను వినియోగించుకుంటూ, ఓరల్ హెల్త్‌కు ప్రాధాన్యతనిచ్చేలా భారతీయులను ప్రోత్సహించడం ఈ ప్రత్యేకమైన ఏఐ- ఎనేబుల్డ్ చొరవ లక్ష్యం. ఈ ఉద్యమానికి కేంద్ర స్థానంలో ఏఐ డెంటల్ స్క్రీనింగ్ సాధనం లాగీ.ఏఐ భాగస్వామ్యంతో అభివృద్ధి చేశారు. ఇది సాధారణ వాట్సప్ పరస్పర చర్యతో తక్షణమే ఏఐ రూపొందించిన డెంటల్ స్క్రీనింగ్ నివేదికను స్వీకరించేందుకు వినియోగదారులను అనుమతిస్తుంది. ఇది 9 ప్రముఖ భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుంది. ఎవరైనా ఇటీవల కొనుగోలు చేసిన కోల్గేట్ ఉత్పత్తి ప్యాక్‌లలోని క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయడం ద్వారా లేదా 8806088060కి డయల్ చేయడం ద్వారా, కొన్ని ప్రశ్నలకు సమాధానమివ్వడం ద్వారా, ఉచిత ఏఐ-ఆధారిత డెంటల్ స్క్రీనింగ్ నివేదికను స్వీకరించేందుకు వారి నోటికి సంబంధించిన మూడు చిత్రాలను అప్‌లోడ్ చేయడం ద్వారా పాల్గొనవచ్చు.

క్యుఈ కాంక్లేవ్‌లో క్వాలిజీల్ క్యుమెంటిస్ ఏఐ విడుదల

హైదరాబాద్: క్వాలిటీ ఇంజినీరింగ్ (క్యుఈ)లో గ్లోబల్ లీడర్‌గా వెలుగొందుతున్న క్వాలిజీల్, ఇటీవల క్యుఈ కాంక్లేవ్ 2024 2వ ఎడిషన్‌ను నిర్వహించింది. ఏఐ-శక్తితో కూడిన క్వాలిటీ ఇంజనీరింగ్ టూల్ క్యుమెంటిస్ ఏఐని కూడా ఆవిష్కరించింది. 'ఏఐ-పవర్డ్ క్వాలిటీ ఇంజినీరింగ్: విజన్ ఫర్ 2025, అంతకుమించి' అనే నేపథ్యంతో నిర్వహించిన ఈ సదస్సు క్యుఈ భవిష్యత్తును రూపొందించే పరివర్తన ధోరణులను చర్చించడానికి 600పైగా పరిశ్రమల నాయకులు, మధ్య నుండి సీనియర్ స్థాయి నిపుణులు, ఆలోచనా నాయకులను ఒకచోట చేర్చింది. ఈ కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో రాణించడానికి తాజా పరిజ్ఞానం , వ్యూహాలు, ఆచరణాత్మక సాధనాలతో క్యుఈ నిపుణులను శక్తివంతం చేయడానికి కీలకోపన్యాసాలు, ప్రెజెంటేషన్‌లు, ప్రత్యక్ష ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ చర్చలు జరిగాయి.

మణిపాల్ సిగ్నా 'సర్వః' విడుదల

హైదరాబాద్: అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, స్వతంత్ర ఆరోగ్య బీమా కంపెనీలో ఒకటైన మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ తన కొత్త ఆరోగ్య బీమా పథకం 'మణిపాల్‌సిగ్న సర్వః'ను విధుల చేసినట్లు ప్రకటించింది. పూర్తి ఆరోగ్య బీమా పరిష్కారాన్ని అందించేలా ఇది రూపొందిందింది, విస్తృత కస్టమర్ విభాగాలకు సరసమైన, సమగ్రమైన ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. భారత్‌లో భీమా పాలసీ తీసుకొని లేదంటే సరి అయిన కవరేజి లేని వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించింది. మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రసూన్ సిక్దర్ మాట్లాడుతూ, 'మణిపాల్‌సిగ్నా వద్ద, మా నిబద్ధత కేవలం ఆరోగ్య బీమాను అందించడం కంటే ఎక్కువగా ఉంది. 'మణిపాల్ సిగ్నా సర్వః' విడుదలతో, మేము పూర్తి ఆరోగ్య బీమా పరిష్కారాన్ని పరిచయం చేస్తున్నాము, ఇది విభిన్న కస్టమర్ విభాగాలను మాత్రమే కాకుండా, ప్రభుత్వం, రెగ్యులేటర్ 'ఇన్సూరెన్స్' లక్ష్యం చేరుకోవటంలో తోడ్పడుతున్నాము' అని అన్నారు.

కేఎల్ డీమ్డ్ టు బీ వర్శిటీలో యూజీ, పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తులు

హైదరాబాద్: ఇంజినీరింగ్, ఉన్నత విద్య కోసం భారతదేశంలో ప్రముఖ విశ్వవిద్యాలయంగా వెలుగొందుతున్న కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ, దాని ప్రఖ్యాత కేఎల్ ప్రవేశ పరీక్ష (కేఎల్ఈఈఈ) 2025 కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. విద్యాపరంగా వివిధ విభాగాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో విస్తృతమైన స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను కూడా విశ్వవిద్యాలయం ప్రారంభించింది. విభిన్న విద్యాపరమైన ఆసక్తులకు తగినట్లుగా, కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ 2025 అడ్మిషన్ల కోసం ప్రత్యేక పరీక్షల సమగ్ర సూట్‌ను ప్రవేశపెట్టింది. ఇంజినీరింగ్ ఆశావాదులు కేఎల్ఈఈఈ-2025 కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇది తమ అత్యున్నత ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లకు అవకాశాలను మంజూరు చేస్తుందని యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు.

సంపాదకీయం

ఓటమికి కారణం ఉదాసీనతే

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఇంతవరకు అధికారంలో ఉన్న వివిధ పార్టీలతో కూడిన కూటములకే ప్రజలు పట్టం కట్టారు. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంపై అసమ్మతి విపరీతంగా ఉన్నందువల్ల ఈ సారి కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన వర్గం, శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్.సి.పి. వర్గంతో కూడిన మహా వికాస్ అగాఢీ అధికారంలోకి వస్తుందన్న అంచనాలు తారుమారైనాయి. బీజేపీ, షిండే నాయకత్వంలోని శివసేన చీలికవర్గం, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్.సి.పి. చీలికవర్గం తో కూడిన మహాయుతి ఐక్యసంఘటనకు మునుపటికన్నా ఎక్కువ సీట్లు దక్కాయి. 2019 ఎన్నికలలో బీజేపీకి ఒంటరిగా 105 స్థానాలు దక్కితే ఈ సారి బలం మరింత పెరిగి 133 స్థానాలలో విజయం సాధించింది. ఇది అపూర్వం. కాంగ్రెస్‌కు గత ఎన్నికలలో 44 సీట్లు వస్తే ఈ సారి 36 స్థానాలకే పరిమితం కావలసి వచ్చింది. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు పలుకుబడి ఉన్న నాయకుడు లేకపోవడం అననుకూలంగా తయారైనట్టుంది. శివసేనకు చీలిపోకముందు 2019లో 56 స్థానాలుంటే ఇప్పుడు షిండే వర్గానికి 38, ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి 15 స్థానాలకు తగ్గాయి. మొత్తం మీద ఉమ్మడి శివసేనకు ఉన్న 56 సీట్లలో ఈ సారి రెండు వర్గాలు సాధించిన స్థానాలు కలిపితే కేవలం మూడు సీట్లే తగ్గాయి. అలాగే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీలిపోక ముందు గత ఎన్నికలలో 54 స్థానాలు సాధిస్తే ఇప్పుడు రెండు వర్గాలకు కలిసి 53 సీట్లు దక్కాయి. కానీ జనంలో ఉద్ధవ్ ఠాక్రేకు ఇంకా ఆదరణ ఉంది అన్న అంచనా తప్పింది. షిండే వర్గం 38 సీట్లు సాధిస్తే ఉద్ధవ్ ఠాక్రే వర్గం 15 సీట్లతో సంతృప్తి పడవలసి వచ్చింది. 150 సీట్లకు పోటీ చేసిన బీజేపీ మునుపటికన్నా 28 సీట్లు ఎక్కువ సాధించగలిగింది. అలసత్వం, ఉదాసీనత ఎన్నికలలో ఏ పార్టీకైనా అపారమైన నష్టం కలిగిస్తాయని శనివారం వెల్లడైన రెండు రాష్ట్రాల ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. లోక్‌సభ ఎన్నికలలో 400 సీట్లకన్నా ఎక్కువ సాధిస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ కేవలం 240 సీట్లతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఇది అతివిశ్వాసం, అహంకారం కారణంగా ఎదురైన పరిణామం. అలాగే హర్యానాలో ప్రజలు తమను గెలిపించి తీరుతారన్న కాంగ్రెస్ అతి విశ్వాసం ఆ పార్టీని బాగా దెబ్బతీసింది. ఎన్నికలకు ముందే గెలుపు తమదేనని కాంగ్రెస్ బీరాలు పలికితే బీజేపీ విజయం సాధించి చూపింది. లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలో మొత్తం 48 స్థానాలకుగాను ప్రతిపక్షంలో ఉన్న మహా వికాస్ అగాఢీ 31 స్థానాలు సాధించి ఇప్పుడు చతికిలపడడానికి ప్రధాన కారణం అలసత్వం, ఉదాసీనతే. ఆ ఎన్నికలలోనూ ఉద్ధవ్ వర్గం అతి తక్కువ స్థానాలు సాధించింది. ఎక్కువ స్థానాలు సాధించి ఆశ్చర్యపరిచిన కాంగ్రెస్ ఇప్పుడు కళ్లు తేలేసింది. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనవర్గం నాయకుడు సంజయ్ రౌత్ తాము ఈ ఎన్నికల ఫలితాలను అంగీకరించబోమని చెప్పడం హాస్యాస్పదం. ఆయన ఉద్దేశం ఎన్నికలలో ఏదో మోసం జరిగిందని కావచ్చు. అందులో అనుమానం లేదనుకున్నా ఏం చేసైనా ఎన్నికలలో విజయం సాధించాలన్న అకుంఠిత దీక్షతో పని చేయడం బీజేపీ తత్వం గ్రహించాలిగా. బీజేపీ ఈ సారీ ఆ పనే చేసింది. డబ్బులు విచ్చలవిడిగా విరజిమ్మింది. సాక్షాత్తు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే డబ్బులు పంచుతూ పట్టుబడడం బీజేపీ డబ్బు వెదజల్లుతుందన్న వాదన కేవలం నిరాధార ఆరోపణ కాదని తేల్చింది. అదే రీతిలో ఏక్‌నాథ్ షిండే పార్టీకి చెందిన ఒక నాయకుడు రెండు కోట్ల రూపాయలతో పట్టుబడ్డారు. దేవేంద్ర ఫడ్నవీస్‌కు అత్యంత సన్నిహితుడు సునీత్ వాంఖడే మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారు. ఇవన్నీ బీజేపీ చేసే తొండికి నిదర్శనాలే. ఇవన్నీ ఎంత నిజమైనప్పటికీ ఇండియా ఐక్య సంఘటనలో భాగమైన మహా వికాస్ అఘాఢీ అనేక పొరపాట్లు చేయడం ఓటమికి ప్రధాన కారణం. మొదట్లో మహా వికాస్ అఘాఢీ గెలుపు ఖాయం అన్న భావన ఉన్నా ఎన్నికలు సమీపించే సరికి రెండు పక్షాలమధ్య తీవ్రపోటీ ఉంటుంది అని భావించే స్థాయికి చేరడానికి మహావికాస్ అఘాడి చేసిన పొరపాట్లే ప్రధాన కారణం. లోక్‌సభ ఎన్నికలలో మహాయుతికి కేవలం 17 స్థానాలే దక్కడం షిండే ప్రభుత్వంపై పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతీక. నాలుగు నెలల్లో ఈ పరిస్థితి తారుమారై ప్రతిపక్షాలు ఓటమిపాలు కావలసి వచ్చింది. చాలాకాలం ఉద్ధవ్ ఠాక్రే ప్రచారంలో ఎక్కడా కనిపించ లేదు. రాహుల్ గాంధీ, శరద్ పవార్ ఎన్నికల తంత్రంపై పెట్టవలసినంత శ్రద్ధ పెట్టినట్టు కనిపించలేదు. సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. టికెట్ల పంపిణీకి ముందు ఒకే ఐక్యసంఘటనలోని నానాపటోలే, సంజయ్ రౌత్ మధ్య సూటిపోటి మాటల యుద్ధం సమన్వయ లోపానికే కాదు సమైక్యత లేకపోవడానికి నిదర్శనం. లోక్‌సభ ఎన్నికలలో మహావికాస్ అఘాడిలో కనిపించిని ఐక్యత శాసనసభ దగ్గరికి వచ్చేటప్పటికి మాయమైంది. ఎన్నికలకు ముందు ఫడ్నవీస్ తో ఉద్ధవ్ ఠాక్రే మంతనాలు, అమిత్ షాతో సంజయ్ రౌత్ సంప్రదింపులు ఓటర్లకు సానుకూల సంకేతాలు ఎలా ఇస్తాయిగనక! ఇన్ని లుకలుకలు ఉన్నప్పుడు కావాల్సినన్ని డబ్బు సంచులు, లడ్కీ బెహనా లాంటి సంక్షేమ పథకాలు ఉన్న అధికారపక్షాన్ని ఢీకొనడం ఎలా సాధ్యమవుతుంది. బీజేపీ ఇలాంటి తంత్రాలకు పాల్పడుతుందని ప్రతిపక్ష నేతలు ఊహించలేదనుకోలేంగా!

లడ్కీ బెహనాలాంటి పథకం కింద తగినంత ముందుగానే మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలకు రూ.1500 వేస్తే మహిళలు అధికారపక్షం వేపు మొగ్గడంలో అనుమానం ఏముంటుంది. తాము గెలిస్తే నెలకు రూ. 3,000 ఇస్తామని అగాఢీ నాయకులు చేసిన వాగ్దానం మహిళలకు దూరపు కొండగానే కనిపించింది. విదర్భలో రైతుల్లో ఉన్న అసంతృప్తిని మహిళ్ల చేతిలోపడ్డ ఈ రూ. 1500 దూరం చేశాయి. యోగీ ఆదిత్యనాథ్ "బటేంగేతో కటేంగే" నినాదాన్ని పంకజా ముండే, అజిత్ పవార్, అశోక్ చౌహాన్ వ్యతిరేకించిన మాట నిజమే. కానీ "ఏక్ హైతో సేఫ్ హై" అని మోదీ యోగీ నినాదానికి చేసిన సవరణ అధికారపక్షానికి ఉపకరించింది. ఇది బీజేపీ హిందుత్వ విధానాన్ని కూడా ఆమోదించేట్టు చేసింది. ఎందుకంటే ప్రతి ఎన్నికల్లోనూ మోదీ హిందుత్వను ప్రచారంలో పెడ్తూనే ఉంటారు. ఈ ఎన్నికలలో ఆర్.ఎస్.ఎస్. సర్వ శక్తులూ ఒడ్డింది. ఇండియా కూటమి భవిష్యత్తుకు, ముఖ్యంగా కాంగ్రెస్ పుంజుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వవలసిన కాంగ్రెస్ వయనాడ్‌లో ఎలాగూ గెలిచే ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారం మీదే ఎక్కువ శ్రద్ధ పెట్టింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు సానుకూలంగా వచ్చిన వెంటనే ప్రతిపక్షాలు మహారాష్ట్రపై దృష్టి పెట్టాల్సింది. అది జరగలేదు. దిల్లీ ఎన్నికలు, బీహార్ ఎన్నికలూ దగ్గరలోనే ఉన్నాయి. అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై అసంతృప్తి మాత్రమే ప్రతిపక్షాల విజయానికి ఎంత మాత్రం తోడ్పడదు అని మరో సారి రుజువైంది.

రష్యా హైపర్‌సోనిక్ క్షిపణితో పశ్చిమదేశాలు హడల్

బుడ్డిగ జమిందార్

బాలిస్టిక్ మిస్సైల్ అంటే అదొక రకమైన క్షిపణి. అనేక అణు వార్‌హెడ్స్‌ను ఈ క్షిపణి ఒకేసారి మోసుకెళ్లి, లక్ష్య స్థలంలో పేల్చగలవు. ఈ వార్ హెడ్స్ అణుశక్తిని కూడా కల్గి ఉండవచ్చును. స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులు సాధారణంగా భూమి వాతావరణంలోనే ఉంటాయి. అయితే ఈ పెద్ద క్షిపణులు భూ వాతావరణం, ఉపరితలం వెలుపల ప్రయాణించ గలవు. ఈ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అతిపెద్ద కక్ష్యలో దూరంగా ప్రయాణించ గల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. నవంబరు 21న ఉక్రెయిన్ మిలిటరీ స్థావరంపై రష్యా ప్రయోగించిన హైపర్ సోనిక్ 'ఒరేష్నిక్' క్షిపణి నాటో దురాలోచనల యుద్ధ దూకుడుకు అడ్డుకట్ట వేసింది. కొద్ది రోజుల క్రితం వరకు రష్యా భూభాగంపైకి దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించడానికి ఒప్పుకోని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన పంథాను మార్చుకుని ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి క్షిపణులను ఇవ్వడానికి అంగీకరించాడు. దీనితో "ాాాజాా ,తుపాను షాడో క్షిపణులను నాటో కూటమి రష్యా ప్రాంతాలైన బ్రయాన్స్క్, కుర్స్క్‌లపై ప్రయోగించింది. దీనితో మాస్కో చెప్పినట్లుగా యుద్ధం కొత్త దశకు చేరుకుంది. ప్రస్తుతం యూరప్ అంతా యుద్ధ వాతావరణం నెలకొనిఉంది. కొందరు విశ్లేషకులు మూడో ప్రపంచ యుద్ధాన్ని కూడా అంచనా వేస్తున్నారు. దీనికి ధీటుగా రష్యా చెప్పిన సమాధానం నాటో దేశాల్ని షాక్‌కు గురిచేసింది. ఉక్రె యిన్‌పై రష్యా ప్రయోగించింది హైపర్‌సోనిక్ క్షిపణి. శబ్ద వేగం కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణిస్తుంది. అంటే సెక నుకు రెండున్నర నుంచి మూడు కిలోమీటర్ల వేగంతో శత్రు దేశం వైపు పయనిస్తుంది. ఈ వేగాన్ని గమనించ గల శక్తి నాటో క్షిపణుల రక్షణ వ్యవస్థకు ఏ మాత్రం లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ క్షిపణి 3 నుంచి 6 అణుయుద్ధ బాంబులను తనతో తీసుకెళ్లగలదు. 3 వేల కిలోమీటర్ల నుంచి 5 వేల కిలోమీటర్ల వరకూ పయనించే శక్తి గల ఈ ఒరేష్నిక్ క్షిపణి ఐరోపా మొత్తం మీద ఏ నగరం మీదికైనా దూసుకొని వెళ్లగలదు. పారిస్, బెర్లిన్, లండన్ ఇలా అన్ని దేశాల రాజధానులపై శత్రువుల కళ్లుగప్పి అణుబాంబులను ప్రయోగించగలదు. రష్యా బాంబుల నిల్వల్లో ఇటువంటి క్షిపణులు సిద్ధంగా చాలా ఉన్నాయని, రష్యాతో చెలగాటమాడొద్దని నాటో దేశాలను పుతిన్ హెచ్చరించాడు.

ప్రపంచంలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, ఇండియా, పాకిస్తాన్, ఇజ్రాయిల్, ఉత్తరకొరియా దగ్గర మాత్రమే ఉన్నాయి. వీటిలో రష్యా 5,500 క్షిపణులను కల్గి ఉంటే అమెరికా దగ్గర 5,044 ఉన్నాయి. మిగతా దేశాలు కేవలం వంద అంతకు మించి మాత్రమే ఉన్నాయి. అయితే తాము ప్రయోగించిన హైపర్ సోనిక్ క్షిపణిని రష్యా మాత్రమే కల్గి ఉందని, అమెరికా వంటి దేశాలు ప్రయోగశాలల్లో మాత్రమే కల్గి ఉన్నాయని పుతిన్ పేర్కొన్నాడు. మిగతా దేశాలు కూడా ఇటువంటి మారణా యుధాల్ని తయారుచేస్తే మరలా ప్రచ్ఛన్నయుద్ధం (కోల్డ్‌వార్) తీవ్రరూపం దాల్చుతుంది. తద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు బలహీనపడి ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం వంటి అనేక సమస్యలు మరుగునపడే అవకాశా లుంటాయి. కనుక ఎవరివద్ద ఎన్ని మారణాయుధాలు ఉన్నాయో లెక్కపెట్టడం కన్నా అసలు ఆయుధరహిత సమాజం కోసమే ప్రపంచ ప్రజలు శాంతి ఉద్యమంతో ముందుకు వెళ్లాలి. 1990వ సంవత్సరంలో తూర్పు జర్మనీని పశ్చిమ జర్మనీతో కలపటానికి అప్పటి సోవియట్ అధ్యక్షుడు గోర్బొచెవ్, అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ మధ్య కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం నాటో కూటమి జర్మనీకి తూర్పువైపున ఒక అంగుళం కూడా విస్తరించకూడదనే కీలకాంశాన్ని అమెరికా ఒప్పుకొంది. కానీ నాటో యుద్ధ కూటమి 1999 లో చెక్ రిపబ్లిక్, హంగేరి, పోలెండులకు విస్తరించింది. ఇవన్నీ ఒకప్పటి సోషలిస్టు దేశాలే. ఆ తర్వాత 2004 లో బల్గేరియా, ఎస్తో నియా, లాట్వియా, లిథునివేనియా, స్లోవేకియా, స్లోవేనియా దేశాలకు విస్తరించి రష్యా చుట్టూ నాటో స్థావరాల్ని "ాహరించింది. ఇవి కూడా ఒకప్పటి సోషలిస్టు దేశాలుగానో లేదా సోవియట్ రిపబ్లిక్‌లాగా ఉన్నవే. ఆ తర్వాత 2009 లో అల్బానియా, క్రొయేషియా దేశాలకు ఈ యుద్ధ కూటమి విస్తరించింది. అటుపిమ్మట 2017 లో మోంటోనేగ్రో, 2020 లో ఉత్తర మెసిడోనియా, 2023లో ఫిన్లాండు, 2024 లో స్వీడన్‌లకు నాటో విస్తరించింది. 2014 నుంచి రష్యా పశ్చిమ సరిహద్దు వరకూ అమెరికా యుద్ధ కూటమి తన సైన్యాలతో మోహరించటానికి ఉక్రెయిన్‌ను ఎంచుకుంది. కానీ బలపడిన రష్యా తిరగబడటంతో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఉక్రెయిన్‌లో ఏర్పాటు చేసుకొని రష్యాకు వ్యతిరేకంగా నాటో కూటమి విస్తరణకు కుతంత్రాలు జరుగుతుండగా 2022 నుంచి పుతిన్ అడ్డుకొంటున్నాడు. ఒకవైపు ఉక్రెయిన్‌ను బలపరుస్తున్న నాటోకు- వ్యతిరేకిస్తున్న రష్యాకు మధ్యన ప్రస్తుతం యుద్ధం జరుగుతోంది. యుద్ధంలో భాగంగా రష్యాపై ఆర్థిక, పారిశ్రామిక ఆంక్షలను విధించిన పశ్చిమదేశాలు, ఉక్రెయిన్‌కు అనేక వేల కోట్ల డాలర్ల సహాయాన్ని అందిస్తు న్నాయి. ఈ సహాయం డబ్బు రూపంలో గాకుండా ఆయుధాల రూపంలో అందిస్తున్నాయి. అదీ ఉచితంగా కాదు, అప్పు రూపంలో వడ్డీకి అందిస్తుంది అమెరికా. ఇప్పటికే అమెరికా కార్పొరేట్లు లక్షల ఎకరాల పంట భూముల్ని వారిపేర రాయించుకున్నారు. అమెరికా నుంచి ఇప్పటి వరకూ దాదాపు 30000 కోట్ల డాలర్ల రుణం ఆయుధాల రూపంలో అందింది. తుప్పు పట్టిన పాత సామాగ్రినంతా అమెరికా ఆయుధ కంపెనీలు వదిలించుకొంటూ, నూతన ఆయుధాల్ని ఆయా కంపెనీలు తయారుచేస్తూ ప్రపంచ దేశాలమధ్య యుద్ధ వాతావరణంతో, ఆయుధాల అమ్మకాలతో బిలియన్ల డాలర్లను ఆర్జిస్తున్నారు. ఈ కంపెనీలలో ముఖ్యమైనవి (యుద్ధ కాంట్రాక్టర్లు) రెలోయిన్, జనరల్ డైనమిక్స్, బోయింగ్, నార్తరన్ గ్రుమన్, లాక్‌హీడ్. ఇవన్నీ అమెరికా యుద్ధ రంగ కంపెనీలే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యంతో విలవిలలాడుతుండగా ఈ కంపెనీలు మాత్రం శరవేగంగా లాభాల బాటలో యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయి.

ప్రజానుకూల విధానాల కోసం పోరు

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

నవంబర్ 26 కు చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. రాజ్యాంగ పరిషత్తు1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు. అద్భుత పోరాట పటిమను ప్రదర్శించిన రైతుల దిల్లీ యాత్ర 2020 నవంబర్ 26న ప్రారంభమైంది. అందుకే 2021 నుంచి, ప్రతి సంవత్సరం నవంబర్ 26వ తేదీన దేశ వ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు జరుగుతునే ఉన్నాయి. దేశంలోని ప్రధానమైన 10 కేంద్ర కార్మికసంఘాలు, వందలాది ఉద్యోగుల స్వతంత్ర ఫెడరేషన్లు, లక్షలాది మంది రైతాంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తల బిరుసు విధానాలకు వ్యతిరేకంగా ఈ సంవత్సరం కూడా నవంబర్ 26వ తేదీన పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపు నిచ్చాయి. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల మేరకు సి+50% ఫార్ములా ప్రకారం చట్టబద్ధ కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అనేక దశాబ్దాలుగా రైతాంగం ఎన్నో పోరాటాలు చేస్తూనే ఉంది. ఈ ఫార్ములాను పక్కన పెట్టి 2024-25లో ధాన్యం కనీస మద్దతు ధర రూ2300కుపెంచింది. ఇది కేవలం 5.35% మాత్రమే. రైతుల నుంచి ధాన్యం సేకరణకు ఎటువంటిహామీ లేదు. గతంలో కనీసం పంజాబ్, హర్యానాలోనైనా వరి, గోధుమ ధాన్యం సేకరణ జరిగింది. మండీలలో ఖాళీలేదనే పేరుతో గత సంవత్సరం సేకరించిన పంటను తరలించ లేదు. కనీస మద్దతు ధర కోసమేగాక వ్యవసాయ మార్కెట్లు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ప్రజా పంపిణీ వ్యవస్థల రక్షణ కోసం రైతాంగం మరొకసారి వీధుల్లోకి వచ్చింది. బహుళ జాతి గుత్తసంస్థలకు మరింత సహాయ పడేందుకు మోదీ ప్రభుత్వం డీఎంఎం. (డిజిటల్ అగ్రికల్చర్ మిషన్) ద్వారా భూములను, పంటలను డిజిటైజేషన్ చేయాలని ఆదేశిస్తోంది. 2024-25 బడ్జెట్లో దీన్ని ప్రకటించారు. వ్యవసాయంలో కాంట్రాక్ట్ పద్ధతిని ముందుకు తెస్తున్నారు. ఆహార ధాన్యాల పంటల నుంచి వాణిజ్య పంటల దిశగా వ్యవసాయాన్ని మళ్లిస్తున్నారు. ఇది కూడా బహుళజాతి కంపెనీల లాభాల పంట పండించడానికే. కేంద్రం 2017లో జీఎస్టీని విధించటం, 2019లో కేంద్ర ప్రభుత్వ సహకారశాఖ ఏర్పాటు వంటి చర్యలు రాజ్యాంగం ఫెడరల్ స్వభావంపై దాడి తప్ప మరొకటి కాదు. ఇది పన్నులపై రాష్ట్రాలకు గల హక్కులను హరించి వేయడమే కాగలదు. కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో జాతీయ సహకార విధానాన్ని ప్రకటించింది. వ్యవసాయ పంటలు రైతుల చేతికి వచ్చిన అనంతర పరిస్థితులను, వ్యవసాయ పరపతి వ్యవస్థలను కార్పొరేట్ల చేతుల్లో పెట్టటమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం బహుళజాతి గుత్త సంస్థలతో ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) అనేక ఒప్పందాలపై సంతకాలు చేసింది. ప్రభుత్వరంగంలోని ఎఫ్‌సీఐ గోడౌన్లు, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెట్లు అన్నిటిని అదానీ, అంబానీలాంటి కార్పొరేట్లకు అయినకాడికి లీజుకు ఇచ్చేస్తున్నారు. నిరంతర లోటు కారణంగా వ్యవసాయం దండగమారి వృత్తిగా మారింది. దీని వల్ల వ్యవసాయదారులు తీవ్రమైన అప్పుల ఊబిలోకి దిగిపోతున్నారు. మరింత మంది వ్యవసాయదారులు రోజురోజుకి వ్యవసా యానికి గుడ్ బై" చెబుతున్నారు. వ్యవసాయ సంక్షోభం వల్ల లక్షలాది మంది గ్రామీణ యువత పట్టణాలకు తరలి వెళుతున్నారు. వీరంతా నిరుద్యోగ సైన్యంలో కలిసిపోతున్నారు. తద్వారా, కార్మిక మార్కెట్లో అతితక్కువ ధరకు శ్రమశక్తిని అందుబాటులోకి తెస్తున్నారు. పారిశ్రామిక,"ేవారంగాల కార్మికవర్గంపై దీని ప్రభావం తీవ్రంగా ఉంది. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు 'కార్మిక కోడ్ల' ద్వారా కనీసవేతనాలు, పని భద్రత, సామాజిక భద్రత, 8గంటల పనిదినం, సంఘం పెట్టుకునేహక్కు, సమిష్టి బేరసారాల హక్కులకు "హామీ" రద్దు చేశారు. ప్రజల గోళ్లలోంచి వసూలుచేస్తున్న పన్నుల నుంచి అనేక రాయితీల రూపంలో కార్పొరేట్లకు దోచిపెడుతున్నారు. ఈ రాయితీలకు కాపెక్స్, ప్రొడక్షన్ లింక్డ్ ఎంప్లాయిమెంట్ అనే ముద్దు పేర్లు పెట్టారు. అన్ని రంగాలలో కాంట్రాక్టీకరణ పెరిగిపోయింది. శాశ్వత ఉద్యోగాల నియామకాలులేవు. ఫలితంగా, ఉపాధి పొందిన కార్మికులను, ఉద్యోగాలు వెతుక్కుంటున్న యువతను బానిసలుగా మార్చేస్తున్నారు. యూనియన్ల ఏర్పాటుహక్కు, పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ, రిటైర్మెంట్ ప్రయోజనాలులాంటి ప్రాథమికహక్కుల సాధన కోసం, పని ప్రదేశాలలో భద్రత ఫిర్యాదులను పరిష్కరించగల చట్టపరమైన యంత్రాంగం పటిష్టత కోసం కార్మికసంఘాలు పోరాడుతున్నాయి. రైతులు, కార్మిక, ఉద్యోగవర్గాలు ఎదుర్కొంటున్న ఈ తక్షణ సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. అందువల్ల కార్మిక, కర్షక ఐక్యతను నిర్మించడం, బలోపేతం గావించడం తక్షణ అవసరంగా గుర్తించారు. వ్యవసాయరంగ సంక్షోభాల వల్ల దివాలా తీస్తున్న రైతాంగ విముక్తికీ, తమ పోరాటంలో కార్మికవర్గం విజయం సాధించడానికి ఈ ఐక్యత అవసరం.

ఆహారం, ఆరోగ్యం, విద్య తదితర రాజ్యాంగ హక్కులను పాలకవర్గాలు ప్రజల నుంచి దూరం చేస్తున్నాయి. ఆహార సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం రూ2,72,802 కోట్ల నుంచి రూ2,12,332 కోట్లకు కుదించింది. అనగా రూ60,470 కోట్లు కోత విధించింది. ఎరువుల సబ్సిడీలో సైతం రూ2,51,339కోట్ల నుంచి రూ1,88,894 కోట్ల కు తగ్గించింది. రూ 62,445 కోట్లు కోత విధిం చింది.వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూ.టి.ఓ) ఆదేశాల మేరకు, అనేక రాష్ట్రాలలో నగదు బదిలీ పథకం పేరుతో ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. అత్యంతదయనీయమైన పరిస్థితి ఏమంటే, బదిలీఅయిన నగదు మాత్రం అతి స్వల్పం. మార్కెట్లో ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కార్మికులు, పేద ప్రజలకు రోజురోజుకి ఆహారం ఖరీదుగా మారి, అందకుండా పోతోంది. ప్రజారోగ్యం, విద్య, మొత్తం ప్రైవేటీక రణ గావిస్తున్నారు. వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నారు. ఉన్నత విద్య సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. కొన్ని రాష్ట్రాలలో, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలను సైతం ప్రైవేటీకరిస్తున్నారు. ప్రజలు బీమా ఆధారిత ఆరోగ్య సంరక్షణకు నెట్టివేస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ బీమా కంపెనీల, ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ పెరిగి పోయింది. కీలక ఉత్పత్తి రంగాలైన రక్షణ, రవాణా లాంటివ్యవస్థలను బడాకార్పొరేట్లకు అప్పగించేస్తున్నారు. ఫలితంగా దేశ ఆర్థిక స్వయం సమృద్ధి ప్రమాదంలో పడిపోవడమేగాక, ప్రభుత్వ ఆదాయంపై కూడా దీని ప్రభావం ఉంటోంది. పారిశ్రామికీకరణపేరుతో వ్యవసాయ, అటవీభూములన్నిటినీ బలవంతంగా లాగేసుకుంటున్నారు. ఈ భూములన్నిటినీ ధనికవర్గాల వినోద కార్యక్రమాల కోసం, వాణిజ్య అవసరాల కోసం, పర్యాటక, రియల్ ఎస్టేట్ కోసం వినియోగిస్తున్నారు.

ఎల్ఏఆర్ఆర్ చట్టం (2013), అటవీహక్కులచట్టం(ఎఫ్ ఆర్ ఏ) అమలు జరపటానికి ప్రభుత్వాలు నిస్సిగ్గుగా నిరాకరిస్తున్నాయి. ఆదివాసీలను, ట్రైబల్స్‌ను వారి భూముల నుంచి బలవంతంగా తొలగించేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ రంగం నుంచి విపరీతమైన లాభాలు పిండుకోవటానికి కార్పొరేట్లకు ప్రభుత్వం సహకరిస్తోంది. మొబైల్ కంపెనీలు తమ టారిఫ్‌లను ఇష్టానుసారంగా పెంచేసి కార్పొరేట్ దోపిడీకి పాల్పడుతుంటే ప్రభుత్వాలు గుడ్లప్పగించి చూస్తున్నాయి. వంటగ్యాసు, డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నా, పట్టించుకోవడంలేదు. కానీ కార్పొరేట్ పన్నులను మాత్రం విపరీతం గా తగ్గిస్తున్నారు. అదేసమయంలో, ధరల పెరుగుదల, ప్రాథమిక అవసరాల ఖర్చులు పెరిగి పోవటం కారణంగా వ్యవసాయదారులు, పారిశ్రామిక కార్మికులు, పేద,మధ్య తరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయి,యావత్ భారాన్ని మోస్తున్నారు. ఫలితంగా ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. జీఎస్టీని పేద ప్రజల ఆరోగ్యబీమాకు కూడా విస్తరింపజేశారు. గ్రామీణ భూమిలేని పేదలు బ్రతకటం కోసం, అధికవడ్డీలకు "మైక్రో ఫైనాన్స్"లో అప్పులు చేయని తూప్పని పరిస్థితి ఏర్పడుతోంది. అసలే స్వల్పంగా ఉన్న నిజవేతనాలు మరింత క్షీణిస్తున్నాయి.

మోదీ ప్రభుత్వం 16.5 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ రుణాలను రద్దుచేసింది. కానీ వ్యవసాయదారుల అప్పులను రద్దుచేసి, వారిని 'అప్పుల ఊబి' నుంచి విముక్తి చేసేందుకు మాత్రం పాలకులు తిరస్కరిస్తున్నారు. సంయుక్త కిసాన్ మోర్చాతో 2021 డిసెంబర్ 9వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఒక రాతపూర్వ ఒప్పందం చేసింది. ఇప్పుడు ఆ ఒప్పందాన్ని కేంద్రం ఉల్లంఘిస్తోంది. పైగా శ్రామిక ప్రజల్ని మతప్రాతిపదికపై విభజించేందుకు నిరంతరాయంగా ప్రయత్నిస్తోంది.తద్వారా వాస్తవ సమస్యల నుంచి వారిని పక్కదారిపట్టించగలమని బీజేపీ నాయకులు భ్రమపడుతున్నారు. మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రజలపై దాడులు ప్రమాదకరస్థాయిలో పెరుగుతున్నాయి. బీజేపీని వ్యతిరేకించే అనేక పార్టీలు తమ రాష్ట్రాలలో కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయి. వాటిని కూడా మనం తీవ్రంగా ప్రతిఘటించి ఓడించాల్సి ఉంటుంది. దానితో పాటు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచగల, పనిపరిస్థితుల్లో సానుకూల మార్పులు తీసుకురాగల విధానాల కోసం కార్మికులు,కర్షకులు ఐక్యంగా పోరాడాల్సి ఉంది. కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకిస్తూ, ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల కోసం మనం మన పోరాటాలను ఎక్కు పెట్టాల్సి ఉంది. దేశమంతట ప్రజా ఉద్యమాన్ని ఉధృతం కావించడం ఒక్కటే సరియైన పంథా! ప్రజల్ని రాజకీయ చైతన్యవంతులుగా తీర్చి దిద్దటానికి, కార్పొరేట్ అనుకూల పార్టీలను ఎన్నికలలో ఓడించడానికి పోరాటమే సరైన మార్గం. 2024 నవంబర్ 26వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే నిరసన ర్యాలీలు, ధర్నాలు పాలకులకు ఒక హెచ్చరికగా ఉండాలి.

ప్రమాదంలో రాజ్యాంగం!



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

గత ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని సరిగా అమలు చేయలేదు. అన్నిరంగాల్లో విలువలు పతనమయ్యాయి. అవినీతి పెరిగింది. ఎన్నికల్లో ధన, కండ బలాలు పెరిగాయి. నేర రాజకీయా కరణ, రాజకీయ నేరమయం జరిగాయి. కులమత విభజన ధోరణులు చొరబడ్డాయి. రాజ్యాంగ పీఠిక లక్ష్యాలు సాధించలేదు. సామాజిక సేవాదృక్పథంతో, త్యాగంతో నిండవలసిన రాజకీయాలు లాభసాటి వ్యాపారంగా, లూటీ వ్యవస్థగా మారాయి. పేదరికం, నిరక్ష రాస్యత, నిరుద్యోగం, ఆరోగ్యం, నీరు, ఆహార సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రభుత్వాల బలం, స్థిరత్వం ప్రజా శ్రేయస్సుకు కాక బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు ఉపయోగపడ్డాయి. పుక్కిటి పురాణాల, ఊహాగాథల, అసత్య భావజాల తాత్విక, మతాధార సమాజ విభజన మతాంధులు పాలిస్తున్నారు. రాజకీయ సామరస్యత, సమన్వయాలు, సామాజిక నిర్మాణం, శాంతి భద్రతల నిర్వహణ, ఆర్థిక అభివృద్ధి, దేశ సమైక్యత, సమగ్రతల్లో వీరు ప్రజాకంఠకులు. నేడు ప్రజా స్వామ్యం పతనమయ్యే స్థాయికి, రాజ్యాంగం ప్రమాద స్థితికి చేరాయి. 1949 నవంబరు26న రాజ్యాంగ ఆమోదసభలో, "మంచి రాజ్యాంగమైనా అమలు చేసేవారు చెడ్డవారైతే రాజ్యాంగం చెడుగా మారుతుంది. ప్రజల మీద, లక్ష్య సాధన, రాజ్యాంగ అమలుకు వారు స్థాపించు కునే రాజకీయ పక్షాలమీద రాజ్యాంగ వ్యవస్థల పనితీరు ఆధారపడుతుంది. దేశం మతాతీతంగా ఉండాలి. మతం రాజ్యాన్ని అతిక్రమిస్తే స్వాతంత్ర్యం రెండోసారి ప్రమాదంలో పడుతుంది. శాశ్వతంగా దూరమౌతుంది. చివరి రక్తంబొట్టు దాకా స్వాతంత్ర్యాన్ని కాపాడుకోటానికి తీర్మానించుకోవాలి" అని రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులు అంబేద్కర్, "పాలకులు యోగ్యులు, సమగ్రతనిబద్ధులు, గుణవంతులు ఐతే లోపభూయిష్ట రాజ్యాంగాన్ని కూడా ఉత్తమంగా మార్చగలరని" రాజ్యాంగ నిర్మాణసభ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ వివేకవంతమైన హెచ్చరికలు చేశారు. హిందుత్వవాది రాజేంద్రప్రసాద్ కూడా సరిగ్గా వ్యాఖ్యానించారు. నేటి పాలకులు అతిదుష్టులు. ప్రజాచైతన్య సంస్థలు, పక్షాలు బలహీనపడ్డాయి. రాజకీయ పక్షాలు వ్యాపార క్షేత్రాలయ్యాయి. నేటి పాలక పక్షాలు మతమౌఢ్య అడ్డాలు. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు అధ్వాన్నమైంది. నేటి పాలకుల పూర్వీకులు దేశవిభజన కోరుకున్నారు. ముస్లింలు పాకిస్థాన్‌కు వెళతారని, హిందువులు మాత్రమే మిగిలితే భారత్ హిందూదేశమౌతుందని ఆశించారు. వారి ఆశలు నెరవేరలేదు. పాశవిక ఆధిక్యతతో నేడు అధికారం చేపట్టిన మతాంధవారసులు దేశాన్ని హిందూదేశంగా మారుస్తున్నారు. వీరికి రాజేంద్ర ప్రసాద్ ప్రస్తావించిన యోగ్యత, సమగ్రతా నిబద్ధత, గుణగణాలు లేవు. మతం రాజ్యాన్ని అతిక్రమించింది. అందుకే రాజ్యాంగం నేడు ప్రమాదంలో పడింది. దేశ వ్యవస్థాపక పితామహులు విశిష్టత కలవారు. వివేక వంతులు. న్యాయవేత్తలు. దేశభక్తులు. స్వాతంత్ర్య సమరయోధులు. మత అత్యాచార హత్యలు, మతాధిక్య కేంద్రీకరణతో, అల్పమతస్తులను భయాందోళనలకు గురిచేసి అధికారం అందుకున్న మతప్రచారకుల్లో ఈ గుణాలుండవు. మన రాజ్యాంగం ఆంగ్లేయ



THE CONSTITUTION OF INDIA

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity; and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

పాలనను తిరస్కరించింది. ఆంగ్లేయ సంస్థలను కొనసాగించింది. ఫలితంగా సామ్రాజ్యవాదం కొనసాగింది. 1990లలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మొదలైంది. వీటిని నిన్నటి పాలకులు పాటించారు. నేటి పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సామ్రాట్ అమెరికాకు దాసోహమయ్యారు. స్వాతంత్ర్యం, స్వావలంబన సంక్షోభంలో పడ్డాయి. భారత రాజ్యాంగ పీఠిక: భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోడానికి, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని చేకూర్చుటకు, వారందరిలో వ్యక్తిగౌరవం, జాతి ఐక్యత, అఖండతలను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుటకు సత్యనిష్ఠాపూర్వకంగా తీర్మానించుకొని 1949 నవంబర్ 26న మన రాజ్యాంగ పరిషత్తులో పరిగ్రహించి శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం. ఇది పీఠిక రాజ్యాంగ మౌలిక రూపం. 1973 కేశవానంద భారతి-కేరళ ప్రభుత్వం కేసులో రాజ్యాంగ సవరణలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని, మౌలిక స్వరూపాన్ని మార్చరాదని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. రాజ్యాంగ సవరణలు, చట్టాలు రాజ్యాంగ పీఠికలోని అంశాలకు కట్టుబడి ఉండాలి. నేటి ప్రభుత్వ చట్టాలు, సవరణలు ఈ పీఠికకు తూట్లు పొడిచాయి. నేటి పాలకులు ప్రజా రాజ్యాంగాన్ని పాలక గ్రంథంగా మార్చారు. సర్వసత్తాక పదానికి అర్థం మార్చారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ దోపిడీలను సామ్యవాదం నిరోధిస్తుంది. నేటి పాలకులు ఆదాయ తారతమ్యాలను పెంచారు. వాణిజ్యవేత్తలకే ఉద్దీపనలు ఇచ్చారు. సామాన్యులను ఇబ్బంది పెట్టారు. దోపిడీ పెంచారు. సామ్యవాద భావాన్ని హత్యచేశారు. రాజ్యం మతాతీతంగా ప్రవర్తించటం, హేతు, భౌతిక, మానవవాదాలను ప్రోత్సహించటం లౌకిక లక్షణం. దేశాన్ని హిందు రాజ్యంగా మార్చేపనులు పెరిగాయి. పౌరసత్వ సవరణ చట్టంలో లౌకికత్వం పతనమైంది. ఎస్.ఆర్.బొమ్మై-భారత ప్రభుత్వం కేసులో, బాబ్రి మసీదు కూల్చివేత నేపథ్యంలో, లౌకికత్వాన్ని మంటగలిపిన బీజేపీ ప్రభుత్వాల రద్దును 1994 సుప్రీంకోర్టు తీర్పు సమర్థించింది. మతమౌఢ్య మోదీ-షా ప్రభుత్వ అలౌకికతాత్వికత దుర్మార్గమైంది. మతాచారాలను, మతకార్యకలాపాలను క్రమబద్ధీకరించవచ్చు, నియంత్రించవచ్చన్న 25(2) అధికరణను తుంగలో తొక్కారు. సామ్యవాద, లౌకిక పదాలనే రాజ్యాంగం నుంచి తొలగిస్తామన్నారు. ఈ పదాల వాడకం మానేశారు. ప్రజాస్వామ్య స్థానంలో ఏకఛత్రాధిపత్యం, నియంతృత్వం ఏలుతున్నాయి. నిర్ణీత కాలానికి ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ప్రభుత్వమే గణతంత్రం. ఈ ప్రభుత్వం గణతంత్రాన్ని నాశనంచేసింది. గణతంత్ర వేడుకలను కాషాయీ కరిస్తోంది. "మార్క్సిజం పట్ల జనాకర్షణకు కారణం దాని శాస్త్రీయ సిద్ధాంతం కాదు. సామాజిక న్యాయ తపన" అని నెహ్రూ అన్నారు. నేడు న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తి నల్లపూస. భయాలు, ఆశలతో ప్రభుత్వం న్యాయమూర్తులను లొంగదీసుకుంది. అన్నీ ఏకగ్రీవ తీర్పులే. అసమ్మతి ఆనవాళ్లు కనిపించవు. బాబాలను, అమ్మలను, గాడ్సే భక్తులను ప్రోత్సహించారు. ప్రజా ప్రతినిధు లను చేశారు. ఈ పనులన్నీ సంఘ్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్ ప్రవచించినట్లు రాజ్యాం గాన్ని రద్దుచేసి మనుస్మృతిని రుద్దడానికే. అందుకే ఇన్నాళ్లూ లేనిది ఇప్పుడు రాజ్యాంగం ప్రమాదంలో పడింది. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్నే కాదు దేశాన్నే భ్రష్టుపట్టించింది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సూచించినట్లు దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే. రాజ్యాంగ రక్షణకు పౌరసమాజం నడుం బిగించాలి.

జాతీయ కార్యదర్శి ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
సెల్: 9490 20 4545

విశాలాంధ్ర
5
ఆదివారం
24 నవంబరు 2024

అభివృద్ధే మహాయుతికి మళ్లీ పట్టం కట్టింది: గడ్కరీ



న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి విజయంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. మహాయుతి కూటమి నేతలందరికీ అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహారాష్ట్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, అందుకే మహారాష్ట్ర ప్రజలు మరోసారి పట్టం కట్టారన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతికి చరిత్రాత్మక విజయం కట్టబెట్టిన ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు. ప్రజల ఆకాంక్షలకు కట్టుబడి, మహారాష్ట్ర సమగ్ర పురోగతికి ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది' అని గడ్కరీ పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని అన్నారు. ఇంతటి ఘనవిజయం కోసం శ్రమించిన మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్, బీజేపీ, మహాయుతి నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వం అంటే ఫేస్‌బుక్ కాదు: షిండే

ముంబై: మహారాష్ట్ర ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని ఆ రాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 'మహాయుతి' ఘన విజయం నేపథ్యంలో కూటమి నేతలు ఫడ్నవీస్, అజిత్ పవార్‌తో కలిసి ఆయన ఉమ్మడి విలేకరుల సమావేశం నిర్వహించారు. ముగ్గురు నేతలు మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ముగ్గురు నేతలూ మీడియాతో మాట్లాడారు. ఇదో చరిత్రాత్మక విజయమంటూ ఓటర్లకు ఏక్‌నాథ్ షిండే ధన్యవాదాలు తెలిపారు. తమపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు. అదేసమయంలో ఉద్ధవ్ ఠాక్రేపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అంటే ఫేస్‌బుక్ కాదని దుయ్యబట్టారు. కార్యకర్త ప్రజల మధ్య పనిచేయాలని బాలాసాహెబ్ ఎప్పుడూ చెప్పేవారన్నారు. ఆయన చెప్పిన సూచనలను తాము తప్పక పాటిస్తూ వచ్చామన్నారు. మహారాష్ట్ర అభివృద్ధికి మహా వికాస్ అఘాడీ సర్కారు సృష్టించిన అడ్డంకులను తాము తొలగించామని షిండే పేర్కొన్నారు. కోస్టల్ రోడ్డు, అటల్ సేతు, ముంబై మెట్రో వంటి ప్రాజెక్టులను తిరిగి ప్రారంభించామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందంటూ తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. వారి అసత్యాలు ప్రజలు విశ్వసించలేదని, కాబట్టే ఇవాళ ఈ విజయం తమకు ప్రజలు కట్టబెట్టారని చెప్పారు. అభివృద్ధికి, సంక్షేమానికి సమతూకంగా ముందుకెళ్తామని తెలిపారు. మహాయుతి విజయంలో లడ్కీ బహీణ్ పథకం గేమ్ ఛేంజర్‌గా మారిందని అజిత్ పవార్ అన్నారు. ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక కొందరు బ్యాలెట్ ఓటింగ్ ప్రస్తావన తెస్తున్నారని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్‌ను తప్పుబట్టారు. ఈవీఎంలలో లోపం ఉంటే జార్ఖండ్‌లో ఓడిపోయాం కదా అని పేర్కొన్నారు. ప్రధాని మోదీపై గల నమ్మకంతో తమ కూటమిని ప్రజలు గెలిపించారని ఫడ్నవీస్ చెప్పారు.

విపక్ష చక్రవ్యూహం విచ్ఛిన్నం: ఫడ్నవీస్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి'కూటమి విజయంపై బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ప్రజలంతా నరేంద్ర మోదీ వెంటే నిలిచారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఇంతటి భారీ విజయం సాధించడంలో సహకరించిన మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనేక తప్పుడు ఆరోపణలు, బూటకపు కథనాలు ప్రచారం చేయడం, మతం ఆధారంగా ఓటర్లను వేరు చేయడం వంటి విపక్ష పార్టీల ప్రయత్నాలను ప్రజలు విఫలం చేశారన్నారు. తమ కూటమి విజయంపై ముంబైలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర ఓటర్లు, పార్టీ శ్రేణులు, నేతల మద్దతు వల్లే విపక్షాల 'చక్రవ్యూహం'ను విచ్ఛిన్నం చేయడంలో తాను విజయవంతమయ్యానన్నారు. అదేసమయంలో ముఖ్యమంత్రి పదవి విషయంలో ఎలాంటి వివాదం లేదని, తదుపరి సీఎం ఎవరనే విషయంపై 'మహాయుతి' నేతలు నిర్ణయిస్తారని ఫడ్నవీస్ స్పష్టం చేశారు.

ఇది ప్రజా తీర్పుకాదు

ఈవీఎం గెలుపు: సంజయ్ రౌత్



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ముమ్మాటికీ ప్రజా తీర్పు కాదన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఎన్డీయే గెలుస్తోందని ఆరోపించారు. 'ఫలితాల సరళి చూస్తుంటే ఏదో తప్పుజరిగినట్లు అనిపిస్తోంది. వాళ్లు ఏదో గోల్‌మాల్ చేశారు. మా సీట్లు కొన్ని దోచుకున్నారు. ఇది ప్రజల నిర్ణయం కానేకాదు. ఇక్కడ జరిగిన తప్పేంటో అందరికీ అర్థమవుతోంది. ఈ ఫలితాలతో ప్రజలు కూడా ఏకీభవించడం లేదు. షిండేకు 60 సీట్లు, అజిత్ పవార్‌కు 40, బీజేపీకి 125 సీట్లు రావడం సాధ్యమేనా? ఈ రాష్ట్ర ప్రజలు నిజాయతీ పరులు' అని పేర్కొన్నారు. ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన అభ్యర్థులు అందరూ ఆధిక్యంలో కొనసాగడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బాల్ ఠాక్రే స్థాపించిన శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్‌పై మరాఠా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. వారు చేసిన మోసాన్ని మహారాష్ట్ర ప్రజలు ఎలా మరిచిపోతారని అన్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తమకు స్పష్టమైన ఆధిక్యం వచ్చిందని, ఫలితాలు ఇప్పుడెలా మారాయని రౌత్ అనుమానం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రజా తీర్పు కాదని, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి మహాయుతి కూటమి గెలిచిందని ఆరోపించారు. మహారాష్ట్రలో ప్రజాస్వామ్యం మరోసారి ఖూనీ అయినట్లు నిరూపితమైందని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.

చెలక్కరలో ఎల్‌డీఎఫ్... పలక్కాడ్‌లో కాంగ్రెస్

తిరువనంతపురం: కేరళలోని కమ్యూనిస్టు కోట చెలక్కరలో మరోమారు ఎర్ర జెండా ఎగిరింది. ఎల్‌డీఎఫ్ తరపున బరిలోకి దిగిన సీపీఎం నేత యూఆర్ ప్రదీప్ 12,201 ఓట్లతో గెలిచారు. ప్రదీప్‌కు మొత్తం 68,872 ఓట్లు వచ్చాయి. యూడీఎఫ్ అభ్యర్థి, అలతూర్ మాజీ ఎంపీ రమ్య హరిదాస్ రెండవ స్థానంలో నిలిచారు. ఆమెకు మొత్తం 52,628 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి కె.బాలకృష్ణన్ 33,609 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. గతసారితో పోల్చితే ఈ పార్టీ ఓట్లు 9వేల మేర పెరిగాయి. 2021లో ఎన్‌డీఏ అభ్యర్థి పట్టికాడ్ 24,045 ఓట్లు పొందారు. ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యే కె.రాధాకృష్ణన్ లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఈ స్థానానికి ఎన్నికలొచ్చాయి.

పలక్కాడ్‌లో

పలక్కాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ మంకుతాహిల్ విజయకేతనం ఎగురవేశారు. 18,840 ఓట్లతో బీజేపీ అభ్యర్థి సి.కృష్ణకుమార్‌ను ఓడించారు. మొత్తం 58,389 ఓట్లు సాధించారు. కృష్ణకుమార్‌కు 39,549 ఓట్లు వచ్చాయి. సీపీఎం మద్దతిచ్చిన పి.శరిణ్ 37,293 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. పలక్కాడ్‌లో కాంగ్రెస్‌కు మంచి పట్టున్నప్పటికీ హిందూ ఓట్లు ఎక్కువగా ఉండటంతో బీజేపీకి అనుకూలమైన స్థానంగానూ నిలిచింది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రెండవ స్థానంలో నిలుస్తోంది. మొదట్లో బీజేపీ ఆధిక్యత ప్రదర్శించింది కానీ ఏడవ రౌండు లెక్కింపు సమయానికి 1,425 ఓట్ల తేడాతో రాహుల్ మంకుతాహిల్ ఆధిక్యంలోకి వచ్చారు. కాంగ్రెస్ తరపున వడకర స్థానం నుంచి ఎమ్మెల్యే షఫీ పరంబిల్ లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

సింద్రీలో సీపీఐ(ఎంఎల్) అభ్యర్థి విజయం

సింద్రీ: జార్ఖండ్‌లో సింద్రీ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ అభ్యర్థి చంద్రదేవ్ మహతో 1,05,136 ఓట్లతో గెలుపొందారు. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా తారాదేవి బరిలో నిలిచారు. ఆమె 1,01,688 ఓట్లతో రెండోస్థానంలో నిలిచారు. 42,664 ఓట్లతో జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారీ మోర్చా పార్టీ నుంచి పోటీ చేసిన ఉషాదేవి మూడోస్థానంలో నిలిచారు.

ఎంవీఏను మళ్లీ ముంచిందా?

- కాంగ్రెస్ పని తీరుపై అనేక ప్రశ్నలు
- ముందే సీఎం కుర్చీ కోసం పట్టు
- పోటీ చేసే స్థానాలపైనా అస్పష్టత
- మహాయుతిని నిలువరించడంలో వైఫల్యం

ముంబై/న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అధికార మహాయుతికి అనుకూలంగా వచ్చాయి. కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన (యూబీటీ)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)ని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పుడు సంకీర్ణంలో కాంగ్రెస్ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధించింది. కూటమి గెలుపు కోసం బీజేపీ చేయని ప్రయత్నం లేదు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే ఫలితాలపై స్పందిస్తూ పేలవమైన పనితీరు వెనుక ఉన్న ప్రధాన కారణాల్లో ఒకటిగా ఎన్నికలను ఎదుర్కొనేందుకు అవసరమైన సమయం లేదని చెప్పుకొచ్చారు. మీడియాతో శ్రీనతే మాట్లాడుతూ 'ఈవీఎంలపై సవివరమైన చర్చ జరగాలి. ఈ రోజు... ఆ రోజు కాదు. ఫలితాలు మాకు అనుకూలంగా రాలేదు. మేము ఒక పాఠం నేర్చుకున్నాం. ముఖ్యంగా ఎన్నికల తేదీలను పొడిగించిన విధానంతో మహాయుతికి సిద్ధం కావడానికి మరింత సమయం దొరికింది' అని అన్నారు. ఆమె నిరుత్సాహం వ్యక్తం చేస్తూ... 'మేము మహారాష్ట్రలో మంచి ప్రచారం చేశాం. కానీ ఫలితాలు మా అంచనాలను అందుకోలేదు' అని తెలిపారు. ఈ ఫలితాలు రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని ఆశించిన ఎంవీఏకు కాంగ్రెస్ ఓటమి గట్టి దెబ్బ. కాంగ్రెస్ ఓటమి అంగీకరించగా, దాని మిత్రపక్షమైన శివసేన (యూబీటీ) ఎన్నికల ప్రక్రియ జరిగిన తీరుపై ఆందోళన వ్యక్తం చేసింది. శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఫలితాల్లో ఏదో లోపం ఉందని పేర్కొంటూ... 'కుచ్‌తో గడ్బడ్ హై (ఏదో తప్పు)... ఇది మహారాష్ట్ర ప్రజల నిర్ణయం కాదు. మహారాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారో మాకు తెలుసు' అని అన్నారు.

ఎన్నికలకు ముందే కుర్చీ కోసం పట్టు!

ముఖ్యమంత్రి కుర్చీ కోసం జరిగిన పోరు... వారి పోరాటంతో కార్యకర్తల్లో గందరగోళం ఓటమికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మహారాష్ట్రలో దిగ్భ్రాంతికరమైన ఫలితం వచ్చినప్పటికీ జార్ఖండ్‌లో విజయం కాంగ్రెస్‌లో ఉత్సాహం పెంచలేకపోయింది. ఈ ఫలితాలు ఇండియా కూటమి శిబిరంపై, మహారాష్ట్రలోని ఎంవీఏ నియోజకవర్గాలపై, మరీ ముఖ్యంగా రాహుల్‌గాంధీ ట్రాక్ రికార్డ్, ఎన్నికల్లో గెలవగల సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇతర రాష్ట్రాల మాదిరిగా కాకుండా, మహారాష్ట్ర కాంగ్రెస్ దూకుడు, బలమైన వ్యవస్థను కలిగి ఉంది. అందుకే రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులు పార్టీకి ఎక్కువ సీట్లు కావాలని పట్టుబట్టారు. అంతేకాకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ముందు కూడా తమనే ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టాలని కాంగ్రెస్ నుంచి డిమాండ్లు వచ్చాయి. ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించడం ముఖ్యమని భావించిన మహా వికాస్ అఘాడి మిత్రపక్షాలకు ఇది చికాకు కలిగించింది. సీఎం కుర్చీ కోసం జరిగిన పోరు కూడా ఎన్నికల్లో నష్టపోవడానికి కారణమని భావిస్తున్నారు. పోస్టుమార్టం మొదలయ్యే కొద్దీ మిత్రపక్షాల ఆగ్రహం, నిస్పృహలు కాంగ్రెస్‌పైకి వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ లేవనెత్తిన అనేక అంశాలు ఓటర్లను ఆకట్టుకోలేకపోయాయి. కానీ అంతకుమించి దాని మిత్రపక్షాలైన శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే వంటి వారు కాంగ్రెస్ అగ్రనేతలను హెచ్చరించారు. ఉదాహరణకు, వీర్ సావర్కర్‌పై రాహుల్‌గాంధీ చేసిన విమర్శలు... ఉద్ధవ్ ఠాక్రే సేన, శరద్ పవార్ ఎన్సీపీని దెబ్బతీశాయి. దీంతో గాంధీని బలవంతంగా వెనక్కి తీసుకోవలసి వచ్చింది. బీజేపీ దీనిని ఉపయోగించుకోవడంతో నష్టం జరిగింది. ఎంవీఏలో పైకి కనిపించకుండా ఉన్న విభేదాలు ఇప్పుడు విస్తృతంగా మారవచ్చు. ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్ వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ చాలాకాలంగా కాంగ్రెస్ వైఖరితో కలత చెంది ఉన్నాయి. చాలామంది కాంగ్రెస్ సరైన కూటమి భాగస్వామి కాదని ఆరోపిస్తున్నారు.

బలహీనతలు బయటపడ్డాయా?

లోక్‌సభ ఎన్నికలలో దాని ఉత్సాహభరితమైన ప్రదర్శన... 99 సీట్లు గెలుచుకోవడం, బీజేపీ సంఖ్యను 303 నుంచి 240 కి తగ్గించడం ద్వారా కాంగ్రెస్ పునరాగమనానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపించింది. అయితే, హర్యానా ఓటమి, జమ్మూకశ్మీర్ పతనం, ఇప్పుడు మహారాష్ట్ర ఓటమి వంటి వరుస పరాజయాలు దాని బలహీనతలను బయటపెట్టాయి. మహారాష్ట్ర కాంగ్రెస్‌కు క్లిష్టమైన యుద్ధభూమిగా ఉంది. ప్రత్యేకించి విదర్భలో గత విజయాలు, వ్యవసాయ దుస్థితి కథనాలను ప్రభావితం చేయాలని ఆశించింది. అయినప్పటికీ బీజేపీ సమర్థవంతమైన ప్రచారం ఈ అవకాశాలను దెబ్బతీశాయి

కాంగ్రెస్ పొరపాట్లు

ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో లాభపడినప్పటికీ, ఈ జోరును సద్వినియోగం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఛిన్నాభిన్నమైన వ్యూహం, తక్కువ ప్రచారం దాని మిత్రపక్షాలు ఎన్నికల భారాన్ని చాలా వరకు మోసుకెళ్లాయి. అలాగే, ఎన్నికల ముందు చర్చల సందర్భంగా నియోజకవర్గాల పంపిణీపై రాహుల్ గాంధీ అసంతృప్తితో ఎంవీఏలో ఉద్రిక్తత నెలకొంది. ఈ పతనం మహారాష్ట్రకే పరిమితం కాదు. ఆప్, టీఎంసీ వంటి మిత్రపక్షాలు దాని పొత్తు విలువను ఎక్కువగా ప్రశ్నిస్తున్నందున, దుర్భరమైన పనితీరు ఇండియా ఐక్య సంఘటనలో కాంగ్రెస్ జాతీయ స్థాయికి ఆందోళన కలిగిస్తుంది. అంతర్గత విభేదాలు, అసమర్థమైన క్షేత్ర స్థాయి వ్యూహ రచనలో కాంగ్రెస్ పేలవమైన ప్రదర్శన ప్రతిపక్ష ఐక్యతలో పగుళ్లను పెంచుతుంది. ఇది 2024 కోసం కఠినమైన రహదారిని సూచిస్తుంది.

ఉప ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సహా 15 రాష్ట్రాల్లో 48 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా... వీటి ఫలితాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలో మహాయుతి, జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్‌తో కూడిన విపక్ష కూటమి ఘన విజయం సాధించింది. అనేక రాష్ట్రాల ఉపఎన్నికల్లోనూ బీజేపీ అధికార స్థానాలు గెలుచుకుంది. అసోం, బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో మెజార్టీ స్థానాలు ఎన్డీయే గెలుచుకోగా... బెంగాల్‌లో ఆరు స్థానాలను తృణమూల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అసోంలో ఐదు స్థానాలకు ఐదింటినీ ఎన్డీయే గెలుచుకుంది. సమగురి నియోజకవర్గంలో పోటీ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ ఓటమి చవిచూసింది. బీహార్‌లో నాలుగు స్థానాలను ఎన్డీయే గెలుచుకుంది. రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు, హిందుస్థానీ అవామ్ మోర్చా, జేడీయూ ఒక్కోచోట విజయం సాధించాయి. ప్రశాంత్ కిశోర్ పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ... ఏ ఒక్కరూ విజయం సాధించలేదు. ఛత్తీస్‌గఢ్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరిగ్గా... అందులో బీజేపీ అభ్యర్థి సునీల్ కుమార్ సోనీ విజయం సాధించారు. గుజరాత్‌లో వావ్ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ గెలుచుకుంది. కర్నాటకలో మూడు స్థానాలకుగాను మూడింటినీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చెన్నపట్నలో జేడీఎస్ నేత కుమారస్వామి తనయుడు నిఖిల్ పోటీ చేసి ఓడిపోయాడు. కేరళలో రెండు స్థానాలకు ఎన్నిక జరిగింది. పలక్కాడ్‌లో కాంగ్రెస్, చెలక్కరలో సీపీఎం అభ్యర్థులు గెలుపొందారు. వయనాడ్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ 4 లక్షలకుపైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు.

మధ్యప్రదేశ్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నిక జరగ్గా... విజయ్‌పూర్‌లో కాంగ్రెస్ విజయం సాధించగా... బుద్నీలో బీజేపీ గెలుపొందింది. మేఘాలయాలో నేషనల్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. పంజాబ్‌లో నాలుగు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలో మూడు చోట్ల ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్ ఒకచోట గెలుపొందాయి. రాజస్థాన్‌లో ఏడు స్థానాలకుగాను ఐదు చోట్ల బీజేపీ, దౌసాలో కాంగ్రెస్, చౌరాసీలో భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. సిక్కింలో రెండు స్థానాల్లో సిక్కిం క్రాంతికారీ మోర్చా గెలుపొందింది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం తొమ్మిది స్థానాలకు ఉపఎన్నిక జరగగా... బీజేపీ ఆరు స్థానాల్లో విజయం సాధించగా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రెండు, ఆర్ఎల్‌డీ ఒకచోట విజయం సాధించాయి. ఉత్తరాఖండ్‌లో ఒక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ గెలిచింది. పశ్చిమ బెంగాల్‌లో ఆరు స్థానాలను తృణమూల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

ప్రశాంత్ కిశోర్ పార్టీ చిత్తు

బీహార్‌లోని నాలుగు స్థానాల్లో అభ్యర్థుల ఓటమి

పాట్నా: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వ జన్ సూరజ్ పార్టీ... బీహార్ ఉప ఎన్నికల్లో చిత్తైంది. పోటీ చేసిన నాలుగు స్థానాల్లో ఓడిపోయింది. నలుగురు అభ్యర్థులు భారీ మెజారిటీతో ఓటమి పాలయ్యారు. ఇమామ్‌గంజ్, బాలగంజ్, రామ్‌ఘర్, తరారీ స్థానాలలో జితేంద్ర పాశ్వాన్, మహమ్మద్ అంజద్, సుశీల్ కుమార్ సింగ్, కిరణ్ సింగ్ పోటీ చేశారు. రామ్‌ఘర్, తరారీ స్థానాల్లో బీజేపీ... ఇమామ్‌గంజ్, బలగంజ్ స్థానాల్లో జేడీయూ, హిందుస్తానీ అవామ్ మోర్చా గెలిచాయి. బాలగంజ్ నుంచి ప్రశాంత్ కిశోర్ నిలబెట్టిన మహమ్మద్ అంజద్‌కు 17,285 ఓట్లు వచ్చాయి. ఇక్కడ నుంచి గెలిచిన మనోరమా దేవి (జేడీయూ)కి 73,334 ఓట్లు పోలయ్యాయి. ఇమామ్‌గంజ్‌లో జితేంద్ర పాశ్వాన్‌ను ప్రశాంత్ కిశోర్ నిలబెట్టగా, ఆయనకు 37,103 ఓట్లు వచ్చాయి. కేంద్ర మంత్రి జితేంద్ర రామ్ మాంఝి కోడలు దీపా మాంఝి విజయం సాధించారు. ఆమెకు 54,435 ఓట్లు వచ్చాయి.

రామ్‌ఘర్‌లో ప్రశాంత్ కిశోర్ పార్టీ నుంచి శుశీల్ కుమార్ సింగ్ పోటీ చేయగా ఆయనకు 6,513 ఓట్లు వచ్చాయి. విజేత అశోక్ కుమార్ సింగ్ (బీజేపీ) 62,257 ఓట్లు సాధించారు. తరారీ స్థానం నుంచి కిరణ్ సింగ్‌ను ప్రశాంత్ కిశోర్ నిలబెట్టగా ఆయనకు 5,592 ఓట్లు వచ్చాయి. ఇక్కడ నుంచి గెలిచిన బీజేపీ అభ్యర్థి విశాల్ ప్రశాంత్ (మాజీ ఎమ్మెల్యే, పార్టీలో శక్తిమంత నేత సునీల్ పాండే కుమారుడు)కు 78,564 ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ స్వీప్

- కర్నాటక మూడు స్థానాల్లో గెలుపు
- కుమారస్వామి, బొమ్మై కుమారుల ఓటమి

బెంగళూరు: కర్నాటర ఉప ఎన్నికల్లో మొత్తం మూడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసింది. చన్నపట్నం, షిగ్గావ్, సందూర్ స్థానాలను స్వీప్ చేసింది. మూడు చోట్ల కాంగ్రెస్‌కు విపక్ష బీజేపీ-జేడీఎస్‌కు మధ్య హోరాహోరీ సాగింది. జేడీఎస్ నుంచి చెన్నపట్నం, షిగ్గావ్ స్థానాలను, బీజేపీ నుంచి సందూర్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. తాజా గెలుపుతో కర్నాటక అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్యా బలం 137కు పెరిగింది. తాజా పరిణామంతో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, బసవరాజ్ బొమ్మై తమ కుటుంబాలకు కంచుకోటలుగా చెప్పే చెన్నపట్నం, షిగ్గావ్ నియోజకవర్గాలపై పట్టు కోల్పోయారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, బసవరాజ్ బొమ్మై కుమారులు బరిలో నిలవగా, ఇద్దరూ ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలే ఆ పార్టీని విజయ పథంలో నడిపించాయని ఎన్నికల విశ్లేషకులు అన్నారు.

చెన్నపట్నంలో

చెన్నపట్టంలో కాంగ్రెస్ అభ్యర్థి కేపీ యోగేశ్వరన్ విజేతగా నిలిచారు. జేడీఎస్ తరపున పోటీ చేసిన హెచ్‌డీ కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామిని 25వేలకుపైగా ఓట్లతో చిత్తు చేశారు. యోగేశ్వరన్‌కు లక్షకుపైగా ఓట్లు వచ్చాయి. నిఖిల్‌కు 77వేల ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో మాండ్యా నుంచి ఎన్నిక కావడంతో ఈ స్థానాన్ని కుమారస్వామి ఖాళీ చేశారు. వొక్కాలిగా నాయకులుగా కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ విస్తృత ప్రచారం తో చెన్నపట్నం ఫలితాలు ఉత్కంఠ రేపాయి.

షిగ్గావ్‌లో

షిగ్గావ్ స్థానంలో కాంగ్రెస్ తరపున యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్ గెలిచారు. బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మైపై దాదాపు 15వేల ఓట్లతో గెలుపొందారు. పఠాన్‌కు 99వేల ఓట్లు రాగా భరత్‌కు 85వేల ఓట్లు వచ్చాయి. 2008 నుంచి ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన బసవరాజ్ బొమ్మై... లోక్‌సభ ఎన్నికల్లో హవేరి నుంచి ఎన్నికైన క్రమంలో ఈ స్థానాన్ని వీడాల్సి వచ్చింది.

సందూర్‌లో

సందూర్ (ఎస్టీ) నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అన్నపూర్ణ విజేతగా నిలిచారు. బీజేపీ అభ్యర్థి బంగారు హనుతుపై 10వేలకుపైగా ఓట్లతో ఆమె గెలుపొందారు. బళ్లారి నుంచి కాంగ్రెస్ ఎంపీ ఇ.తుకారామ్ భార్య అన్నపూర్ణ. ఆమెకు 93,051 ఓట్లు రాగా హనుమంతుకు 83,483 ఓట్లు పోలయ్యాయి. ఈ స్థానంలో బీజేపీ గెలుపు కోసం ఆ పార్టీ ఎమ్మెల్యే గాలి జనార్ధన్ విస్తృత ప్రచారం చేశారు.

నేడు జీ తెలుగులో మారుతీనగర్ సుబ్రమణ్యం

విశాలాంధ్ర-కడప: కడుపుబ్బా నవ్విస్తూనే ఆలోచింపజేసే కామెడీ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను మెప్పించిన మారుతీనగర్ సుబ్రమణ్యం సినిమా ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు జీ తెలుగు సినిమాలో ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీ నగర్ సుబ్రమణ్యం సినిమా మారుతి నగర్‌లో నివసించే సుబ్రమణ్యం అనే వ్యక్తికి సంబంధించినదని అన్నారు. సుబ్రమణ్యం (రావు రమేష్) ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఆశిస్తాడు. అతని భార్య కళారాణి (ఇంద్రజ) ఇంటి నిర్వహణ బాధ్యత తీసుకుంటుంది. వారి కొడుకు అర్జున్ (అంకిత్ కొయ్య) కూడా నిరుద్యోగి. ఓ రోజు అనుకోకుండా సుబ్రమణ్యం బ్యాంకు ఖాతాలో రూ.10 లక్షలు జమయ్యాయి. ఆ డబ్బు ఎవరిది? సుబ్రమణ్యం తనకు వచ్చిన సమస్య నుంచి ఎలా బయటపడ్డాడు? అనేది తెలియాలంటే ట్విస్టులు, కామెడీతో సాగే మారుతీనగర్ సుబ్రమణ్యం సినిమా చూడాల్సిందే అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, ఇంద్రజ ప్రధానపాత్రల్లో నటించగా, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, అజయ్, ప్రవీణ్, హర్షవర్ధన్ కీలక పాత్రలు పోషించారు. ప్రతి ఒక్కరి నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, భావోద్వేగం, హాస్యం మేళవింపుతో సినిమా ఆద్యంతం ఆకట్టుకుంటుందన్నారు.

పవార్ పవర్ తగ్గిందా?

- 'మహా' అసెంబ్లీ ఫలితాల్లో శరద్ ఎన్సీపీకి నిరాశే!
- లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆరు నెలల్లోనే పతనం

ముంబై: దేశ రాజకీయాలలో అత్యంత శక్తిమంతమైన నాయకుల్లో ఒకరైన శరద్ పవార్ రాజకీయ శక్తి తగ్గిందా? ఆయనకు చెందిన ఎన్సీపీ (ఎస్పీ) లోక్‌సభ ఎన్నికల్లో అద్భుత విజయాలు సాధించిన తర్వాత కేవలం ఆరు మాసాలకే జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బొక్కబోర్లా పడటంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తన రాజ్యసభ పదవీకాలం 2026లో ముగిసిన తర్వాత క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. 83 ఏళ్ల ఆయన ప్రణాళికను ఒకసారి పరిశీలిస్తే...మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తన రాజకీయ జీవితంలో అతిపెద్ద మచ్చగా మిగిలిపోతుంది. అసెంబ్లీ ఎన్నికలో శరద్‌పవార్ పార్టీ 87 స్థానాల్లో పోటీ చేసి...తక్కువ స్థానాల్లోనే గెలుపొందింది. ఓటు షేరు 14.94 శాతం మాత్రమే సాధించింది. ఇది అనుభవజ్ఞుడైన నాయకుడికి ఏమాత్రం సరిపోనిది. ఆరు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 80 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించింది. కేవలం ఆరు మాసాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం అవమానకరరీతిలో ఓటమి పాలైంది. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకన్నా తక్కువ సీట్లు రావడం శరద్ పవార్‌ను బాగా కుంగదీసే అంశమే. గత సంవత్సరం అజిత్ పవార్ ఎన్సీపీని చీల్చిన తర్వాత పవార్‌ల మధ్య మొదటి పోటీ లోక్‌సభ ఎన్నికలు. అయితే శరద్ పవార్ అక్కడ నిర్ణయాత్మక విజయం సాధించారు. ప్రత్యర్థి వర్గానికి అసలు పేరు, గుర్తు ఉన్నప్పటికీ తన గ్రూపు నిజమైన ఎన్సీపీ అని శరద్ పవార్ వాదిస్తూ వచ్చారు. ఎంతో ముఖ్యమైన ఈ అసెంబ్లీ ఎన్నికల్లో శరద్ పవార్ వర్గం కేవలం స్వల్ప స్థానాలకు పరిమితం కావడం, అజిత్ పవార్ వర్గం ఎక్కువ స్థానాలు సాధించడం... ఆయనకు ఇబ్బందికరపరిస్థితేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో అవిభక్త ఎన్సీపీ 54 స్థానాలు గెలుచుకుంది. దాని మిత్రపక్షం కాంగ్రెస్ కంటే ఎక్కువగా 44 సాధించగలిగింది, కానీ ఈ ఎన్నికలలో శరద్ పార్టీ చతికిలపడింది. కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన (యూబీటీ) కూడా స్వల్ప స్థానాలు మాత్రమే గెలుచుకున్నాయి. 2022లో ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు కారణంగా శివసేన పార్టీ చీలిపోయింది.

రాజకీయ చాణుక్యుడుగా...

శరద్ పవార్ దాదాపు ఆరు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగుసార్లు పని చేశారు. 1978లో 38 సంవత్సరాల వయస్సులో ఆ పదవి చేపట్టిన అతి పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. కేంద్ర మంత్రివర్గంలో రక్షణ, వ్యవసాయం వంటి వివిధ శాఖలు నిర్వహించారు. 1991లో ప్రధానమంత్రి పదవి విషయంలో పీవీ నరసింహారావు చేతిలో ఓడిపోయినట్లు కనిపించింది. కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత పవార్ ఎన్సీపీ స్థాపించి... మహారాష్ట్రలో నలుగురు కీలక ఆటగాళ్లలో ఒకరిగా స్థిరపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో చేరి పదేళ్లపాటు వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేశారు. పార్టీలకు అతీతంగా సంబంధాలు కలిగి ఉన్న శరద్ పవార్... 2019లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) రూపశిల్పిగా మారారు. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం ఏర్పడటంలో కీలకపాత్ర పోషించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దోబీ ఘాట్ సమస్యల పరిష్కారానికి కృషి

ఈటల రాజేందర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాగోల్ దోబి ఘాట్ యందు నిర్వహించిన ఈదమ్మ మాత బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ దోబిగాట్ ప్లాంటును, కమ్యూనిటీ హాల్‌ను కాంపౌండ్ వాల్‌ను పరిశీలించారు. స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిధుల కొరతతో సగంలో ఆగిపోయిన, కాంపౌండ్ వాల్ కమ్యూనిటీ హాలు పరిపూర్తి, సిసి రోడ్డు పనులను ప్లాంటు అభివృద్ధికి తన వంతు కృషిని, సహకారాన్ని అందిస్తానని, స్థానిక మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను స్థానిక జి.హెచ్.ఎం.సి అధికారులతో మాట్లాడి పరిపూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. దోబిగాట్‌లను సమస్యలపైన మౌలిక వసతుల పైన బొడ్డుపల్లి కృష్ణ, బి.చుక్కయ్య, బి.సహదేవు, ఎంపీకి వివరించారు. స్థానిక సీనియర్ బిజెపి నాయకులు చింతల సురేందర్ యాదవ్, రజక వృత్తిదారులు, రజక సంఘం నాయకులు, రమేష్, మధు మహేందర్‌నాథ్, భరత్ కుమార్, వినయ్ కుమార్, కార్తీక్ ఆర్.సూరి, బి.లక్ష్మి, బి.రాదా, శ్వేత, లేక బాలమణి, భాగ్యలక్ష్మి, ప్రియ, అఖిల వైష్ణవి, సత్యశ్రీ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాక్స్ డ్రైన్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని జెకె కాలనీ వడ్డెర బస్తీలో మంజూరైన బాక్స్ డ్రైన్ పనులు సరైన ప్రణాళిక లేకుండా అధికారులు మ్యాప్ చేశారని, దీనివల్ల చిన్న ఇండ్లు అంటే 50 గజాల రేకుల ఇండ్లకు నష్టం జరుగుతుందని, బాక్స్ డ్రైన్ గురించి తవ్వకాలు మొదలుపెడితే పక్కనే ఉన్న ఇండ్లకు సంబంధించిన పునాదులు కూలిపోయే అవకాశం ఉన్నదని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కోరారు. అధికారులతో కలిసి బాక్స్ డ్రైన్ నిర్మించే స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఇండ్లకు నష్టం జరిగేలా బాక్స్ డ్రైన్ నిర్మించడం కుదరదని, నాలాలు ఆక్రమించుకొని బహుళ అంతస్తులు నిర్మించుకున్న వారిని ఉపేక్షించిన అధికారులు, మరి 50 గజాల స్థలంలో ఇండ్లు కట్టుకున్న పేద ప్రజలకు అన్యాయం చేయడం సమంజసం కాదని, ప్రజలకు నష్టం జరిగే ఏ ఒక్క పనికి కూడా తన సహకారం ఉండదన్నారు. ప్రత్యామ్నాయ మార్గం నుండి బాక్స్ డ్రైన్ నిర్మించే విధంగా మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. సత్యలక్ష్మి, సీనియర్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, చందు, శేఖర్ గౌడ్, పేపేర్ శ్రీను, సాయి గౌడ్, వడ్డెర రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై జోనల్ కమిషనర్‌ను కలిసిన రవికుమార్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్ డివిజన్, లింగంపల్లి డివిజన్ లలో రోడ్లు, డ్రైనేజీ సరిగా లేక అక్రమ కట్టడాల వలన ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని వారి కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్ కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, కొన్ని డివిజన్ల రోడ్లు చాల వరకు పాడైపోయాయని అలాంటి కాలనీలలో రోడ్లు వేయాలని, రోడ్లపై ఖాళీ స్థలాలలో అక్రమంగా పుట్టుకొస్తున్న వ్యాపార సముదాయాలను అరికట్టాలని, అలాగే అక్రమంగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు కట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ స్పందిస్తూ తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కంటేస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, సీనియర్ నాయకులు వసంత్ కుమార్ యాదవ్, రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి నిరంతర కృషి : మైనంపల్లి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి డివిజన్ పరిధిలోని సాయినాథ్ పురం ఆఫీసర్స్ కాలనీలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మైనంపల్లి హనుమంతరావు మాకు షెడ్డు వేయడానికి సహకరించి పార్కు అభివృద్ధికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపినారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. శాసన సభ ఎన్నికల్లో తాను ఓడిపోయి నందుకు బాధలేదని, జి.హెచ్.ఎం.సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించే విధంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, ఫెడరేషన్ అధ్యక్షుడు చుంకు శ్రీనివాస్, లోహిత్ రెడ్డి, వేంకటేశ్వర రావు, వంశీ మోహన్, శ్రీనివాస్, సలీం, ఫారుక్, లోకనాథం, మిర్యాల రామచందర్, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా సీవరేజ్ కనెక్షన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ఓ రెస్టారెంట్ సీవరేజ్ కనెక్షన్ ను అధికారులు తొలగించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-3 పరిధి మెహిదీపట్నంలోని కింగ్స్ రెస్టారెంట్ యజమానులు.. అనుమతి లేకుండానే 250 ఎంఎం దయా సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్ తీసుకున్నారు. దీంతో పాటు ఆ రెస్టారెంట్ నుంచి వచ్చే అధిక సీవరేజ్ వల్ల మెయిన్ రోడ్ పై తరచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో అయ్యేది. ఇటీవల ఎండీ అశోక్ రెడ్డి అక్కడ పర్యటించిన సమయంలో ఈ విషయం బయటపడటంతో కనెక్షన్ కట్ చేయాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. దీంతో ఆ రెస్టారెంట్ సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్ తొలగించారు. అక్రమంగా నల్లా, సీవరేజ్ కనెక్షన్లు కలిగి ఉన్న వాళ్లు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి వినియోగదారుల్ని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆసుపత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్, తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు తప్పని సరిగా సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని పునరుద్ఘాటించారు. జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లు తీసుకుంటే.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నల్లా, సీవరేజ్ కనెక్షన్లు గుర్తిస్తే జలమండలి విజిలెన్స్ బృందానికి 9989998100, 9989987135 నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

రవాణాశాఖ ఆదాయ లక్ష్యాలను సాధించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది సమీపిస్తుండటంతో ఆదాయాన్ని పెంచుకోవడానికి నిర్దేశించిన లక్ష్యాన్ని ఎంత వరకు చేరుకున్నామని స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో కలిసి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. పలువురు అధికారుల పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా ఆదాయ అన్వేషణ చేయాలని సూచించారు. వచ్చే కొద్ది రోజుల్లో రెవెన్యూ పెంచుకున్న నివేదిక కనిపించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 62 రవాణా శాఖ కార్యాలయాల్లో ఉద్యోగుల పనితీరు, కార్యాలయాలకు అవసరమైన కొత్త భవనాలు, మౌలిక సదుపాయాలు, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల వినియోగం తదితర అవసరాలపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు సేఫ్టీపై స్కూల్లు కాలేజీలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి స్కూల్‌లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు చేయాలని, కొత్తగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లో కూడా ఇది తప్పనిసరి ఉండేలా విద్యాశాఖతో మాట్లాడాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం యునిసెఫ్ సహకారం తీసుకోవాలని ఇటీవల ఒక స్వచ్ఛంద సంస్థ లైసెన్స్ పొందే ముందు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్న వారికి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రవాణా శాఖలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రమోషన్లు పూర్తి చేయాలని అందుకు సంబంధించి నివేదిక తయారు చేయాలని సూచించారు. కింది స్థాయి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నుండి జేటీసీ వరకు ప్రమోషన్లు పూర్తి చేయాలన్నారు. ప్రమోషన్లు పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్కూల్ బస్సులపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. 15 సంవత్సరాలు దాటిన స్కూల్ బస్సులను సీజ్ చేయాలని ఆదేశించారు. స్కూల్ బస్సుల తనిఖీల్లో భాగంగా ఫిట్నెస్, ఇన్సూరెన్స్, ఆర్సి అన్నిటినీ చెక్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 వేల స్కూల్ బస్సులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్కూల్ బస్సుల తనిఖీల్లో భాగంగా స్కూల్ టైమింగ్స్‌లో విద్యార్థులు బస్సుల్లో ఉన్నప్పుడు కానీ తనిఖీలు చేయరాదని అధికారులకు సూచించారు. 15 సంవత్సరాలు దాటిన ప్రైవేట్ వాహనాలు గ్రీన్ టాక్స్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈవి పాలసీపై మంచి నిర్ణయం తీసుకున్నందుకు ఈవి కంపెనీలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ని అభినందించారు. దేశ వ్యాప్తంగా ఎక్కడ లేనివిధంగా కాలుష్యాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం ఈవి పాలసీపై విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని దీనిపై ప్రతి ఎలక్ట్రిక్ వాహనాల షో రూంల వద్ద ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిఎస్ఆర్ ఫండ్స్‌తో స్కూల్‌లలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని ఈవి కంపెనీల ప్రతినిధులు కోరారు. ఆటోమాటిక్ టెస్టింగ్ స్టేషన్స్, టెస్టింగ్ ట్రాకింగ్, డ్రైవింగ్ టెస్టింగ్, వెహికిల్ ట్రాకింగ్‌పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లను ఎన్ఫోర్స్మెంట్‌లో ఉపయోగించాలని వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. రవాణా శాఖకి ప్రత్యేక లోగో రాబోతుందని ప్రజా విజయోత్సవాల్లో దానిని పరిచయం చేయాలని సూచించారు. రవాణా శాఖ అధికారులకు ప్రత్యేక వాహనాలు రాబోతున్నాయని, దాంతో పాటు డేటా ఎంట్రీ కోసం టాబ్‌లు ఇస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న డ్రైవింగ్ స్కూల్‌లు ఎన్ని వాటి పనితీరు తదితర వాటిపై ఎన్ఫోర్స్మెంట్ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రవాణా శాఖ ప్రత్యేక శాఖ కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటిసి రమేష్ ,మమత ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కులవృత్తుల సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కులవృత్తుల, కుల సంఘాల, ఇబ్బందులు, సమస్యలు సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శనివారం హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హల్‌లో తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారి స్థితిగతుల అధ్యయనంలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో కమిషన్ కుల సంఘాలు, కులవృత్తుల వారి నుండి అర్జీలు స్వీకరించింది. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ జిల్లాలోని వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపారమైన స్థితిగతులు, వారికీ కావాల్సిన అవకాశలు, తదితర అంశాలపై జిల్లాల వారీగా బహిరంగ విచారణ చేపట్టామని అన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి 9 జిల్లాలోని బిసిల స్థితిగతులపై కమిషన్ బహిరంగ విచారణ చేపట్టిందని చివరిగా శనివారం హైదరాబాద్ జిల్లాలో బహిరంగ విచారణ చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతగా చివరిదశకు చేరుకుందని ఇప్పటివరకు 90 శాతం పైగా సర్వే జరిగిందని స్పష్టం చేసారు. హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో 70 శాతం కు పైగా సర్వే జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సర్వేలో ప్రజలు చురుకుగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో నోడల్ అధికారిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కీలక పాత్ర పోషించారని రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ప్రక్రియ పారదర్శకంగా చివరి దశకు చేరుకుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికై సామజికంగా, విద్యాపరంగా అలాగే వారి వృత్తులు, స్థితి గతులు అధ్యాయనంకై రాష్ట్ర ప్రభుత్వం బిసి కమిషన్ ఏర్పాటు చేసిందని అలాగే రాజ్యాంగంలో ఆర్టికల్ 3 ప్రకారం బిసిల అభివృద్ధితో పాటు మెరుగైన పాలన జరుగుతుందని అన్నారు. బీసీల స్థితిగతులు తెలుసుకునేందుకు మేధావులు, మేధావులు, ఎన్జీవోలు, కుల సంఘాలు, ప్రజలతో బహిరంగ విచారణ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి రంగు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక అధికారి సతీష్, బిసి సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరామ్, వసతి గృహాల అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థులకు గుణత్మకమైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదిశగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంక్షేమ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ, గురుకులాల అధికారులు, ప్రత్యేక అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, అలాగే విద్యా ప్రమాణలు పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 164 ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీ వసతి గృహాలను సందర్శించి వసతి గృహాలలోని స్టోర్ రూమ్, భోజనం, వంట పాత్రలు శుభ్రంగా ఉన్నాయా, వంట సరిగా చేస్తున్నారా, కామటి, కుక్, వాచ్మెన్ పాత్రలను పరిశుభ్రంగా ఉంచుతున్నారా లేదా, విద్యా బోధన సరిగా ఉందా లేదా అని వసతి గృహాల వారి పనితీరును తనిఖీ చేసి అట్టి ఫోటోలను నివేదికలను రెండు రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. వసతి గృహాలను తనిఖీ చేసేందుకు 82 మంది ప్రత్యేక అధికారులు నియమించడం జరిగిందని ఒక్కొక్కరు రెండు ఇన్స్టిట్యూషన్ లను తనిఖీ చేయాలన్నారు. వారు సంక్షేమ హాస్టల్స్‌తో పాటు స్టోర్స్‌లో స్టాక్, స్టాక్ రిజిస్టర్, రోజువారీ నిర్వహణ రిజిస్టర్లు పరిశీలన చేయాలని తదుపరి నివేదిక అందించాలని తనిఖీల సమయంలో పిల్లలతో భోజనాలు చేయాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జిల్లా సంక్షేమ అధికారులు పెరిక యాదయ్య, కోటాజి, ఇలియాజ్ అహ్మద్, ఆర్.డి.ఓలు, తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పదిరోజులకో పసిబిడ్డ ప్రాణం పోతుంది

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదిరోజులకో పసిబిడ్డ ప్రాణం పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పసి బిడ్డల ప్రాణాలను ప్రాధాన్యతగల అంశంగా స్వీకరించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఏ ఒక్క పాఠశాలను చూసినా ఏదో ఒక సంఘటన జరిగిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల వ్యవస్థ ధ్వంసమైన పరిస్థితి కనిపిస్తోందని స్పష్టం చేశారు. మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండడం చాలా బాధాకరమని అన్నారు. శైలజ ఇంకా కూడా వెంటిలెటర్ పై ఉన్నట్లు తెలియజేశారు. పసిబిడ్డల ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టనట్టు ఉండడం సరికాదని సూచించారు. "ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతుంది, సగటున నెలకు ముగ్గురు చొప్పున ఇప్పటి వరకు 42 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బిడ్డలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆహారం విషతుల్యమయ్యి మరణించారు. సగటున పదిరోజులకు ఒక పసి ప్రాణాన్ని ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈనెల 30న డైట్ కళాశాల భవనానికి శంకుస్థాపన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శనివారం మహబూబ్ నగర్ పట్టణంలోని డైట్, బిఇడి కళాశాల ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఇడి చదివే విద్యార్థులు తాగునీరు లేదని, టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే విద్యార్థులకు టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని, అక్కడే ఉన్న కాంట్రాక్టర్‌ని పిలిచి వెంటనే విద్యార్థులకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నెలకొల్పిన డైట్ కళాశాల ఉమ్మడి రాష్ట్రంలో సైతం అత్యున్నతమైన కళాశాలగా పేరు తెచ్చుకుందని, ఇక్కడ కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 30వ తేదీ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ మెరజుల్లా ఖాన్, బిఇడి కళాశాల ప్రిన్సిపాల్ గోవింద రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్ తిరుమల వెంకటేష్, జిల్లా మత్సకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, ఫయాస్, గుండా మనోహర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

డిసెంబర్ 8 నుండి 16 వరకు అగ్నివీర్‌ల రిక్రూట్‌మెంట్ ర్యాలీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ లోని జిఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియం గచ్చిబౌలి, రంగా రెడ్డి, తెలంగాణలో అగ్నివీరులుగా చేర్చుకొవడానికి భారతీయ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ 08 డిసెంబర్ నుండి 16 డిసెంబర్ 2024 వరకు నిర్వహించనున్నారు. తెలంగాణలోని 33 జిల్లాల నుండి సైన్యంలోకి అభ్యర్థులను అగ్నివీరులుగా చేర్చుకొవడానికి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ 08 డిసెంబర్ 2024 నుండి 16 డిసెంబర్ 2024 వరకు బాలయోగి అథ్లెటిక్ స్టేడియం రంగారెడ్డి జిల్లాలోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించబడుతుంది. తెలంగాణలోని 33 జిల్లాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్ నగర్, మెదక్, మంచిర్యాల, మేడ్చల్-మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్ మరియు యాదాద్రి భువనగిరి అభ్యర్థులకు అగ్నివీర్ జనరల్ డూటి, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ 10వ తరగతి ఉత్తీర్ణత, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ 8వ తరగతి ఉత్తీర్ణత కేటగిరీలకు ర్యాలీ నిర్వహించబడును. మహిళా మిలిటరీ పోలీస్ అభ్యర్థులకు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కేంద్ర పాలిత ప్రాంతము పుదుచ్చెరి (కరైకల్ %-% యానాం) నుండి మహిళా మిలిటరీ పోలీస్ అభ్యర్థులు, ఫిబ్రవరి 12, 2024 నాటి ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం ర్యాలీ సైట్ కి అన్ని డాక్యుమెంట్ లను తీసుకురావాల్సి ఉంటుంది. ఎవరైనా ఉత్తర్ణత సాధించడానికి లెదా నమోదు చేసుకోవడానికి సహాయం చేయగలమని క్లెయిమ్ చేసే మోసపూరిత ట్వీట్ లు / మోసగాళ్ల నుండి అభ్యర్తులు జాగ్రత్త వహించాలి. రిక్రూట్ మెంట్ కార్యాలయం (టెలి నంబర్ 040-27740059, 27740205) నుండి అన్ని రిక్రూట్ మెంట్ సంబంధిత సందేహాలను స్పష్టం చేయవచ్చని తెలియజేశారు.

వాహనదారులకు అందుబాటులో పాపి రెడ్డి కాలనీ అండర్ బ్రిడ్జి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ లోగల పాపిరెడ్డి కాలనీ, తదితర కాలనీల నుండి చందానగర్ వైపు వెళ్లే చందానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నెలకొన్న సమస్యను ఎట్టకేలకు పరిష్కరించారు. శేరిలింగంపల్లి కార్పోరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాహనదారులకు ఉపయోగపడేలా అండర్ బ్రిడ్జ్‌ను అందుబాటులో ఉండే విధంగా తీసుకొచ్చారు. అందులో భాగంగా అండర్ బ్రిడ్జి వద్ద సిపేజ్ వల్ల వచ్చిన నీటిని తొలగించిన పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఏఈ భాస్కర్‌తో పాటు తదితర కాలనీవాసులతో కలిసి నాగేందర్ పర్యవేక్షించారు. ఈ సమస్యను మరల తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తానని నాగేందర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు దుర్గం వీరేశం గౌడ్, పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, వార్డ్ మెంబర్ రాంబాబు, వార్డ్ మెంబర్ శ్రీకళ, కే.లింగారెడ్డి, సందయ్య నగర్ కాలనీ ప్రెసిడెంట్ బసవరాజ్, రమేష్, ప్రభాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కుమారి, సుధారాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

27న మార్కెట్ కమిటీ నూతన ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, తదితర డైరెక్టర్లు స్పష్టం చేశారు. షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తమ నాయకుడు వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే అయ్యారని, ఎమ్మెల్యే ఆశీస్సులతో తాము మార్కెట్ కమిటీ పాలకవర్గంలో నియమితులమయ్యామని అన్నారు.తమపై పెట్టిన గురుదరమైన బాధ్యతను సక్రమంగా నెరవేర్చేందుకు రాత్రింబవళ్లు కృషి చేస్తామని అన్నారు. షాద్ నగర్ మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం తమ వంతు పాత్ర పోషిస్తామని అన్నారు. గత పది ఏళ్లలో రైతులను టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని గుర్తు చేశారు. రుణమాఫీ ఒక లక్ష రూపాయలు ఇస్తామని ఇవ్వలేదని కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక మాత్రం రెండు లక్షల రుణమాఫీ జరుగుతోందని అన్నారు. ఈనెల 27న మార్కెట్ కమిటీ యార్డులో పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. అదేవిధంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొత్త రవి, ఏ బాల శౌరి రెడ్డి, చాకలి నరసింహులు, జానంపేట సురేష్, సి. వెంకట నరసింహారెడ్డి, చిత్రగారి మల్లయ్య, పంది వెంకటరెడ్డి, లాహెూటి భరత్, కక్కునూరు సందీప్ కుమార్, తాడిశెట్టి నవీన్ కుమార్ లతో పాటు సీనియర్ నేత కృష్ణారెడ్డి, పి రఘు, పురుషోత్తం రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం పాల్గొన్నారు.

అభివృద్ధికి ఐక్యమత్యంతో కృషి చేయాలి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-దుండిగల్: అసోసియేషన్ అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి. పోచంపల్లిలోని సురక్ష గ్రీన్ మెడోస్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శనివారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ శంభిపూర్ రాజని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురక్ష గ్రీన్ మెడోస్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులు వేణు గౌడ్, జనరల్ సెక్రెటరీ శ్రీరాములు, ఉప అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, సాంబశివ రావు, అమర్నాథ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వసతి గృహంలోని పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదురుశెట్టి వార్డెన్ ను ఆదేశించారు. శనివారం సాయంత్రం మల్లెపల్లి ప్రభుత్వ మైనార్టీ పోస్ట్ మెట్రిక్ గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని పరిసరాలను, వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలోని పిల్లలకు ఎలాంటి ఆరోగ్యకర సమస్యలను ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, శీతాకాలంలో పిల్లలకు జలుబు, జ్వరాలు రాకుండా చూడాలని వార్డెన్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి. రవి, హాస్టల్ వార్డెన్ అంకుష్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బాబా 99వ జన్మదినం సందర్బంగా బ్లాంకెట్లు పంపిణీ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సత్య సాయి బాబా 99వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజ్గిరి లోని సామాజిక కార్యకర్త ఏ.వి స్వామి ఆధ్వర్యంలో దివ్యంగులకు బ్లాంకెట్లు, పండ్ల పంపిణీ చేపట్టారు. మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద వికలాంగుల పోరాట హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు వినయ్ సమక్షంలో పలువురు దివ్యంగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏ.వి.స్వామి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా పని చేసినట్లయితే మానసికోల్లాసం కలిగి ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, ప్రతి ఒక్కరు సేవా మార్గాన్ని ఉంచుకోవాలని మనకున్న దాంట్లో సేవ చేసినట్లయితే సంతృప్తి కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వనజ, దుర్గా ప్రసాద్, కనక దుర్గ, ప్రసన్న, గణేష్ కుమార్ నాయక్ లతో పటు పలువురు దివ్యంగులు పాల్గొన్నారు.

మత కల్లోలాలు సృష్టించేందుకు కుట్ర

విశాలాంధ్ర -షాద్ నగర్,రూరల్: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు తరుచూ జరుగుతున్నాయని, కొందరు దుండగులు విగ్రహాలను ధ్వంసం చేసి వికృతానందం పొందుతున్నారని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని జానంపేట వివేకానంద కాలనీలో గల పురాతన శివాలయంలో శివలింగం అపహరణ, ఇతర విగ్రహాల ధ్వంసం ఘటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఆలయాన్ని పరిశీలించిన డీకే అరుణ స్థానికులను జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. గణపతి, నంది విగ్రహాలను చెల్లా చెదురుగా పడేశారని, ఆలయంలో ఉన్న శివలింగం మాయం చేశారని అన్నారు. దేవాలయాలపై కుట్రపూరితంగా దాడులకు దిగుతూ వికృతానందం పొందుతున్నారని ఆవేదన చెందారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలు, శివలింగాలు, గ్రామదేవతల విగ్రహాలు ధ్వంసం చేయడం సబబు కాదని అన్నారు. పోలీస్ శాఖ వెంటనే గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, చెట్ల వెంకటేష్, ఎంకనోళ్ళ వెంకటేష్, కాసోజు శివ, ఆకుల ప్రదీప్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ప్రపంచంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య అతిథి ఎల్టీఐ మైండ్ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది తెలిపారు. విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (వీజేఐఎం) 30వ స్నాతకోత్సవాన్ని బాచుపల్లి క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు సర్వం అందుబాటులో ఉన్నట్లు చెప్పాలని ఉందన్నారు. కానీ, నిజాయితీగా చెప్పాలంటే అత్యంత అనిశ్చిత కాలంలో ఉన్నామన్నారు. భౌగోళిక, వాతావరణ, జనాభా, శక్తి సంక్షోభంలో ఉన్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మార్పులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రతి సంక్షోభం ఒక ప్రమాదాన్ని, ఒక అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. దీని కోసం పోరాడాల్సి ఉంటుందన్నారు. విజ్ఞాన జ్యోతి వైస్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అగ్రశ్రేణి ప్రైవేట్ బిజినెస్ స్కూల్‌లలో వీజేఐఎం ఒకటిగా ఉందన్నారు. వీజేఐఎం మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులలో కూడా అత్యంత డిమాండ్ ఉన్న వ్యాపార పాఠశాలల్లో ఒకటిగా మారాలని కోరుకుంటు న్నానన్నారు. 2024లో వ్యాపారం, పరిశ్రమలు, నిర్వహణ విద్య ల్యాండ్‌స్కేప్‌ను రూపొందించే ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడం అత్యవసరమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అత్యంత వేగంగా విస్తరిస్తుందన్నారు.

అయ్యప్పస్వామి భక్తులకు ముస్లిం అన్నదానం

విశాలాంధ్ర - మొయినాబాద్ : మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో 41 రోజుల పాటు మండలకాలం దీక్షలో ఉన్న అయ్యప్పస్వామి భక్తులకు అదే గ్రామానికి చెందిన ముస్లీం వ్యక్తి మహ్మద్ అలీ బిక్షను (అన్నదానం) శనివారం ఏర్పాటు చేశాడు. హిమాయత్ నగర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి సన్నిదానం స్వాములకు అన్నదానం ఏర్పాటు చేసి ఆయన మతసామరస్యాన్ని చాటి చెప్పాడు. వారి పక్కనే కూర్చొని భోజనం చేశారు. ప్రతి ఏడాది అయ్యప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని.. భగవంతుని ఆశీర్వాదంతోనే తాను కొద్దిపాటి సహాయం చేస్తున్నానని చెప్పారు. తనకు సహకరిస్తున్న అయ్యప్ప భక్తులకు ధన్యవాదము లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నిదానం గురుస్వామి మురళి గురుస్వామితో పాటు సన్నిదానం స్వాములు ఉన్నారు.

విజయోత్సవాల్లో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలంగాణ గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేలకు లేఖలు రాశారు. ఈ నెల 26న గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అధికార, విపక్ష ఎమ్మెల్యేలు అన్న తారతమ్యం లేకుండా అందరికి ప్రత్యేకంగా లేఖలు పంపారు. తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలను అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్నారు. ఈ పనుల్లో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క ప్రత్యేకంగా లేఖలు రాశారు. తెలంగాణలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా అందులో 95 గ్రామీణ నియోజకవర్గాలున్నాయి. రూ.1372 కోట్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు, రూ.1378 కోట్ల సీఆర్ఆర్ నిధులు.. వెరసి మొత్తం రూ. 2750 కోట్లు నిధులతో గ్రామాల్లో పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈ పనుల్లో ఎమ్మెల్యేలంతా పాల్గొనాలని సీతక్క తన లేఖలో పేర్కొన్నారు. ఈ పనులను నవంబర్ లో 26న ప్రారంభించి ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేసే లక్ష్యంతో పనులు వేగవంతం చేయనున్నారు. ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా (పశువుల పాకలు, కాంపోస్ట్ గుంతలు, కోళ్ళ ఫారాలు), పొలం బాటలు (వ్యవసాయ పొలాలకు బాటలు), నర్సరీలు, జలనిధి (చెక్ డ్యామ్లు, కుంటలు), గ్రామీణ మౌళిక వసతులు (సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు), గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

మేడిపల్లి-పర్వతాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి - పర్వతాపూర్ ప్రధాన రహదారి వరద నీటి కారణంగా గుంతలు పడి గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారం కోసం 2వ డివిజన్ కార్పొరేటర్ సుభాష్‌నాయక్, 15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ చేస్తున్న కృషి నేడు ఫలించింది. సమగ్ర కుటుంబ సర్వే కారణంగా పనుల్లో జాప్యం జరిగిన ఎట్టకేలకు శనివారం గ్రీన్ ల్యాండ్ కాలనీ కమాన్ నుండి పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 2 వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ సహకారంతో రెండో డివిజన్ ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నాను అని, డివిజన్ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నామని, కొందరు అత్యుత్సాహంతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వారికి ఈ రోడ్డు పనులు చెంప పెట్టుల బుద్ధి చెప్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి రవీందర్, జయేందర్, బలరాం, గ్రీన్ ల్యాండ్ కాలనీ అధ్యక్షులు ఆర్ పాపయ్య, సుకురు, సౌత్ పంచవటి కాలనీ అధ్యక్షులు నరసింహారావు, నాగేశ్వరరావు, పంచవటి కాలనీ మాజీ అధ్యక్షులు వరికుల శ్రీనివాస్, వివిధ కాలనీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లు అమలు చేయకుండా మోదీ కుట్ర

విశాలాంధ్ర - హైదరాబాద్ : అనేక కుంటిసాకులతో 'మహిళా రిజర్వేషన్'ను అమలు చేయకుండా ప్రధాని మోదీ ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ఇంకెంత కాలం వేచిచూడాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని వారు నిలదీశారు. దేశవ్యాప్త జనగణన నియోజకవర్గాల పునర్ విభజనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 22వ నిర్మాణ జాతీయ మహాసభల సందర్భంగా "తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో "మహిళా రిజర్వేషన్ చట్టం -2023"ను జనాభా లెక్కలు, నియోజకవర్గ పునర్విభజనకు సంబంధం లేకుండా వెంటనే అమలు చేయాలి" అనే అంశంపై రాష్ట్ర సదస్సు శనివారం హైదరాబాద్ బషీర్ బాగ్ దేశోద్ధారకభవన్ జరిగింది. తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అధ్యక్షతన జరిగిన సదస్సును భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.రజని ప్రారంభించగా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకులు పశ్యపద్మ, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి తదితరులు ప్రసంగించారు. ఎటువంటి షరతులు లేకుండా 2029 ఎన్నికల్లో 'మహిళా రిజర్వేషన్' అమలయ్యే విధంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని, ఆ దిశగా క్షేత్రసాయి నుంచి మహిళల లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

జనగణన ఎప్పుడు పూర్తవ్వాలి ? : పశ్యపద్మ

మహిళా రిజర్వేషన్ల బిల్లు రానున్న 2029 ఎన్నికల్లో అమలయ్యే విధంగా మహిళలంతా దృష్టి కేంద్రీకరించాలని ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ సీనియర్ నాయకులు పశ్యపద్మ అన్నారు. దేశంలో జనగణన ఎప్పుడు జరగాలి, ఆ ప్రక్రియ ఎప్పుడు పూర్తవ్వాలి?, ఆ తర్వాత ఇంకెప్పుడు మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తారు ? అని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కులగణన జరిగే వరకు రిజర్వేషన్లను అమలు చేయకుండా బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు. బంగ్లాదేశ్ 20 శాతం, పాకిస్తాన్ 21 శాతం, క్యూబాలో 53 శాతం మంది మహిళలు పార్లమెంట్ ఉన్నారని, కానీ భారతదేశంలో మాత్రం ప్రస్తుతం కేవలం 13.63 శాతం మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్.ఛాయాదేవి మహిళా రిజర్వేషన్ ల బిల్లు ను చట్టం చేసి వెంటనే అమలు చేయకుంటే దేశ జనాభాలో సగభాగమైన మహిళలు పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.నళినిరెడ్డి, బండి జంగమ్మ, సహాయ కార్యదర్శులు ఫైమీద, లతాదేవి, కోశాధికారి జయలక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్లు సీనియర్ నాయకురాలు జ్యోష్యబట్ల కల్పన, కళావతి ప్రసంగించారు.

అసెంబ్లీలో చర్చించినా చర్యలు తీసుకోరా..?

విశాలాంధ్ర - హైదరాబాద్ : అసెంబ్లీలో మాట్లాడితే తమ సమస్యలు తీరిపోతాయని ప్రజలు నమ్ముతారని అయితే అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యలపై కూడా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఇక అసెంబ్లీ లో మాట్లాడి ప్రయోజనం ఏమిటని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తాను అసెంబ్లీలో చర్చించిన సమస్యలపై అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఈ విషయంగానే ఆయన శనివారం వినతిపత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు సమర్పించారు. తన నియోజవర్గంలోనీ ఉదండాపూర్ రిజర్వాయర్ కు సంబంధించిన భూ సేకరణలో భారీగా అక్రమాలు జరిగాయని, భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులో అవకతవకలు జరిగాయని తన దృష్టికి రావడంతో ఈ విషయం గురించి తాను అసెంబ్లీలో కూడా మాట్లాడి ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరానని చెప్పారు. అయితే ఈ వ్యవహారంలో అధికారులు ఇంతవరకు స్పందించలేదన్నారు. ఉదండపూర్ భూ సేకరణపై విచారణ చేయించాలని, ఇందులో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ ను కోరారు. అలాగే జడ్చర్ల ఫార్మా సెజ్‌లో ఉన్న అరబిందో ఫార్మా కంపెనీ విడుదల చేస్తున్న కలుషిత నీరు కారణంగా ముడిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెరువు పూర్తిగా కలుషితమై అందులో చేపలు చచ్చి పోతున్నాయని, పంటలు పండడం లేదని, ప్రజలు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నారని తాను అసెంబ్లీలో ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీలో తాము లేవనెత్తిన సమస్యలను పరిష్కరించకుండా, తాము వేసిన ప్రశ్నలకు సమాధానాలు కూడా రాకపోతే ఇక అసెంబ్లీ లో మాట్లాడి ప్రయోజనం ఏముందనే భావన కలుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మెన్‌పై ప్రివిలేజ్ మోషన్ పెట్టాలని అనిరుధ్ రెడ్డి స్పీకర్ ను కోరారు. పోలీస్ రిక్రూట్మెంట్ విషయంగా హై కోర్టు గత ఏప్రిల్ 29న ఉత్తర్వులు జారీ చేసిందని అయితే దీనిని పూర్తిగా విస్మరించి నియామక ప్రక్రియ చేపడుతుండడంతో ఈ విషయం గురించి మాట్లాడడానికి తాను చైర్మెన్‌కు అనేక సార్లు ఫోన్ చేసినా ఆయన తన ఫోన్ తీయలేదు అని చెప్పారు. ఒక ప్రజా ప్రతినిధిగా తాను తన దృష్టికి వచ్చిన విషయాన్ని ఆయనకు చెప్పాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. అందుకే బోర్డు చైర్మెన్ పై ప్రివిలేజ్ మోషన్ పెట్టాలని అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేశారు.

శ్రీఅన్నపూర్ణ పొలాల్లో మెగా ఫీల్డ్ విజిట్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఎకరానికి అధిక బస్తాల వరకు దిగుబడి అగ్గి తెగులు, దోమల బెడద ఉండదు బలమైన కాండం, గాలి, వర్షం వచ్చినా పడిపోని పైరు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సాగు చేసేందుకు అనుకూలం రైతులతో పాటు మిల్లర్లకు కూడా లాభదాయకం నూజివీడు సీడ్స్ లిమిటెడ్ కొత్తగా మార్కెట్‌లోకి తీసుకొచ్చిన ఎన్ పి- 7373 శ్రీఅన్నపూర్ణ వరి విత్తనం నాన్-లాడ్జింగ్ సూపర్ ఫైన్ రైస్ రకం. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో దీనిని సాగు చేయవచ్చు. ఇతర రకాలతో పోలిస్తే, ఇది అగ్గి తెగులును అధికంగా నిరోధిస్తుంది. ఇతర వ్యాధులను కూడా బలంగా తట్టుకుంటుంది. 138 - 140 రోజుల మధ్య కాల వ్యవధిలో దిగుబడికి వస్తుంది. నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సగర్వంగా పరిచయం చేసిన ఎన్ పి- 7373 ఎన్ ఎస్ ఎల్ శ్రీఅన్నపూర్ణ వరి విత్తనాలకు తెలంగాణ రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఎన్ పి- 7373 ఎన్ ఎస్ ఎల్ శ్రీఅన్నపూర్ణ వరి విత్తనాలతో ఎకరానికి అధిక బస్తాల వరకు దిగుబడి తీస్తానని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ మండలం వెంకటరావుపేట్ గ్రామానికి చెందిన రైతు బొప్పు బాపన్న చెప్పారు. తనకు తెలిసిన రైతులు ఎకరానికి 48 బస్తాల వరకు దిగుబడి తీశారన్నారు. నాట్లు వేసిన దగ్గర్నుంచి పైరును నిశితంగా గమనిస్తున్నానని, ఎలాంటి తెగులు, దోమల బెడద లేదని వెల్లడించారు. నూజివీడు సీడ్స్ లిమిటెడ్, తన కొత్త రకం వరి విత్తనం ఎన్ పి- 7373 ఎన్ ఎస్ ఎల్ శ్రీఅన్నపూర్ణ ను బాపన్న చేత ప్రయోగాత్మకంగా సాగు చేయించింది. ఈ విత్తనాన్ని చాలా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేసి పరిశీలించి అత్యధిక దిగుబడిని సాధించమన్నారు. వర్షం, తీవ్ర గాలి వచ్చినా ఈ పైరు పడిపోదని, కాండం చాలా బలంగా ఉంటుందని వెల్లడించారు. నూజివీడు సీడ్స్ అనేది విత్తనాలు అమ్మి చేతులు దులుపుకుని వెళ్లే కంపెనీ కాదని, పంటను మార్కెట్‌కు తరలించేవరకు వివిధ రకాల సేవలు కూడా అందిస్తుందని అన్నారు. నూజివీడు సీడ్స్ ఏరియా మేనేజర్ రాజా బాబు, మార్కెటింగ్ ఆఫీసర్ రాజేష్, మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు వేణుగోపాల్, శిరీష్, ఇతర మార్కెటింగ్ సిబ్బంది, విత్తన పంపిణీదార్లు డిస్ట్రిబ్యూటర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదు పరిశీలన

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సంగారెడ్డి కలెక్టరేట్లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఓటర్ నమోదు, ఎమ్మెల్సీ ఓటర్ నమోదు వివరాలు ఎన్నికల కమిషనర్‌కు తెలిపిన కలెక్టర్ క్రాంతి వల్లూరు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి శనివారం జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెనింగ్‌లను జిల్లాలోని సంగారెడ్డి, ఆందోల్ నియోజకవర్గాలలో పర్యటించారు. సంగారెడ్డి, అందోల్ ఆర్డిఓ కార్యాలయాలలో నూతన ఓటరు పరిశీలించారు. ఆన్లైన్ వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సంగారెడ్డి తార డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బిఎల్ఓలతో మాట్లాడి ఫారం 6, 7, 8 ఆన్లైన్, సాధారణ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. జిల్లాలో ఎస్ ఎస్ ఆర్ 2025 ఓటరు నమోదు వివరాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు వివరాలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు జిల్లాలోని ఆర్డీవోలు పాల్గొన్నారు.

ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-దుండిగల్ : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చెరవేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి హల్ కాలనీ నందు సిటీ ప్యాలెస్ లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ హన్మంత్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కంటెస్టెడ్ కార్పోరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిఆర్ లక్ష్మి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరు ప్రభాకర్ రెడ్డి, ఐ ఎన్ టీ యు సి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, జి ఐలయ్య గౌడ్, సిహెచ్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజి కార్పొరేటర్ పాలకృష్ణ, ఎక్స్ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, మోతే శ్రీనివాస్ యాదవ్, జయరాం, ఓరుగంటి కృష్ణ గౌడ్, రషీద్ భాయ్, మధు విజయ గుప్తా, తోఫిక్ జహంగీర్, డాన్ శీను, గంగారం,శంకర్ బలరాం, గుబ్బల రమణ, శ్రీనివాస్ రంగనాథ్,డివిజన్ అధ్యక్షులు నాయక్ పండరి, శ్రీధర్ రెడ్డి, రాధాకృష్ణ, శివకుమార్, గణేష్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యదేచ్ఛగా బిల్డర్ల అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మండలంలోని హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలో పిస్తా హౌస్ వెనకాల నగరానికి చెందిన ఒక బడా నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వి బడా నిర్మాణం చేపడుతున్నారు.వెంచర్ సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని కూడా కబ్జా చేసి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేబడుతున్నారు. వెంచర్ ప్లాట్ కొనుగోలు దారులకు సమాచారం లేకుండా స్థలాన్ని కబ్జా చేసి వెంచర్ యాజమాన్యం అమ్మకం చేశారని నిర్మాణధారుల చెబుతున్నారు. అనుమతులు లేకుండా ఇలాంటి భారీ నిర్మాణలు చెపట్టడం ఎంటన్ని ప్రశ్నిస్తే డిపిఓ, డిఎల్పీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శితో సహా అందరికి ముడుపులు ముట్టజెప్పానని అందుకే పనులు సవ్యంగా సాగుతున్నాయని బాహాటంగా చెబుతున్నారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేసినంత ముట్టజెప్పానని నిర్మాణధారులు తెలిపారు. ఇలా హైదరాబాద్-బీజాపూర్ రహదారిని అనుకోని రోడ్డుపక్కనే నిర్మాణధారులు జీఓ111 విస్మరిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడితే, దానికి అధికారులు అందినంత దండుకొని చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు కోడైకూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆ నిర్మాణాలు ఆపాలని, ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

సత్యసాయి బాబా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గాంధీ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో గల భగవాన్ శ్రీ సత్య సాయి మందిర ప్రాంగణం నందు శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 99 వ జన్మదినం సందర్భంగా జరిగిన మహా నారాయణ సేవ కార్యక్రమంల కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ట్రస్ట్ సభ్యులు, నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, గంగాధర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: విద్యాలో రాణిస్తున్న 7వ తరగతి సాయికృష్ణకి లయన్స్ క్లబ్ ఆఫ్ హెూప్ చేయతనిందించి. ఫీజ్ కట్టలేక స్కూల్ వెళ్ళలేకపో యిన బాలుడి విషయం స్థానికంగా లయన్స్ క్లబ్ దృష్టికి రావడం తో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ బృందం సాయి కృష్ణ రూ 20 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమములో క్లబ్ అధ్యక్షుడు బసి రెడ్డి మధుసూదన్ రెడ్డి, ట్రెజరర్ ప్రవీణ్ రెడ్డి, బర్ల మల్లేష్ యాదవ్, గుర్రం భాస్కర్, రవీందర్, విష్ణు, భగవాన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేయర్ అమర్‌సింగ్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర - మేడిపల్లి: చిన్న వయస్సులోనే రాజకీయాల్లో రంగప్రవేశం చేసిన అమర్ సింగ్ తనవంతు సామాజిక బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేస్తూ వచ్చారు. కార్పొరేటర్‌గా ఉన్న ఆయన అనతి కాలంలోనే పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇలా పలు రంగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ అద్భుత ధైర్య సాహసాలను కనబర్చారు. మేయర్‌గా బాధ్యతలను చేపట్టిన అనంతరం వేగంగా అభివృద్ధి కార్యమాలను చేపట్టారు. గత మూస పాలనకు స్వస్తి పలికి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇలాంటి సమయంలో గౌరవ మేయర్ అమర్ సింగ్ సామాజిక సేవలను గుర్తిస్తూ సికింద్రాబాద్‌లోని హెచ్. ఎస్.సి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బిషప్ ఆనంద్ కుమార్, సలహాదారు డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పటాన్‌చెరు డివిజన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలలో అధికారులు నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని, నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని పటాన్ చేరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం పలు కాలనీలలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పాత మార్కెట్ వద్ద పోలీస్ స్టేషన్ నుండి గౌతమ్ నగర్ వరకు 2కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పరిశీలించడం జరిగింది. రోడ్డు నిర్మాణం మధ్యలో జంక్షన్ల వద్ద నీటి పైపులు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మత్తు పనులు నిర్వహించాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించడం జరిగింది. అనంతరం పటాన్ చెరువులోని బండ్లగూడ నేతాజీ నగర్ బాలాజీనగర్‌లో స్థానిక కాలనీవాసులతో చర్చించి కాలనీ లోని సమస్యలను తెలుసుకోవడం జరిగింది. పాత డ్రైనేజీ వ్యవస్థ పలు చోట్ల దెబ్బతిన్నందున మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీనివల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని జిహెచ్ఎంసి డీజీఎం శివకుమార్‌ను కలిసి నూతన డ్రైనేజీ లైను ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశామన్నారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన డి.జి.యం త్వరలోనే నిర్మిస్తామని చెప్పడం జరిగిందన్నారు.

జానయ్యను వరించిన డాక్టరేట్

విశాలాంధ్ర - మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామ పరిధిలోని మమత ఇంటర్నేషనల్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కవి, గాయకుడు ఆరెంపుల జానయ్యకు డాక్టరేట్ వరించింది. ఫ్రెం డ్షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జానయ్యకు డాక్టరేట్‌ను ఫ్రెండ్‌సిప్ మినిస్ట్రీస్‌కు చెందిన డాక్టర్లు మాణిక్యావు, విల్సన్లతో పాటు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గంగాధర్, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరెంట్ డాక్టర్ అంజనీ కుమార్లు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ జానయ్య ఇప్పటికే ఉపాధ్యాయునిగా, కవిగా, గాయకుడిగా సామాజానికి అనేక రకాలుగా సేవలు అందిస్తున్నారని వారు ఈ సందర్భంగా అభినందించారు. జానయ్య చేసిన పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడుతా యన్నారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ డాక్టరేట్ వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పరిశోధనలు చేయడం ద్వారా సామజంలో మరింత నైపుణ్యం పెంచుకోవచ్చని నిరుపించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, యాంకర్ రజిని సాహిత్యవేతలు, విద్యావంతులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: పాడి రైతులు తమ పశువులకు ఎలాంటి రోగాలు దరి చేరకుండా పశువైద్య అధికారుల సూచనలు పాటించాలని అమ్డాపూర్ విభాగం పశువైద్య అధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బాకారం జాగీర్ గ్రామంలో మండల పశువైద్య ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఆమె పాల్గొని పాడి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులు గుర్తించి వైద్య చికిత్సలు అందించినట్లు తెలిపారు. దూడలకు నట్టల నివారణకు మందులు ఇవ్వడం జరిగిందని 108 జీవాలు, పశువులకు సాధరణ పరీక్షలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పాడి రైతులు అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ పశు వైద్య అధికాని అహ్మద్, మొయినాబాద్ శివకుమార్, గోపాల మిత్రులు శ్రీను, బాలకృష్ణ, యాదయ్య, పాడి రైతుల జీవాల పెంపకందారులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేద కుటుంబానికి ఐక్యత ఫౌండేషన్ సేవలు

విశాలాంధ్ర - ఆమనగల్లు : కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఐక్యత ఫౌండేషన్ సేవలు, అంధత్వ సంపూర్ణ నిర్మూలనే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మెన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గత 5 రోజులుగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్లో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై వారి సహకారంతో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని శనివారం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. అనంతరం అయన మాట్లాడుతూ సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి మా ఐక్యత ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య సేవలను అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఉచిత కంటి శిబిరంలో 2500 మంది పేషంట్లకు కంటి పరీక్షలు నిర్వహించగా దాదాపు 1800 మందికి పైగా పేషంట్లు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటి వరకు కంటి శుక్లాల సర్జరీకి 100కి పైగా సెలెక్ట్ అయ్యారని, వీరందరికీ 27 వరకు ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ శిక్షణలో శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన పదిమంది కానిస్టేబుళ్లు శనివారం టాస్క్ సీఈఓ ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని ఆమనగల్లులో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర నాయకులు పోలీస్ చంద్రశేఖర్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, జైపాల్ రెడ్డి, నరేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, ఖాదర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్, మైసయ్య, మల్లేష్ నాయక్, కొండల్ రెడ్డి, అభినవ్ రెడ్డి, ఇమ్రాన్, కొండల్ యాదవ్, రమేష్ నాయక్, మల్లయ్య, రఘు, శేఖర్, యాదయ్య, శ్రీపతి, శ్రీను, నరేష్, మహేష్, కాకిశివ, భాస్కర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర'పై చర్చ అవశ్యం

- ఊహాలోకంలో తేలియాడటం సరికాదు
- అదానీపై చంద్రబాబు మౌనమేమిటి?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన స్వర్ణాంధ్ర భవిష్యత్ ప్రణాళిక-2047పై మేధావులు, ఆర్థికవేత్తలు, ప్రొఫెసర్లతో చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్‌పేట దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు అనుభవం గల ముఖ్యమంత్రి అని, కానీ ఆయన ప్రకటించిన ప్రణాళిక ఊహాలోకంలో తేలియాడేలా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం 3200 దాలర్లు ఉండగా... 2047 నాటికి అంటే 23 ఏళ్ల తరువాత 42 వేల డాలర్లుగా ఉంటుందని పేర్కొన్నారని, ఇదెలా సాధ్యమని సందేహం వ్యక్తం చేశారు. రూపాయి విలువ తగ్గుతుందని, డాలరు విలువ పెరుగుతుందని రామకృష్ణ గుర్తుచేశారు. ఇప్పుడు డాలరు విలువ 82 రూపాయలుగా ఉందని, ఈ విధంగా కొనసాగితే 2047 నాటికి ఒక డాలరుకు 200 రూపాయలు ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎగుమతులు 19.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని, అవి 450 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రక్క రాష్ట్రాల నుంచి కొని ఇక్కడ నుంచి ఎగుమతులు చేస్తారేమోనని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వంటి వ్యక్తులు సాధ్యం కాని వాటి గురించి చెప్పటం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో, దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని చెప్పారు. ఓ వైపు అంబానీ, అదానీలకు దేశ సంపద దోచిపెడుతూ... మరోవైపు పేద, ధనికవర్గాల మధ్య తారతమ్యాలు తగ్గిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే స్వర్ణాంధ్ర భవిష్యత్ ప్రణాళికపై చర్చించాలని, కనీసం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అయినా ఈ చర్చలు నిర్వహించాలని కోరారు.

ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన అదానీ అవినీతి వ్యవహారాల గురించి రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం మంచిది కాదని రామకృష్ణ హితవు పలికారు. అదానీ కంపెనీ రూ.2,100 కోట్లను నాలుగు రాష్ట్రాలకు ముడుపులుగా ఇచ్చినట్లు అమెరికా సంస్థ తెలిపిందన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,750 కోట్ల ముట్టజెప్పినట్లు స్పష్టం చేసిందని, పెద్దతల తప్ప ఇంత మొత్తాన్ని ఎవరూ తీసుకోలేరని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి అన్నారు. గుజరాత్‌లో ఎన్‌టీపీసీ నుంచి యూనిట్ విద్యుత్‌ను రూ.1.99 పైసలకు కొంటే... అదే విద్యుత్‌ను మన రాష్ట్ర ప్రభుత్వం సెకీ నుండి రూ.2.49 పైసలకు కొనుగోలు చేస్తున్నదన్నారు. ఈ విధంగా లక్ష కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ నాయకులు ఈ దోపిడీలో పాలుపంచుకున్నారని విమర్శించారు. ఇంతపెద్ద అవినీతి జరిగినా సీఎం చంద్రబాబు పరిశీలిస్తామంటున్నారని, అసెంబ్లీలో కనీసం అదానీ పేరు కూడా ప్రస్తావించలేక పోయారని ధ్వజమెత్తారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా వినియోగించుకునే చంద్రబాబు ఇంకా పరిశీలిస్తామనటం సరికాదన్నారు. గతంలో ఇదే అభియోగాలపై టీడీపీ తరపున పయ్యావుల కేశవ్, సీపీఐ తరపున తాను హైకోర్టులో పిటిషన్లు వేసినట్లు గుర్తు చేశారు. అదానీ కంపెనీలతో ఒప్పందాలు రద్దు చేసినట్లు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటిస్తే విశేష స్పందన వచ్చిందని చెబుతూ... ఆ వీడియోను మీడియాకు చూపించారు. అదేపని చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నారని నిలదీశారు. ఈ అంశాన్ని రాబోయే పార్లమెంటు సమావేశాల్లో సీపీఐ లేవనెత్తుతుందని, దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

సీఆర్‌టీలుగా ఔట్‌సోర్సింగ్ టీచర్లు

ముఖ్యమంత్రికి రామకృష్ణ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గిరిజన సంక్షేమ గురుకులంలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను సీఆర్టీలుగా (కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్) మార్పుచేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. 15 సంవత్సరాల నుంచి గిరిజన సంక్షేమ గురుకులంలో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు అతి తక్కువ జీతాలతో విధులు నిర్వహిస్తున్నారు. వీరు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో గిరిజన బిడ్డల అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తూ రెగ్యులర్ వారితో సమానంగా పనిచేస్తున్నారు. 2008వ సంవత్సరంలో వీరిని గెస్ట్ టీచర్స్ పేరుతో బోధకులుగా నియమించారు. 2012 సంవత్సరంలో గెస్ట్ టీచర్లను పార్ట్ టైం టీచర్లుగా మార్పు చేసి జీతాలు పెంచారు. 2017 సంవత్సరంలో పార్ట్ టైం టీచర్లుగా ఉన్న వీరిని ఔట్ సోర్సింగ్ టీచర్లుగా మార్పు చేశారు 2010 పీఆర్సీ ప్రకారం జీతాలు పెంచారు. 2016 సంవత్సరంలో ఎస్టీ హాస్టళ్లను గిరిజన గురుకులాలుగా విలీనం చేస్తూ మైదాన ప్రాంతంలో 8 జిల్లాల్లో 80 హాస్టళ్లను కన్వర్ట్ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేశారు. టీఈటీ అర్హత కలిగిన వీరిని రాత పరీక్ష, రోస్టర్ కం మెరిట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపిక చేశారు. 2020 సంవత్సరంలో కేజీబీవీ పాఠశాలల్లో (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ విధానంలోకి మార్పు చేశారు. 2022 సంవత్సరంలో మోడల్ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇతర సంక్షేమ గురుకులాలలో రెగ్యులర్, కాంట్రాక్టు వ్యవస్థలో మాత్రమే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. గత 8 సంవత్సరాలుగా వీరికి జీతాలు పెంచలేదు. అందువల్ల గిరిజన సంక్షేమ గురుకులంలో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పని చేస్తున్న 1,143 మందికి డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని, వీరిని ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేసి, 2022 పీఆర్సీ ప్రకారం జీతభత్యాలు చెల్లించేందుకు తగు చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.

దహానులో ఎగిరిన ఎర్ర జెండా

సీపీఎం అభ్యర్థి వినోద్ నికోలే గెలుపు

పాల్ఘర్: మహారాష్ట్రలోని దహాను (ఎస్టీ) స్థానంలో ఎర్ర జెండా రెపరెపలాడింది. సీపీఎం అభ్యర్థి వినోద్ నికోలే విజయం సాధించారు. 5,133 ఓట్లతో బీజేపీ అభ్యర్థి వినోద్ సురేశ్ మేధాను ఓడించారు. వినోద్ నికోలేకు మొత్తం 1,04,702 ఓట్లు రాగా మేధాకు 99,569 ఓట్లు వచ్చాయి. 1978 నుంచి ఈ స్థానాన్ని సీపీఎం గెలుచుకోవడం ఇది పదవసారి. 'రాష్ట్రమంతటా మహాయుతి గాలి వీస్తుండగా దహాను స్థానం అందుకు భిన్నమైన తీర్పునిచ్చింది. అసాధారణ రీతిలో వామపక్ష నాయకుడు వినోద్ నికోలేను గెలిపించింది' అని సీపీఎం నేత అశోక్ ధవాలే అన్నారు. ఈ గెలుపు ఘనత దహాను, తలసరి మండలాలతో పాటు వివిధ వామపక్ష సంఘాల కార్యకర్తలకే చెందుతుందన్నారు. మహావికాస్ అఘాడీలో సీపీఎం భాగస్వామ్యంగా ఉండటం విదితమే. 2009లో పునర్వ్యవస్థీకరణ జరగక ముందు వరకు దహాను స్థానాన్ని జవహర్ (ఎస్టీ)గా వ్యవహరించేవారు.

భవిష్యత్ ప్రణాళికలో కౌలు రైతుల ప్రస్తావనేది?

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం

విశాలాంధ్ర-విజయవాడ: భవిష్యత్ ప్రణాళిక-2047లో కౌలు రైతుల ప్రస్తావన ఏదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య ప్రశ్నించారు. దీంతో కౌలు రైతులకు ఒరిగేదేమీ లేదని శనివారం ఒక ప్రకటన చేశారు. పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు, వ్యాపార సంపన్న వర్గాలకు ఉపయోగపడే పద్ధతుల్లో ప్రణాళిక ఉందని, ఆయా అంశాలన్నీ ఊహాతీతమని వ్యాఖ్యానించారు. బడ్జెట్లో ధరల స్థిరీకరణ నిధి గురించి ప్రస్తావనే లేనప్పుడు భవిష్యత్ ప్రణాళిక-2047లోని అంశాలతో రైతుల ఆదాయం ఎలా పెరుగుతుందని ప్రభుత్వాన్ని నిలదీశారు. గత ప్రణాళిక- 2020పై సమీక్ష నిర్వహించి ఫలితాలు చెప్పలేదన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్లో 90శాతం మంది కౌలు రైతులేనని ఆందోళన వ్యక్తంచేశారు. తలసరి ఆదాయం పెరగక ప్రతి రైతు కుటుంబానికి రూ.2.45లక్షల అప్పు ఉన్నదన్నారు. కౌలురైతులకు ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు పెట్టుబడి సాయం ప్రతి కౌలు రైతుకు అందిస్తామన్నారు కానీ ఖరీఫ్ ముగిసి రబీ వచ్చినా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనపై పాలకుల చిత్తశుద్ధి ఎంతో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని కాటమయ్య, జమలయ్య వ్యాఖ్యానించారు.

ఐక్యతా నినాదమే గెలిపించింది: మోదీ

న్యూదిల్లీ: మహారాష్ట్రలో 'మహాయుతి' విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో మోదీ ప్రసంగించారు. మహారాష్ట్రలో అభివృద్ధి, సుపరిపాలన, నిజమైన సామాజిక న్యాయమే గెలిచాయని, అబద్ధాలు, మోసం ఘోరంగా ఓడిపోయాయని మోదీ అన్నారు. మహారాష్ట్ర అన్ని రికార్డులను తిరగరాసిందన్న మోదీ... గత 50 ఏళ్లలో ఏ పార్టీ గానీ, ఎన్నికల ముందు ఏర్పాటైన కూటమిగానీ ఇంతటి ఘన విజయం సాధించలేదన్నారు. వరుసగా మూడుసార్లు బీజేపీకి అధికారం అందించిన ఆరో రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని తెలిపారు. హర్యానా ఎన్నికల తర్వాత మహారాష్ట్ర నుంచి వచ్చిన అతిపెద్ద సందేశం ఐక్యతేనని పేర్కొన్నారు. 'ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం (ఏక్ హై తో సేఫ్ హై..)' అనే నినాదమే దేశానికి మహా మంత్రంగా మారిందని చెప్పారు. కాంగ్రెస్ అర్బన్ నక్సలిజం దేశానికి సవాల్‌గా మారిందని, దాని రిమోట్ కంట్రోల్ దేశం వెలుపల ఉందని విమర్శించారు. అధికారం కోసం దురాశతో కులతత్వం అనే విషాన్ని వ్యాపింపజేస్తోందని మండిపడ్డారు. మహారాష్ట్రలో అస్థిరత సృష్టించేందుకు యత్నించిన, ద్రోహానికి పాల్పడిన కొందరిని ఓటర్లే శిక్షించారని ప్రధాని అన్నారు. దేశానికి ప్రథమస్థానం ఇచ్చేవారితోనే తప్ప కుర్చీకి ప్రాధాన్యం ఇచ్చేవారితో ఓటర్లు ఉండరని వ్యాఖ్యానించారు. దేశ ప్రజల ఆకాంక్షలను 'ఇండియా' ఐక్య సంఘటన అర్థం చేసుకోలేకపోయిందని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమే ప్రజలకు ఆమోదయోగ్యమైనదని, ప్రపంచంలోని ఏ శక్తీ ఆర్టికల్ 370ను పునరుద్ధరించలేదని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పరాన్నజీవి పార్టీగా మారిపోయిందని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం దానికి కష్టతరంగా మారిందన్నారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు వక్ఫ్‌బోర్డే ఓ ఉదాహరణ అని విమర్శించారు.

ఇలాంటి ఫలితాలు ఊహించలేదు: ఖర్గే



న్యూదిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష మహా వికాస్ అఘాడీకి గట్టి ఎదురుదెబ్బ తగలడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. మహాయుతి కూటమి 230కి పైగా స్థానాల్లో విజయం సాధించడంతో ఇలాంటి ఫలితాలను తాము ఊహించలేదన్నారు. ఈ పరిణామాన్ని లోతుగా పరిశీలించేందుకు, అసలు కారణాలేంటో తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఛత్రపతి శివాజీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావజాలానికి తామే నిజమైన ప్రతినిధులమని, తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. జార్ఖండ్ ప్రజలు మాత్రం తమ హక్కులు, నీరు, అటవీ, భూ సమస్యలకు ప్రాధాన్యమిచ్చారని ఖర్గే పేర్కొన్నారు. అందువల్లే విభజనవాద, నకిలీ రాజకీయాలను తిరస్కరించారన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడతామని, ప్రజల గొంతుక వినిపిస్తామన్నారు. జార్ఖండ్‌లో జవాబుదారీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజాస్వామ్య, లౌకికవాదం విజయం: స్టాలిన్

జార్ఖండ్‌లో విజయం సాధించిన హేమంత్ సోరెన్, ఇండియా కూటమికి తమిళనాడు సీఎం స్టాలిన్ అభినందనలు తెలిపారు. అధికార దుర్వినియోగంతో కూడిన ప్రతీకార రాజకీయాలు, గత ఐదేళ్లలో బీజేపీ అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ... ధైర్యంగా, దృఢ సంకల్పంతో ఎదురొడ్డి నిలబడిన హేమంత్ విజయం సాధించారని ప్రశంసించారు. అన్ని పార్టీలను కలుపుకొని తీసుకెళ్లే ఆయన నాయకత్వంపై జార్ఖండ్ ప్రజలు తమ విశ్వాసాన్ని ఈ ఎన్నికల్లో వ్యక్తపరిచారన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి ఇదో గొప్ప విజయమని అభివర్ణించారు.

చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు

పోలీసుల అదుపులో ముగ్గురు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడుపై ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రాళ్ల దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. 2022 నవంబరు 5న అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబు నందిగామలో పర్యటించారు. నందిగామ రైతు బజార్ వద్ద చందర్లపాడు రోడ్డులో వీధిలైట్లు ఆర్పి చంద్రబాబు లక్ష్యంగా రాళ్ల దాడి చేశారు. అయితే ఆ ఘటనలో చంద్రబాబు నాయుడు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూదన్ రావుకు రాయి తగలడంతో గాయపడ్డారు. నాడు వైసీపీ ప్రభుత్వం ఈ కేసు నమోదు చేసినా దాని గురించి పట్టించుకోలేదు. తాజాగా పోలీసులు ఈ కేసును వెలుగులోకి తీసుకొచ్చి విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో నందిగామకు చెందిన కనికంటి సజ్జన్ రావు, బెజవాడ కార్తీక్, పరిమి కిషోర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆదివాసీ కోటలో సోరెన్ జోడీ పాగా

రాంచి: ఆదివాసీ కోటలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) మరోసారి జయకేతనం ఎగురవేసింది. ఈడీ కేసులు మొదలు... అరెస్టులు... తిరుగుబాట్లు.. ప్రత్యర్థుల వ్యూహాలు... ఇలా అనేక సవాళ్లు ఎదుర్కొన్న జేఎంఎం... ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ అద్భుత విజయం సాధించింది. 'బంటీ ఔర్ బబ్లీ'గా పేరొందిన హేమంత్-కల్పనా జోడీ సూపర్ హిట్ కొట్టింది. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి రాజకీయ అస్థిరతకు చిరునామాగా నిలిచిన జార్ఖండ్‌లో మరోసారి స్పష్టమైన మెజార్టీ సాధించి సుస్థిర పాలన దిశగా అడుగులు వేసేందుకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందే జార్ఖండ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓ భూ వివాదానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ అరెస్టై జైలుకు వెళ్లడం సంచలనం రేపింది. ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించిన బీజేపీ... హేమంత్ ప్రభుత్వం అవినీతిమయమైందని, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మద్దతిస్తోందని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టింది. దాని వల్ల గిరిజనులకు చెందాల్సిన వనరులను వారు దోచుకుంటున్నారని ఆరోపించింది. చంపై సోరెన్‌ను సీఎం పదవి నుంచి తప్పించడం గిరిజనులను అవమానపరచడమేనని ప్రచారం చేసినప్పటికీ ఫలితాలు ఆ పార్టీకి అనుకూలంగా రాలేదు. ప్రధాన భాగస్వామ్య పక్షం (కాంగ్రెస్) ఆశించిన మద్దతు ఇవ్వకున్నా... సంక్షేమ పథకాలు, ఆదివాసీ సెంటిమెంటును నమ్ముకున్న సోరెన్ ప్రభుత్వం అనుకూల ఫలితాలు సాధించింది. హేమంత్ అరెస్టును రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆరోపించిన జేఎంఎం... ఆదివాసీ సెంటిమెంటును తమవైపు తిప్పుకొంది. ముఖ్యమంత్రి మైయా సమ్మాన్ యోజన పేరుతో మహిళలకు నెలకు రూ.వెయ్యి ఇచ్చే పథకాన్ని ప్రధానంగా ప్రచారం చేసిన సోరెన్ సర్కారు... ఈ మొత్తాన్ని రూ.2500లకు పెంచుతామని హామీ ఇచ్చింది. 'సర్నా'ను ప్రత్యేక మతంగా గుర్తించాలని తీర్మానిస్తూ కేంద్రానికి లేఖ రాయడం కూడా కలిసొచ్చినట్లు కనిపిస్తోంది. హేమంత్ అరెస్టుతో సీఎం పగ్గాలు చేపట్టిన చంపై... సోరెన్ బయటకు రాగానే రాజీనామా చేయాల్సి వచ్చింది. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. హేమంత్ వదిన సీతా సోరెన్ కూడా కాషాయ కండువా కప్పుకోవడం జేఎంఎంకు ఎదురుదెబ్బగా మిగిలింది.

ఆదివాసీ ప్రాంతాల్లో చంపైకి ఉన్న ప్రజాదరణ ఆ వర్గం ఓట్లను చీలుస్తుందని, అది జేఎంఎం-కాంగ్రెస్ కూటమిపై ప్రభావం చూపిస్తుందని భావించినప్పటికీ ఫలితాలు వేరుగా వచ్చాయి.

సూపర్ హిట్ జోడీ

హేమంత్ అరెస్టుతో ఆయన సతీమణి కల్పనా సోరెన్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. అదే సమయంలో గాండేయ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేస్తూ బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. అనతి కాలంలోనే రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత హేమంత్, కల్పనా కలిసి దాదాపు 200 సభల్లో పాల్గొన్నారు. 'బంటీ ఔర్ బబ్లీ'గా పేరొందిన వీరిద్దరి జోడీ రాష్ట్ర రాజకీయాల్లో ఆకర్షణగా నిలిచింది. ఈ ఎన్నికల్లో ప్రధాన భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఆశించిన మేర ఫలితాలు సాధించనప్పటికీ జేఎంఎం మాత్రం మెరుగైన ఫలితాలు అందిపుచ్చుకుంది. రాష్ట్రంలో 28 స్థానాలు ఎస్టీలు, తొమ్మిది ఎస్సీ రిజర్వుడ్ స్థానాలుండటం ఆ పార్టీకి కలిసొచ్చింది.

చిగురించిన ఆశలు

చింతలపూడి ఎత్తిపోతలపై ప్రభుత్వం సానుకూలత

న్యాయబద్ధ పరిహారంపై అన్నదాతల ఎదురుచూపు

విశాలాంధ్ర-లింగపాలెం: ఏలూరు జిల్లా చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అసెంబ్లీలో చర్చించటం... దీనిపై రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇచ్చిన సమాధానంతో త్వరలోనే ఎత్తిపోతలకు మోక్షం లభిస్తుందనే నమ్మకాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకానికి చింతలపూడి మండలంలో భూసేకరణ చేసిన 200 ఎకరాలకు సంబంధించి ధర నిర్ణయించడంలో అన్యాయం జరిగిందంటూ రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. దీంతో కాలువ నిర్మాణపు పనులు నిలిచిపోయాయి. పోలవరం ప్రాజెక్టు నీరు ఈ కాలువ ద్వారానే వస్తుందని దశాబ్దకాలంగా రైతన్నలు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరటం... ప్రభుత్వం నుంచి సానుకూల సమాధానం రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్రంలో ఐదు ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాన్ని గుర్తించామని దీనిలో చింతలపూడి ఎత్తిపోతల కూడా ఉందని ప్రభుత్వం నుంచి సమాధానం రావటమే అన్నదాతల్లో ఆనందానికి కారణం. దీన్ని త్వరగా పూర్తిచేస్తారన్న నమ్మకాన్ని ఏలూరు... ఉమ్మడి కృష్ణాజిల్లాల ప్రాంత రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చింతలపూడి ఎత్తిపోతలను పరిశీలిస్తే... 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత రాజశేఖర్ రెడ్డి కే.కోట వద్ద ఎత్తిపోతలకు శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.1,700 కోట్లు అంచనా వేశారు. కాలువ నిర్మాణానికి ఏడువేల ఎకరాల భూమి అవసరం అవుతుందని గుర్తించారు. కాలువ నిర్మాణం జరిగితే ఉమ్మడి పశ్చిమ, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాలకుసాగునీరు అందుతుంది. అయితే భూసేకరణలో పలు సమస్యలు తలెత్తాయి. కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే వల్ల కాలవ నిర్మాణం నిలిచింది. ప్రధానంగా చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి,రేచర్ల, వెంకటాపురం, శెట్టి వారిగూడెం ప్రాంత రైతులు గోపాలపురం మండలంలోని గుడ్డి గూడెం, జగన్నాథపురం తదితర గ్రామాల రైతులు ప్రభుత్వం ఇచ్చే ధర నష్టం కలిగిస్తుందంటూ గిట్టుబాటు ధర చెల్లించాలని కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. స్టే ఎత్తివేసి కాలువ నిర్మాణం చేపట్టాలంటే ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అసెంబ్లీలో లేవనెత్తారు. సానుకూలత లభిస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు.

అడ్డంకులు అధిగమించాలి: నిపుణులు

చింతలపూడి ఎత్తిపోతల కాలువ నిర్మాణం సాధ్యమయ్యేనా అనే ప్రశ్న కూడా తలెత్తుతుంది. కాలువ నిర్మాణం పూర్తవ్వాలంటే అనేక సమస్యలను పరిష్కరించుకోవలసిన ఉందని నిపుణులు అంటున్నారు. కాలువ నిర్మాణానికి సేకరించిన భూమిలో 2,200 ఎకరాలు అటవీ భూమి ఉంది. అటవీ భూమని తెలిసినా పర్యావరణ అనుమతులు లేకుండానే కొంత భూమిలో కాలువ తవ్వేశారు. దీనిపై 2018లో గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో వ్యాజ్యం జరిగింది. రిజర్వ్ ఫారెస్ట్‌కు రూ.72 కోట్లు ప్రభుత్వం పెనాల్టీ చెల్లించాలని తీర్పుచెప్పింది. దీనిపై 2022లో గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా కొంతమేర పెనాల్టీ తగ్గించి గ్రీన్ ట్రిబ్యునల్ లోనే తేల్చుకోవాలని తీర్పు వచ్చింది. దీనిపై వ్యాజ్యం జాప్యం అవుతూనే ఉంది. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీతో కాలువ నిర్మాణం జరగాలంటే ఆటంకాలను అధిగమించాల్సిన అవసరం ఉందని నిపుణులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్మాణం కోసం అటవీ భూమి ఎంత తీసుకున్నారో ఆ భూమిని అప్పగించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఈ భూమిలో చెట్ల పెంపకానికి ప్రభుత్వమే నిధులు కేటాయించాల్సి ఉంది. ఇదిలా ఉంటే కాలువకు శంకుస్థాపన చేసినప్పుడు అంచనా వ్యయం రూ.1,700 కోట్లుగా నిర్ధారించగా, తాజా అంచనాల ప్రకారం కాలువను పూర్తి చేయాలంటే రూ.ఏడువేల కోట్లు అవసరం అవుతుందని నిపుణుల అంచనా. ఏడాదికి రూ.రెండు వేల కోట్లు బడ్జెట్లో కేటాయించాల్సి ఉంది. కృష్ణాజిల్లాలో భూసేకరణకు సంబంధించి అప్పటిలో ఎకరాకి రూ. 21 లక్షలు ఇచ్చారు. చింతలపూడి మండల రైతులకు మాత్రం రూ.15 లక్షలకే పరిమితి విధించడంతో ఆగ్రహంతో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించుకోవలసిన అవసరం ఉంది. రైతులను సమన్వయం చేసుకొని వారి ఆమోదంతో ధర చెల్లిస్తే వీరు అంగీకరిస్తారు. కాలువ తవ్వకానికి అడ్డంకులు తొలగుతాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం... కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావటం కలిసొచ్చిన అంశం. కేంద్ర ప్రభుత్వం ద్వారా కావలసిన అనుమతులను సత్వరమే పొందగలిగితే కాలువ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోతాయి. లక్షల ఎకరాలకు నీరు అందుతుంది. దశాబ్దంన్నర నాటి కల నెరవేరుతుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.